
FREEDOM
PEACE
PROGRESS
THE UNITED YOUTHLEAGUE
FREEDOM
PEACE
PROGRESS

ఆంధ్రరాష్ట్రవిద్యార్థి

నవయుగ

యువజన మాసపత్రిక

సంపుటి 1 1947 అక్టోబరు సంచిక 8

జోహార్లు

కామ్రేడ్ చిత్తరంజనదత్తు సెప్టెంబరు 7 న మనను వీడి పోయాడు. కామ్రేడ్ దత్తు మరణంతో ఆంధ్ర విద్యార్థిలోకం ఒక అపూర్వ విద్యార్థి సేవకుణ్ణి కోలుపోయింది.

నిరుడు సంవత్సరం బందరు విద్యార్థులు ప్రిన్సిపాలు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. ఈ పోరాటంలో కామ్రేడ్ దత్తు తన విద్యుక్త కర్తవ్యాన్ని నిపుణతతో నిర్వహించాడు. సమ్మె కాలంలో ముఖ్య కార్యకర్తలలో ఒకనిగా విద్యార్థులు కామ్రేడ్ దత్తును గుర్తించి గౌరవించారు. కామ్రేడ్ దత్తు క్లాసులోకెల్ల చురుకైన విద్యార్థులలో ఒకడు పరీక్షలలో ఫస్టు క్లాసులో ఉత్తీర్ణుడవుతాడని ప్రతిఒక్కరూ ఆశించారు. కాని బందరు ప్రిన్సిపాలు కామ్రేడ్ దత్తు యొక్క సంవత్సరాల కృషిని పొట్టన బెట్టుకొన్నాడు. పబ్లిక్ పరీక్షలకు పంపుటకు వెనుకటి తన చర్యలకు క్షమాపణ యివ్వమని నిర్బంధించాడు. కామ్రేడ్ దత్తు ఎంతటి త్యాగమన్నా జేస్తాగాని సక్రమపంథా అని నమ్మి పోరాడిన విద్యార్థులకు ద్రోహం జేయనన్నాడు. ప్రిన్సిపాలు మన దత్తును పరీక్షలకు పంప నిరాకరించాడు,

ఈ సంవత్సరం తిరిగి తన విద్యను కొనసాగించుటకు కాలేజీల చుట్టు ప్రదక్షిణాలు తిరిగి చివరకు కాకినాడలో జేరాడు ఇంతలోనే టైఫాయిడ్ మహమ్మారి వచ్చి మన దత్తును పట్టుకొంది. రెండునెలలు టైఫాయిడ్‌ను ఎదిర్చి పోరాడాడు చివరకు యీ మహమ్మారి మన దత్తును పొట్టపెట్టుకొంది. సెప్టెంబరు 7న మన దత్తు మనల విడిచిపోయాడు.

కామ్రేడ్ దత్తు తలిదండ్రులు ముదుసలులు. దత్తు వీరికి పెంపుడు కొడుకు. పుత్రశోకంతో దుఃఖంలో మునిగియున్న తలిదండ్రులకు మా సానుభూతిని ప్రకటిస్తున్నాం

కామ్రేడ్ దత్తు ఆదర్శంగా ఎదిర్చి పోరాడిన నిరంకుశ విధాననిర్మూలనకు విధివిరామం లేకుండా పోరాడుతామని ప్రతిజ్ఞ చేయుచున్నాం. ఆదర్శవిద్యార్థిగా ముందుకు వచ్చిన కామ్రేడ్ దత్తుకివేమా జోహార్లు.

ఇట్లు,

బందరు విద్యార్థులకు శిక్షలు

నిరుడు బందరు కాలేజీలో వందలకొలది విద్యార్థులను ప్రిన్సిపాలు డిటెయిన్ చేశాడు ఈ నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విద్యార్థులు సమ్మెచేశారు. సమ్మెజేస్తున్న విద్యార్థులు ప్రిన్సిపాలుచే తమ హక్కుల నంగీకరింపజేయుటకు, ప్రిన్సిపాలు గేటుముందు పికెటింగు ప్రారంభించారు.

నిరుడు బందరు ప్రిన్సిపాలు తనపైకి దొమ్మికి వచ్చినారని, డిటెన్షన్‌లకు వ్యతిరేకంగా సమ్మెచేసి పికెటింగుచేస్తున్న విద్యార్థులపై పోలీసులకు దొంగరిపోర్టు యిచ్చాడు. ప్రిన్సిపాలు రిపోర్టును నమ్మి పోలీసులు 22 మంది విద్యార్థులను అరెస్టుజేసి తప్పుడుకేసు బనాయించారు. విచారణలో, ప్రిన్సిపాలు వాఙ్మూలంలోగూడ యిది తప్పుడుకేసని రుజావు అయింది ఏడునెలలు విద్యార్థులను కోర్టుచుట్టుతిప్పి సెప్టెంబరు 11 న ఒక్కొక్క విద్యార్థికి రు 25 లు జరిమానాగాని లేక 15 రోజులు శిక్షగాని విధిస్తూ తీర్పు చెప్పబడింది.

ఆగస్టు 15 న రాష్ట్రంలో అనేక కేసులు ఎత్తివేస్తూ మద్రాసు ప్రభుత్వం అర్డర్లను జారీచేసింది. బందరు విద్యార్థులపై కేసునుగూడ ఉపసంహరించుకొనమని ప్రభుత్వమునకు విద్యార్థి సంఘాలు విన్నవించాయి. మహజర్లు, తీర్మానాలు పంపాయి కాని ప్రభుత్వం వీటిని పాటించలేదు, ఇట్టి దొంగకేసులను సాగనిచ్చుట, శిక్షలు పడనిచ్చుట విచారకరం. ఇప్పటికయినా మద్రాసు మంత్రివర్గం ఈకేసులో విధించిన జరిమానాలను రద్దుజేస్తారని, వసూలుజేసిన జరిమానాలను వాపసుజేస్తారని ఆశించుతాం ఇందుకు విద్యార్థి యువజన మొదలైన ప్రజాసంఘాలు ఆందోళన జేస్తాయని నమ్ముతాం,

ప్రభుత్వ నిషేధాజ్ఞలు

కొద్దిరోజుల క్రితం మద్రాసు ప్రభుత్వం శ్రీ అల్లూరి సీతారామరాజు బుర్రకథ, సిమ్లాభాగవతం వీధినాటకాల ప్రదర్శనాలను నిషేధించుతూ అర్డర్లు జారీచేసింది. తెలంగాణా ప్రజల వీరోచిత పోరాటాన్ని చిత్రించే 'మాభూమి' నాటకప్రదర్శనాన్ని పశ్చిమగోదావరిజిల్లా మెజిస్ట్రేటు నిషేధించాడు. ఇది ఇలావుండగా 'ప్రజాశక్తి' దినపత్రిక జమీందారీ వ్యతిరేక పోరాటాలనుగురించి, కార్మిక హక్కులను గురించి ప్రకటించిన వ్యాసములకు, వార్తలకు రెండువేలరూపాయల ధరావతును మద్రాసు ప్రభుత్వం కోరింది, భారతదేశం ఒకప్రక్క స్వాతంత్ర్యము పొందుతూనే, యీ ఘటనలన్నీ జరిగాయి. ఇవన్నీ రాష్ట్రంలో కాంగ్రెస్ మంత్రివర్గం అధికారంలో యుండగనే జరిగాయి, ప్రభుత్వంయొక్క యీ చర్యలు స్వతంత్రాభిమానులనెల్ల బాధింపక తప్పవు.

శ్రీ అల్లూరి సీతారామరాజు బ్రిటిష్‌వాళ్ళతో పోరాడిన ఆంధ్రవీరుడు సీతారామరాజన్న బ్రిటిషువాళ్ళకు బెదురు, ద్వేషం. ప్రతి భారతీయుడూ సీతారామరాజువంటి త్యాగి, యోధుడూ అవ్వాలని ఆశించవలసిన ప్రజాప్రభుత్వం, ఈనిషేధం ఎందుకుపెట్టాలి?

సిమ్లా భాగవతంలో ముగ్గురు బ్రిటిష్‌మంత్రుల కుట్రలను వాటిని ఐక్యంగా ఎదుర్కోమని రచయిత చక్కగా వ్యక్తపరిచాడు. ఇందులో నిషేధింపవలసిన దేమిటి?

'మాభూమి' నాటకం మన సోదర తెలంగాణా ప్రజల పోరాట ప్రతిబింబం. నిజాం నిరంకుశత్వాన్ని ఎదుర్చుట యీరోజు ప్రతి భారతీయుని ధర్మం ప్రతిఆంధ్రుని కర్తవ్యం. ఇట్టి సమయంలో 'మాభూమి'ప్రదర్శనాన్ని పశ్చిమగోదావరిజిల్లాలో ఎందుకు నిషేధించాలి?

ఇట్లే వెనుకటి సామ్రాజ్యవాద శాసనాల పేరుబెట్టి 'ప్రజాశక్తి' నుండి రెండువేల రూపాయలు ధరావతు గోరబడింది.

ఈ చర్యలన్నీ నిరంకుశ పోలీసుఅధికారుల తప్పుడు రిపోర్టులను నమ్మి మంత్రివర్గం చేసిందని నమ్ముతున్నాం. ఈ చర్యలు ప్రజాప్రభుత్వానికి కళంకంతెచ్చేవనీ, తమ నిర్ణ


యువజన మహాసభను జయప్రదం చేయండి!

పెదవడ్లపూడి మరొక ప్రేగ్ కావాలి!

ప్రధమ ఆంధ్ర యువజన ఫెడరేషన్ మహాసభ అక్టోబరు 17, 18, 19 తేదీలలో పెదవడ్లపూడి (గుంటూరుజిల్లా)లో జరుగుతుంది. ఆంధ్ర యువజనోద్యమ పితామహులైన చంద్రరాజేశ్వరరావుగారు మహాసభకు అధ్యక్షత వహించటానికి అనుమతించటం మనఅదృష్టం. తదితర విజ్ఞానవేత్తలు, విఖ్యాతిగాంచిన ప్రముఖులు మహాసభకు వస్తారు.

ఆంధ్రదేశ చరిత్రలో యీ మహాసభ అతి ప్రాముఖ్య స్థానాన్ని అలంకరించబోతోంది. కష్టపడి కృషిచేసి కార్మిక, కిసాన్‌యువకులు, మేధావి వర్గానికి చెందిన తదితర నవజీవనులు గంగా యమునా సంగమంలా కలవబోతున్నారు.

పెదవడ్లపూడి గ్రామంనవశక్తితో అలరారబోతోందియువకమూర్తుల ముందున్న సమస్యలు పృధుతరమైనవి. బాధ్యతలు గురుతరమైనవని గుర్తించుకోండి. రక్తాంజలిని అర్పించి మనం స్వాతంత్ర్యాన్ని సాధించాం సాధించిన స్వాతంత్ర్యాన్ని సుస్థిరం చేయాల్సింది యువకసింహాలు దేశ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని జయప్రదమొనర్చాల్సింది ధైర్యోత్సాహులుగల యువకధీరులే విశాలాంధ్ర నిర్మాణానికి, తద్వారా ఆంధ్రుల అభ్యున్నతికి అవిరళకృషిని చేయాల్సింది మనమే మతకలహాల మహామారిని మట్టుపెట్టటానికి ముందుశ్రేణిలో నిలబడాల్సింది యువజన శేఖరులే మరోప్రక్క బలిష్టమైన శారీరక పౌష్టవాన్ని, ఆటలద్వారా ఆస్వాదించుకోవాలి నిద్రపోయే ప్రజలను ప్రాచీన కళారూపాలద్వారా మేల్కొల్పి, సంఘదురాచారాల దుమ్ముదులిపి పవిత్ర బాధ్యత యువకులమైన మనపై వుంది సమాజంలోవున్న అజ్ఞానాంధకారాన్ని రూపుమాపి విజ్ఞానజ్యోతులను వెలిగించాలి అనాడే "యువకులు జాతికి జీవగర్ర" అనే లోకోక్తిని రుజువుపర్చుకొంటాం.



పై బాధ్యతలను నిర్వర్తించాలంటే మనం పై మహాసభలో నిర్ణయాలను తీసుకోవాలి అప్పటికప్పుడే మహాసభను జయప్రదం చేయటానికి ఇతోధికకృషి చేస్తున్నారు ఉదార స్వభావంతో విరాళాలను కుంభవర్షంలా కురిపిస్తున్నారు పెదవడ్లపూడియువకులు రెట్టించిన ఉత్సాహంతో సువిశాలమైన పందిళ్ళను నిర్మిస్తున్నారు తదితర సౌకర్యాలను చేకూర్చేందుకు బాధ్యతను భుజస్కంధాలపై నిడుకొని కృషిచేస్తున్నారు

అయితే మహాసభలో ఏమేమి ఉంటాయ్ అనే అనుమానం ఉత్పన్నంకావచ్చు అయితే వినండి! అంతర్జాతీయ కళా ప్రదర్శనం, వివిధ దేశాలనుండి సంపాదించిన వస్తు ప్రదర్శనం, ఇవి వివిధ దేశాలకళలను, జీవితాలను కళ్ళకు కట్టినట్లు వ్యక్తపరుస్తాయ్ మాటుమణిగివున్న ఆంధ్ర కళారీతులు తిరిగి వైజ్ఞానిక ప్రదర్శనాలలో ప్రతిబింబించుతూ యువ కళాకారులు చూపెట్టుతారు. ఈ వైజ్ఞానిక సంపత్తిని యువక హృదయాలకు యీమహాసభ అందిస్తూ మరోప్రక్క రాజకీయస్థాయిని పెంపొందించేందుకు నేటి దేశీయ సమస్యలపై చర్చలు జరుగుతాయి. అందుకు ముందుగానే వివిధతీర్మానాలను యువకులకు విరివిగా అందిస్తున్నాం, కనుక యీ మహాసభ విజ్ఞానసంపత్తితోపాటు, రాజకీయ స్థాయిని పెంపొందించుతుంది.

విశాలాంధ్ర మారుమూలలనుండి యీ అమూల్యావకాశాన్ని వినియోగించుకొనేందుకు వేలాది యువకులు పెదవడ్లపూడి రానున్నారు. అన్ని వర్గాలకు కార్మిక, కర్షక, విద్యార్థి మధ్యతరగతికిచెందిన యువకులు హాజరవబోతున్నారు. నిజంగా ఆ మూనాళ్ళు పెదవడ్లపూడి గ్రామం ముచ్చటగా వుంటుంది. అందుకు సందేహంలేదు దానికి ప్రబల నిదర్శనం కావాలా?

అదిగో! అప్పుడే కృష్ణా యువ కళాకారులు వైజ్ఞానిక పోటీకి ఆయత్తపడుతున్నారు, అదేవిధంగా పలు ప్రాంతాలనుండి నవ చిత్రకారులు తమ రంగికా తూలికలకు పని కల్పించుచున్నారు కనుకవెంటనే ప్రతియువకళాకారుడు, నవ చిత్రకారుడు పోటీకిఆయత్తపడాలి. తద్వారా ఆంధ్రకళా సంపత్తిని ఇతోధికం చేయాలి ఆంధ్ర యువకులు విద్యార్థులంతా 17 ఉదయానికే.7 గంటలకల్లా పెదవడ్లపూడి పురంలోని ఆంధ్ర యువజన నగర్ చేరుకోవాలి పెదవడ్లపూడిని మరోక ప్రేగ్‌గా మార్చాలి.అప్పుడు ఆంధ్రయువకులు భారత దేశానికి వెలుగుచుక్కై వెలుగొందాలి మణిముత్యమై మనుగడను సాగించాలి

ప్రేగులో ప్రపంచ యువజనోత్సవాలు

ఆశియా దేశాల ప్రముఖపాత్ర

చరిత్ర ప్రసిద్ధమైన ప్రేగ్‌నగర్ పురాతన వీధులు నేడు వివిధదేశ యువతీ, యువకులతో వారివారి జాతీయ పతాకాలతో కళకళ లాడుతోంది. 61 దేశాల యువకులు జాతి, మత, రంగు వివక్షత లేకుండా తమ అందరకు సంబంధించిన ప్రధాన సమస్యల చర్చించటానికి సమావేశ మయ్యారు. వీరిలో శ్రమజీవులైన కార్మిక, కర్షకులు, విద్యార్థులు, మేధావంతులు, ఆటగాండ్రు, కళావేత్తలు అందరూ ఉన్నారు

ఆసియాకు ప్రత్యేక గౌరవం

ఇండియా, ఇండొనీషియా, వీట్‌నామ్ ప్రతినిధులుమహాసభలో ఎక్కువగా శ్లాఘింపబడ్డారు. వీరికి తమ దేశాల్లో ఫాసిస్టు ప్రభుత్వాలతో పోట్లాడుతున్న గ్రీక్, స్పెయిన్ యువకులతోపాటు, వూరేగింపు ప్రథమశ్రేణిలో నిలబడి నడిచే గౌరవం యివ్వబడింది నిజంగా ఇండొనీషియా ప్రతినిధివర్గ నాయకుడు సోగ్జినోను పైకి ఎత్తి, ఒకరి చేతిలోనుండి మరొకరి చేతికి, కొంతసేపు గాలిలో త్రిప్పారంటే అదివిన్న ఏ ఆసియావాసి ఆనందంలో ముగ్ధుడు కాడు? ఇండియా అంటే ప్రేగ్ ప్రజలకిప్రత్యేక అభిమానం వున్నట్లు కనిపించింది. మన ప్రతినిధివర్గం ఎక్కడికు వెళ్ళినా పెద్దా చిన్నా, స్త్రీ,పురుష తారతమ్యం లేకుండ ప్రజలు గుమిగూడి, చిరునవ్వులవర్షం కురిపిస్తూ వారికున్న ఆదరాభిమానాలను వ్యక్తపరుస్తుండేవారు. ఫొటోలు తీసికొనేవారు, చేవ్రాలు తీసుకునేవారు భారత ప్రతినిధులకు సహాయముచేయటానికి, వారి స్వంతపనులను కూడ లెక్కచేసేవారుకాదు. ఏదైనా ఒక ప్రాంతానికి పోవటానికి దారి అడిగితే వెంటనే తాము చేస్తున్నపనివి మానుకొని వెంటవచ్చి, ఆ ప్రదేశానికి చేర్చేవారు

వినోదాలు

వివిధదేశపు వైజ్ఞానికదళాలు తమ ప్రదర్శనాలను ఎంతో నైపుణ్యంతో ప్రదర్శించారు అవి చూస్తున్నపుడు ప్రతినిధులు, జెక్ ప్రజలు పొందిన అమితానందంచూసి గ్రహించవలసిందేగాని, వర్ణించడం కష్టం. నాట్యశాలలు ఎల్లపుడు వాటి తాహతుకు మించి క్రిక్కిరిసి వుండేవి. ఒకే సమయంలో అనేక కార్యక్రమాలు జరుగుతుండేవి అన్నిటికి హాజరుకావడం మానవశక్యంగాని పని. అందువల్ల మేము కొన్ని ప్రదర్శనాలను మాత్రమే చూడగలిగాం. మంగోలియా యువతీ యువకులు, అందమైన స్వదేశీ దుస్తులతో, తమ ప్రాచ్య సంగీతాన్ని పశ్చిమ వాయిద్యాలకు అన్వయించి పాడుతూ నాట్యంచేసినపుడు ప్రేక్షకులు అమితానందం పొందారు కొరియనుల నాట్యాలు మరపురాని సంతోషాన్ని కలిగించాయి నీగ్రోనాయకుడు బ్రిక్‌కూవర్ అందరి నోళ్ళలోను మెలిగాడు భారత యువతులు రంగురంగుల చీరలతో చేసిన నాట్యం ప్రేక్షకులను పుర్రూత లూగించింది. ఇండొనీషియనులు, వీట్‌నామీయులు యుద్ధనృత్యాలను చేశారు. అనేక పాటలు పాడారు సిలోను యువతిచేసిన నృత్యం అసమానంగా వుంది. మన ప్రతినిధివర్గం గురుదేవ్‌ఠాగూర్ దినోత్సవంనాడు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది ప్రేగ్‌లోని ప్రాచ్య విద్యాకళాశాలలో ప్రొఫెసరుగా పనిచేస్తున్న గురుదేవ్ విద్యార్థి, దీనిని ప్రారంభించాడు ఉపన్యాసకులు గురుదేవ్ జీవితాన్ని వివరిస్తూ, ఆయన సాహిత్యసేవను శ్లాఘించారు. కొందరు విద్యార్థులు గురుదేవ్ పాటలను పాడారు. ఈ పాటలను ప్రేక్షకులు అమితంగా మెచ్చుకున్నారు.

సభా నిర్వాహకులు అనేక ప్రసంగాలు, చర్చలు ఏర్పాటు చేశారు. వాటిలో చాలమంది ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రముఖ పత్రికా రచయితలు, రాజకీయవేత్తలు వుపన్యసించారు. స్పెయిన్, వీట్‌నాం ఇండొనీషియా, గ్రీస్‌లమీద ప్రత్యేక ప్రసంగాలు చేయబడ్డాయి. యుద్ధ సమయంలోను, శాంతికాలంలోను సోవియటుయువకుల అసమాన పాత్రను ప్రపంచ యువకులు విన్నారు. దూర ప్రాచ్యంలో సంచారంచేసి, వలసరాజ్య ప్రజల జీవిత పరిస్థితులను పర్యవలోకించిన రాయబారవర్గ నివేదికను ప్రతినిధులు శ్రద్ధగావిని. విస్మెర పోయారు.

ముగింపు

61 దేశాల యువకులు భుజంభుజం కలిపి, పాటలు పాడుతూ, క్రొత్తక్రొత్త స్నేహాలు

(మిగతా 11 వ పేజీలో)



ప్రపంచ యువజన ప్రదర్శనలో పాల్గొని ప్రేక్షకుల మన్ననలను పొందిన సోవియట్ సెంట్రల్ ఏషియా నర్తకి

★ నేటి ఆహారసమస్యా

— ముక్కామల నాగభూషణం

(ఆంధ్రరాష్ట్ర రైతు సంఘాధ్యక్షులు)

★



"అన్నంలేక చచ్చేవారుండరు" అంటారు పెద్దలు, అయితే మన పరిస్థితిమాత్రం దానికి భిన్నంగా వున్నది. "అన్నమో రామచంద్రా" యనే ఆర్తనాదాలకు అంతులేదు. గంజి, కడుగు తాగుతూ, ఆకుఅలము తింటూ కృశించి కృశించి నశించిపోయే పరిస్థితు లేర్పడ్డాయి. విశాఖ, రాయలసీమ మున్నగుప్రాంతాలలో చావులు ప్రారంభమయ్యాయి. పలనాడు, వినుకొండ మొదలైన తరుగు ప్రాంతాల బీదలు వలసపోతున్నారు. రాయలసీమ తదితర తరుగుప్రాంతాల గ్రామాలలో వారాల తరబడి రేషనుషాపులు మూసివుంటున్నాయి. మిగులుప్రాంతాల గ్రామాలలోకూడా కొన్నింటికి సప్లయిలు రావడంలేదు. కొన్ని పట్టణాలలో 8 ఔన్సుల రేషన్లయినా సరిగాఅందడంలేదు. కొనగల తాహతువున్నవారు బియ్యం బస్తా 1 కి రు 60 లు మొదలు రు 125 వరకు పెట్టి కొంటున్నారు. తరుగు ప్రాంతాలలోని మధ్యతరగతి రైతులు భూమిపుట్రా అమ్మివేసి ధాన్యం తెచ్చుకోవలసి వస్తోంది. చెంబు ముంత, గుడిసె, తడక తాకట్టుపెట్టిన నిర్భాగ్యులు కాలుగాలినపిల్లివలె ఊళ్ళవెంటబడి తిరిగితే చివరకు రూపాయకుశేరో అర్థశేరో? బియ్యం కొంగులో పడతాయి. లేకపోతే అదీలేదు. అందుచేత దుంపలు, తూట్నా ఆకు,ఆలమూ తింటూ పేద ప్రజలు చావలేక - బ్రతకలేక-జీవచ్ఛవాలవలె కాలాన్ని గడుపుతున్నారు.

ఈ దుస్థితినుండి మనం బయటపడాలంటే జమీందారీ, ధనిక భూస్వామిక విధానాలను రద్దుచేయాలి. దున్ని పండించే వారికి భూమియివ్వాలి. శరవేగంతో వ్యావసాయక పునర్నిర్మాణం జరగాలి. అలాచేస్తే మన జనాభా ఎంత పెరిగినా సరే సమృద్ధిగా ఆహార పదార్థాలు అందరికి లభ్యమవుతాయి.

అయితే అంతవరకు మనం కరువుకాటకాలతో బాధ పడవలసిందేనా? అవుసరంలేదు. ఒకవైపున అధికాహారోత్పత్తికొరకు కృషి చేయడంతోపాటు మరొకవైపున మనకు పండిన ధాన్యాన్ని సరిగా సేకరించి సక్రమంగా వినియోగిస్తే కరువును అరికట్టగలుగుతాం. మన ప్రజానీకాన్ని పోషించుకోగలుగుతాం. కాని ధాన్యసేకరణమాత్రం సరిగా జరుగడంలేదు. అందువల్లనే మన ఆహారపరిస్థితి విషమరూపం దాల్చింది. ఈక్రింది వివరాలను చూస్తే ఈ విషయం సరిగా బోధపడుతుంది. మన మద్రాసు రాష్ట్రంలో-

ఆహారధాన్యాలు	1940 నుండి 46 వరకు సగటుసాలుసరి ఉత్పత్తి (టన్నులు)	1946 ఉత్పత్తి (టన్నులు)	1947 ఉత్పత్తి (టన్నులు)
బియ్యం	48,66,667	42,41,000	47,95,000
జొన్నలు	26,52,000	21,27,000	21,14,000
గోధుమ	1,730		
	75,20,397	63,68,000	69,09,000

యుద్ధకాలంనాటి కంటె తరువాత కాలంలో పంటలు తగ్గిన విషయం స్పష్టంగా బోధ పడుతోంది. కాని 1946 లో పండిన పంటకంటె 1947 లో పండినపంట 5,41,000 టన్నులు ఎక్కువ. అయినప్పటికీ మనం 1946 సంవత్సరం పొడుగునా 10 ఔన్సుల రేషన్లు నిలుపుకోగలిగాం. కాని ఈ ఏడు 8ఔన్సుల రేషన్లు కూడా అందడంలేదు. రానున్న రెండు మాసాలలో అసలు రేషనింగు విధానమే భగ్నమయి కరువు రాకాసి విలయతాండవం చేసే భయంకర పరిస్థితులు గోచరిస్తున్నాయి. ధాన్యసేకరణ దెబ్బతినడమే దీనికంతకూ కారణం.

మన జనాభా పెరగడం, బర్మా మున్నగు ఇతర ప్రదేశాలనుండి వచ్చే దిగుమతులు నిలిచిపోవడం, కరువు కాటకాలకు ప్రధాన కారణాలంటూ వాదించేవారుకూడా కొందరు ఉన్నారు. అలాంటివారు 8 ఔన్సుల రేషన్ల విషయం మరచిపోతున్నారు. యుద్ధానికి పూర్వం మన మద్రాసు రాష్ట్రానికి 4½ లక్షల టన్నులనుండి 5 లక్షల టన్నులవరకు ఆహార పదార్థాలు దిగుమతి అయ్యేవి. 1946 లో 6,03,000 టన్నులు, 1947 లో ఈ నాటివరకు 2,18,259 టన్నులు దిగుమతి అయ్యాయి. యుద్ధానికి పూర్వం రేషన్లు లేవు. ఈ నాడు 8 ఔన్సుల రేషనింగు వుంది. అయినప్పుడు సాలుకు 5 లక్షల చొప్పున జనాభా పెరిగితే మాత్రం ఇంతటికరువుకాటకాలెందుకొచ్చాయి? ప్రధానంగా ధాన్యసేకరణ దెబ్బ తిన్నందువల్లననే విషయం స్పష్టం.

ధాన్యసేకరణ దెబ్బతిన్న దెందువల్ల?

కాంగ్రెసు మంత్రివర్గాలు అధికారంలోకి రాగానే అన్ని జీవితావసరవస్తువుల ఉత్పత్తిపైన ఖచ్చితమైన అజమాయిషీపెట్టి, ధరల కంట్రోలును ఖచ్చితంగా అమలు జరిపినట్ల

పరిష్కారమార్గ మేమిటి?

యితే పరిస్థితులు చక్కబడేవి. కాని కాంగ్రెస్ మంత్రివర్గాలు అలా చేయలేదు పెట్టుబడిదారీ మురాల వత్తిడికి లొంగి అనేక జీవితావసర వస్తువులపైన కంట్రోళ్ళను తొలగించారు. అంతటితో అన్ని వస్తువుల ధరలూ ఆకసాని కంట బెరిగాయి ప్రజాసామాన్యాని కందు బాటులో లేకుండా పోయాయి

ఒకవైపున పెట్టుబడిదారులు, గుత్తవ్యాపారులు, పారిశ్రామిక వస్తువులపైన కంట్రోళ్ళను ఎగరగొడుతూంటే, మరొకవైపున జమీందార్లు, ధనిక భూస్వాములు ఆహారపదార్థాలపై ధరల కంట్రోలు పోవాలని ఆందోళన ప్రారంభించారు రైతులనుదోచి తాము కూడ బెట్టుకున్న ధాన్యాన్ని దొంగమార్కెటులో విపరీతమైన ధరల కమ్మసాగారు

కాని రైతుజనసామాన్యం మాత్రం అలా చేయలేదు. ధాన్యపు ధరల ననుసరించి జీవితావసర వస్తువుల, వ్యవసాయపనిముట్ల ధరల నన్నింటినీ తగ్గించి కంట్రోలు చేయాలనీ ఆ వస్తువులను సరఫరాచేసే బాధ్యత ప్రభుత్వమే వహించాలని కోరారు. దొంగవ్యాపారులను లంచగొండి ఉద్యోగులను కఠినంగా శిక్షించాలని, ధాన్య సేకరణ, పంపకములకుగాను ఆహారకమిటీలను, సహకార సంఘాలను స్థాపించాలని, ప్రజాసహకారంతో పరిస్థితుల నెదుర్కోవాలని ఆందోళన చేశారు.

రైతుజనసామాన్యపు కోర్కెలను ప్రభుత్వము పాటించలేదు. ప్రభుత్వం స్థాపించిన ఆహారకమిటీలు మురారాజకీయాలకు గురియైనాయి. సహకార క్రయవిక్రయ సంఘాల గతి కూడా అలాగే అయింది. వీటినుండి ప్రజలచే ఎన్నుకోబడ్డ ప్రతినిధులు తొలగింపబడ్డారు. దొంగవ్యాపారులు, ధనిక భూస్వాములు మున్నగు స్వార్థపరులు ఈ కమిటీలలోను సహకార సంఘాలలోను స్థానం సంపాదించగలిగారు; అందువల్ల ఫలితం శూన్యమై పోయింది. ఇక లంచగొండి ఉద్యోగుల, దొంగవ్యాపారుల, భూస్వామిక మురాలచర్యల నరికట్టడమనలే జరుగలేదు అందుచేత ధాన్య సేకరణ విఫలం కాసాగింది.

ధనికవర్గాలకు లొంగి ప్రభుత్వం చేసిన అవకతవక లోపాలకు, కాంగ్రెసులోని మురా రాజకీయాలు తోడయినాయి. తాను అధికారములో వుండగా ధాన్యానికి న్యాయమైన ధరలను నిర్ణయించకపోగా పైగా తగ్గించి, మిల్లు యజమానుల లాభాలను ఎక్కువ జేసిన ప్రకాశంగారి ప్రధాని పదవి పోగానే, బస్తాకు రు 6 లు బోనసు యివ్వాలని లేకపోతే రక్తపాతమవుతుందని రెడ్డియార్ మంత్రివర్గాన్ని బెదరించసాగారు. ధాన్యసేకరణకు వ్యతిరేకముగా సత్యాగ్రహం చేయండని రంగాగారు రైతులకు సలహా యిచ్చారు ప్రకాశం మంత్రివర్గం స్థాపించిన క్రయవిక్రయ సంఘాలలోని లోట్లను తొలగించి ధాన్యసేకరణను జయప్రదం చేయడానికి బదులు అసలు ధాన్యసేకరణ బాధ్యతనే క్రయవిక్రయ సంఘాలనుండి తీసివేసి మిల్లు యజమానుల చేతులలో పెట్టింది రెడ్డియార్ మంత్రివర్గం. ఈ విధంగా కాంగ్రెసులోని మురా రాజకీయాలవల్ల మిల్లుయజమానుల, మిరాశీదార్ల, ధనిక భూస్వాముల పంట పండింది.

ధాన్యసేకరణాధికారంపొందిన మిల్లు యజమానులు బస్తా 1కి రు 2లు లేక రు3లు అదనంగా యిచ్చి రైతులవద్ద ధాన్యం కొనసాగారు అందువల్ల ఆచరణలో కంట్రోలు ఎగిరిపోయింది, తాము కొన్న దాన్యంలో సగం దొంగ మార్కెటులో అమ్ముకుంటూ మిల్లు యజమానులు తక్కిన సగాన్ని-రెండవ రకం బియ్యాన్ని మేలురకంగా లెక్కగట్టి ప్రభుత్వాని కిస్తున్నారు ఇందువల్లనే ధాన్య సేకరణ దెబ్బతింటోంది రేషన్లు తగ్గిపోతున్నాయి దొంగ వ్యాపారం, ధరలు దినదినం పెరుగుతున్నాయి చివరకు ఈ నాటి విషమ పరిస్థితులొచ్చిపడ్డాయి.

ఈ విషమ పరిస్థితులనుండి బయట పడడానికి మార్గమేమిటి? ప్రజానీకాన్ని కలవరపరుస్తున్న సమస్య యిదే అసలుకంట్రోలు తీసివేస్తే పరిస్థితులు చక్కబడతాయని మిల్లు యజమానులు, మిరాశీదార్లు ఆందోళన చేస్తున్నారు. ఈస్వార్థపరుల సూచనను అంగీకరిస్తే మన రాష్ట్రం 1943 నాటి బెంగాలుకంటె అధోగతికి పోక తప్పదు అందుచేత ప్రజా సేవకు లంతా కంట్రోలు తీసివేయాలనే స్వార్థపరుల నెదుర్కోవలసి వుంది. కాని దురదృష్టవశాత్తు అనేకమంది కాంగ్రెసు నాయకులు భూస్వాముల మోసాన్ని నమ్ముతున్నారు రూరల్ ఇన్ఫార్మల్ రేషనింగు తీసివేయాలని జీవితావసర వస్తువుల ధరల కనుగుణ్యంగా ఆహారధాన్యాల ధరలు పెరగాలని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘం తీర్మానం చేసింది మిగులు ప్రాంతాల రేషనింగు తీసివేయాలని ఆహార శాఖా మంత్రి రాజన్ సూచిస్తున్నాడు ఇలా చేస్తే ధాన్య సేకరణ జయప్రద మవుతుందా? ఆహార సమస్య పరిష్కార మవుతుందా? ముమ్మాటికీ కాదు

గ్రామ ప్రాంతాల రేషనింగు తీసివేస్తే జరిగే దేమిటి? ప్రజల కీనాడు అందుతున్న రేషన్లు

(మిగతా 24వ పేజీలో)



జమీందారీ స్కూళ్ళలోని దురాగతాలు


గత సంవత్సరం చల్లపల్లి విద్యార్థులు బ్రహ్మాండమైన పోరాటాలు నడిపారు జమీందారు, పోలీసుల నిరంకుశత్వా న్నెదిరించి ధీరోచితంగా నిలబడ్డారు. చివరకు విద్యార్థులకు, స్కూలు మేనేజిమెంటుకు మధ్య ఒడంబడిక కుదిరింది. ఏ విద్యార్థినీ రాజకీయ నెపముతో వెళ్ళగొట్టననీ, సప్లిమెంటరీ విద్యార్థులను చేర్చుకొనెదనని, ఆటస్థలము బాగు చేయించెదనని వాగ్దానమిచ్చిరి.

కాని మేనేజిమెంటుతనవాగ్దానాలనుభగ్నం కావించింది స్కూలు తెరచి మూడునెలలైనా సరిపడ వుపాధ్యాయులులేరు, 'కొందరు వుపాధ్యాయులు వెళ్ళిపోవుటకు సిద్ధంగా ఉన్నారు. పాఠములు చాల వెనుకబడియున్నవి. దీనికి తోడు హెడ్మాష్టరు తన నిరంకుశ చర్యలను యధావిధిగ కొనసాగిస్తున్నాడు. స్కూలులో గత సంవత్సరం చదివిన విద్యార్థుల నీ సంవత్సరం చేర్చుకో నిరాకరించుచున్నాడు. "నిరంకుశత్వం నశించాలి" అని నినాదాలిచ్చేవారిని కాలరాస్తానని ప్రగల్భాలు పలకుతున్నాడు స్కూలులో చేర్చుకొన నిరాకరించిన ఫలితముగ యనేకమంది విద్యార్థులు తీవ్రనష్టాలకు గురయ్యారు

హెడ్మాష్టరు నిరంకుశ చర్యలను బలపర్చుటకు క్రొత్తగా వచ్చిన డ్రిల్లు మాష్టరు అడుసుమిల్లి గంగాధరరావు పూనుకొన్నాడు ఇటువంటి నిరంకుశ డ్రిల్లు మాష్టరు దొరికినందుకు శ్రీవారు సంతసించారట ఈయనగారు వచ్చిన దాదిగా విద్యార్థులపై నిర్బంధాలు ప్రయోగించుతున్నాడు 6 వ ఫారము విద్యార్థులు "పుట్‌బాల్"లో గాలిలేక ఆడనందుకు వారంరోజులు హాజరు లేకుండా చేశాడు విద్యార్థులనేక విధములు తూలనాడటం ప్రారంభించాడు. "సమ్మెలు చేయండి - హక్కులు సంపాదించుకుందురుగానని" గేలిచేయ ప్రారంభించాడు అతపికంటె ఘనుడు ఆవంట మల్లన్న అన్నట్లుగాయీ డ్రిల్లు మాష్టరును మించినవారు పెద్ద డ్రిల్లుమాష్టరు విలియమ్సుగారు సరిగా పరుగెత్తలేదనే నెపంతో 6 వ ఫారము విద్యార్థులకు హాజరు వేయలేదు పైగా హెడ్మాష్టరుతో వార్నింగులుకూడ యిప్పించాడు 5 వ ఫారం విద్యార్థులు తన్ను ప్రశ్నలడిగారనే నెపంతో యీ ప్రబుద్ధుడు 5 గురు విద్యార్థులను వెళ్ళగొట్టించాడు ఈ విద్యార్థులను నాలుగురోజులు తిప్పించి హెడ్మాష్టరువారు "ఇకముందు యేపని చేసినా వెళ్ళగొట్టవచ్చునని" క్షమాపణ వ్రాయించుకున్నారు వెళ్ళగొట్టిన విద్యార్థులను చేర్చుకోమనని అడుగగా మాకు తెలియదంటే మాకు తెలియదని చెప్పుతూ డ్రిల్లుమాష్టర్లు, హెడ్మాష్టరు ద్వంద్వపరిపాలన చేస్తున్నారు.

ఈ నిరంకుశ పాలన ఫలితం హైస్కూలు ఒక నిర్బంధశాలగ మారిపోతున్నది. స్కూలును పతనస్థితి కీడ్చుతున్నారు సౌకర్యాలు శూన్యమౌతున్నవి. స్కూలులోని విద్యార్థులందరు జమీందారీ రాజకీయాలను బలపర్చేటట్లుగ విద్యార్థులమీద వత్తిడి తెస్తున్నారు ఈ సంవత్సరం ఆరవ ఫారాన్నంతా ఒకే డివిజనుచేసి వచ్చే సంవత్సరం స్కూలునంతా ఒకే డివిజను చేస్తామని అధికారులు చెబుతున్నారు. "స్టూడెంట్సు యూనియన్"ను నిరంకుశముగ రద్దుజేశారు సకాలములో వుపాధ్యాయులను తెప్పించుటలేదు స్కూలు పెట్టి 16 సంవత్సరాలయినా లేబరేటరీని పెంచడం లేదు ఉపాధ్యాయులకివ్వవలసిన జీతములను సరిగా యిచ్చుటలేదు. ఈ నిరంకుశ విద్యాధికారులు ఉపాధ్యాయుల కడుపుమాడ్చి విద్యను కుంటుపరచి విద్యార్థుల జీవితాలకు దెబ్బగొడుతున్నారు కాబట్టి ప్రభుత్వం యీ నిరంకుశాధికారులనుండి చల్లపల్లి స్కూలును స్వాధీనం చేసుకొని ప్రభుత్వమే నడపాలి, స్కూలుకగు ఖర్చును ప్రభుత్వం జమీందారు వద్దనుండి వసూలుచేసి స్కూలును నడపాలి, అప్పుడే విద్య కుంటుబడకుండా వుంటుంది.

మండవ కృష్ణారావు
చల్లపల్లి విద్యార్థిసంఘ కార్యదర్శి



చల్లపల్లి జమిందారీ స్కూలులోని విద్యార్థుల భోజనసౌకర్యాలు

వానపాముల స్కూలును ప్రభుత్వమే నడపాలి

జమీందారులు, పెట్టుబడిదారులు ప్రజలను జలగలవలె పీల్చి సమాజజీవనా న్నెవిధంగా దుర్భరం చేస్తుంటారో అలాగే వారిచే నడపబడే స్కూళ్ళను స్వార్థంతో వ్యాపారసంస్థలుగ మార్చి విద్యను ధ్వంసం చేస్తుంటారు. ఉదాహరణకు వానపాముల హైస్కూలు తీసుకుందాం గత రెండు సంవత్సరముల నుండి విద్యార్థులవద్దనుండి నాలుగువేల రూపాయలు వసూలుచేసారు కట్టించినవి రెండుగదులు మాత్రము జమాఖర్చు లడిగితే చూపించడం లేదంటే అక్కడేదో కుళ్ళు వున్నట్లు తేలుతున్నది

అన్నిస్కూళ్ళల్లో కెమిస్ట్రీ ఫీజు 5 రూలు తీసుకొంటూంటే ఉయ్యూరు జమీందారువారి వానపాముల స్కూల్లో 10 రూ. లు ఫీజుపుచ్చుకుంటున్నారు. క్రిందటి సంవత్సరం 5 వ ఫారం విద్యార్థులకు నవంబరు వరకు కెమిస్ట్రీ బోధన జరగలేదు.


ఇంకొక విచారకరమైన విషయమేమంటే, స్కూలుకమిటీ కార్యదర్శి వేములపల్లి రామయ్యగారు ప్రజలు కల్పించిన విద్యాసౌకర్యములను సద్వినియోగము చేయుటలేదు. హాస్టలుకని దానంచేయబడిన 2½ యెకరముల లోని పంటను విద్యార్థుల నిమిత్తం ఉపయోగించడంలేదు ప్రజలవద్దనుండి ఉచితభోజన సౌకర్యాలకు ధనం వసూలయినా విద్యార్థులకట్టి వుచితభోజన సదుపాయాలు కల్పించబడలేదు. కాబట్టి విద్యార్థుల క్షేమాన్ని, విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వమే వానపాముల స్కూలును స్వాధీనం చేసుకుని నడపాలి. మన విద్యావిధానంపై జమీందార్ల అధికారాన్ని రద్దు పర్చాలి.

— కాకాని శేషగిరిరావు.
(కార్యదర్శి, విద్యార్థిసంఘం)

ప్రపంచ యువజన ప్రతినిధుల నివేదిక

[ప్రపంచ యువజన సమాఖ్యచే నియమింపబడిన ప్రతినిధివర్గం ఆరు వారాలపాటు దేశంలో నలుమూలల పర్యటనచేసి మన ప్రజల దుర్భర దారిద్ర్యాన్ని నిరక్షరాస్యతను కళ్ళారచూసి తెలుసుకున్నారు. ఆంధ్రదేశ సంచార కార్యక్రమంలో చినవోగిరాల యువజన మహాసభలో పాల్గొని తమ ఉజ్వల సందేశాన్ని మన స్వాతంత్ర్య పోరాటానికి ప్రపంచ యువకుల సానుభూతిని అందజేసారు. ప్రజలు రాజకీయ భేదాభిప్రాయాలను మరచి వారికి ఘనమైన స్వాగత మిచ్చారు. ఆగ్నేయాశియా పర్యటనా నంతరం మాస్కోలో జరిగిన కార్యనిర్వాహక సమావేశానికి తమ నివేదిక నందజేసారు. ఆ రిపోర్టులోని భాగాలను ముద్రిస్తున్నాం. సంపాదకుడు]

కార్యనిర్వాహక సమావేశం ప్రారంభించ బడిన అచిరకాలంలోనే యువజన ప్రతినిధి వర్గం ఇండియా, బర్మా, మలయా, ఇండొనీషియా దేశాల పర్యటనా నంతరం మాస్కో చేరుకుంది. వారి పర్యటన నాల్గు నెలల కాలం తీసికొనడమే గాకుండ కొన్నివేల మైళ్ళు విస్తరించింది. ఈ దీర్ఘ ప్రయాణాలవల్ల కల్గిన బడలిక శ్రమలు వారి ముఖార విందాలలో తాండ విస్తున్నాయి. ఈ ప్రతినిధి వర్గం పై దేశాలలోని పూర్కాళ్ళు విశ్వవిద్యాలయాలలోని విద్యార్థులను కలుసుకుంది. ఫ్యాక్టరీ గ్రామీణ యువకులను కలుసు కుంది ఒక ఇండియాలోనే వారు కొన్ని లక్షల ప్రజా సామాన్యానికి మీటింగుల ద్వారా తమ సందేశాన్ని అందజేశారు. వారి సంచారంలో ఆయా దేశాలలోని యువజనోద్యమ నాయకులను ప్రముఖ జాతీయ నాయకులను సుప్రసిద్ధ మేధా వంతులను ఎందరినో కలుసు కున్నారు.



ప్రపంచ యువజన ప్రతినిధి వర్గసభ్యులు. ఎడమ ప్రక్కనుండి రెండవవ్యక్తి ఫ్రెంచి ప్రతినిధి (ఫోటో: గరటయ్య)

దుర్భర దారిద్ర్యం అవిద్య

ప్రతినిధి ఫ్రెంచి యువజన నాయకుడు అయిన జాన్ లూటిషియర్ తన అనుభవాలను ఈ విధంగా వివరించాడు. "ఇండియా, బర్మా, మలయా దేశాలు సహజంగా రత్నగర్భ లైనప్పటికి అమానుషమైన వలస దోపిడి విధాన ఫలితంగా అవినేటి దౌర్భాగ్య విశృష్టానవస్థలలో వుండ వలసి వచ్చింది, అచటి కార్మికులు కిటికీలుగాని నీటి వసతులుగాని లేని మురికి కూపాలలో నివసించు తుంటారు, వారికి వృత్తి విద్య నేర్పేం దుకు గాని, విజ్ఞానాభి వృద్ధికిగాని ఏ మాత్రం అవకాశాలు లేవు, భీమా పద్ధతిగాని వైద్య సహాయముగాని లేవు. రోజంతా శ్రమపడినా ఒకపూట కూటికికూడ చాలిచాలని కూలి డబ్బుతో బ్రతుకు తుంటారు. పిల్లల దైన్యావస్థ యికను చెప్పనే అక్కరలేదు. వాళ్ళు జన్మలో వాళ్లెప్పుడూ పాలనుగాని, మాంసాన్నిగాని, రుచిచూచి వుండరు 6 సం॥ దాటినప్పటి నుండీ వాళ్ళుకూడ తమ శరీరాలను అమ్ము కొనిపెద్దవాళ్ళతోపాటురోజుకు 8 గంటలనుండి 10 గం॥ వరకు పని చేయాల్సి వుంటుంది. ఇండియాలో నూటికి 88 మంది నిరక్షరాశ్యతలో మునిగి తేలు తున్నారంటే ఆశ్చర్య పడ వలసిన పనిలేదు. ప్రభుత్వ లెఖ్ఖల ప్రకారమే సామాన్య భారతీయుని జీవితకాలం పాతిక సంవత్సరాలు.

ఏటేటా కరువులు

గ్రామ సీమలలో వ్యవసాయం అతి పురాతన మైన పనిముట్లతో చేస్తుంటారు. నీటి పారుదల ఏర్పాట్లు, ఆనకట్టలు మొదలైనవి చాల తక్కువ. రసాయనికపు ఎరువుల వాడుక బహు స్వల్పము." ఇండియా, ప్రతినిధివర్గం తిరిగినంతటిలోను ఒక్క ఆధునిక వ్యవసాయ యంత్రమైనా చూచినపాపాన పోలేదు, కొద్దిలో చెప్పాలంటే వ్యవసాయం అతి పురాతనపద్ధతులద్వారా జరుగుతుంది. అందువల్ల భూములు చాల తక్కువ ఫలసాయాన్నిస్తున్నాయి. దీనిని ఆధారంగా చేసు కొని విదేశ పెట్టుబడిదారులు, పెద్ద పెద్ద ధాన్యపునిల్వలను దిగుమతి చేస్తుంటారు. ఈ పరిస్థితుల మూలంగా ఏటేటా లక్షలకొలది నిస్సహాయులు కరువురాక్షసికి బలి అవుతుంటారు.

పౌరసత్వ హక్కులు శూన్యం

ఈ దేశాలలోని ప్రజలకు వోటింగుహక్కుగాని వాక్స్వాతంత్ర్యంగాని, సంఘం పెట్టుకొనే హక్కుగాని ఆచరణలో శూన్యం; తమ కనీస పౌరసత్వహక్కుల కొరకు పోరాడుతున్న యువకులు తీవ్రనిర్బంధాలకు గురికావడం ప్రతినిధివర్గం కళ్ళార చూసింది. కాని ఆయాదేశ ప్రజలు, తమ స్వాతంత్ర్య పోరాటాన్ని వున్నతస్థాయికి తీసికొనిపోవుటద్వారా క్రూర సామ్రాజ్యవాదుల నిర్బంధాలకు తిరుగుదెబ్బ తీస్తున్నారు ఈవిధంగా వివిధ జాతులవారిని, వివిధమతాలవారిని వేర్వేరుగా విభజించి, ఒకరిపై మరియొకరిని ఉసికొల్పాదామను కొనేసామ్రాజ్యవాదుల కుటిలనీతిని విఫలం చేస్తున్నారు.

"ప్రతినిధివర్గం వెళ్ళిన ప్రతిచోటావుత్సాహపూరితమైన స్వాగతాలివ్వబడ్డాయి. ఇంతవుత్సాహానికి కారణం,తమ పోరాటంకూడ ప్రపంచ యువకులు జరిపే పోరాటంలో ఒక భాగంగా గుర్తించడంవల్లనే. ఇప్పుడు వారు ప్రపంచ యువజనసమాఖ్య నుండి ఎక్కువ సహాయ సానుభూతులను అర్థిస్తున్నారు.

ప్రతినిధివర్గ సభ్యులందరూకూడ, వలసదేశ యువకుల పోరాటంలో, వారికి అండగా ప్రపంచయువకుల సానుభూతి సహాయాలు ఇతోధికంగా అందజేయవలసిన అవసరాన్ని గురించి కార్యనిర్వాహకవర్గానికి నొక్కి చెప్పారు.

చిన్న కథ

అమరజీవి

వి. ఆంజనేయులు

పడమర వడగాలి రివ్వున వీస్తుంటే చెవులు గింగిరెత్తిపోతున్నాయి చెట్లన్నీ కొమ్మలు ఎండిపోయి, ఆకులురాలిపోయి కళావిహీనంగా ఉన్నాయి (పరస్పర వైరుధ్యంతో బలాబలాల చూపుకుంటున్నాయి-) . ఆ శ్మశాన భూమిలో ఉన్నదల్లా కాలిపోయిన ఎముకలు శవాల్ని ఆహ్వానిస్తు ఎదురుచూస్తున్న గద్దలూ, నక్కలూ. శ్మశానంలో కాపురాలు పెట్టిన నక్కలకూ. దేశాన్ని పీడించి ప్రజల నాశనం చేసే రాజులకూ అవుపడుతుంది సంతోష స్వర్గం-సుఖం-అన్నీ

ఆ రోజు శ్మశానమంతా తోరణం కట్టినట్టు ఎర్రజెండాలు-వేలాది ప్రజలు స్త్రీలు పురుషులు-హిందువులు ముస్లింలతో ఒకశవం చేరింది. ప్రతిమనిషి ముఖం ప్రతీకారజ్వాలలతో నిండి ఉన్నాయి శవందగ్గర కూర్చున్న ముసలి తండ్రి కన్నులవెంట నీరుకారి చింపిరిగుడ్డలన్ని తడిసిపొయ్యాయి. జనమంతా ప్రశాంతంగా చూస్తూ కూర్చున్నారు . .

శవంమీదగుడ్డ తీశాడు మహ్మదు చేతి కంటిన రక్తాన్ని చూసుకుంటూ, "బాగా డొక్కలో తగిలింది గుండు అబ్బా! తోటి మానవుడు సాటివాణ్ణి యీవిధంగా చేశాడు ... చేశాడుకాదు చేయించాడు అధికారగర్వంతో" మహమ్మదు ఇక మాట్లాడలేకపొయ్యాడు కొంచెమాగి—"నేను చూస్తూనే ఉన్నాను గోడ చాటున ఉండి ఇదంతా. 'స్త్రీలమీద చేయివేస్తే మీ ప్రాణాలుండవు' అని గర్జించాడు ఆదుర్మార్గుల పట్టుకున్న అమ్మాయిని విడిపించడానికి ఉరికాడు. దూరంగా ఉన్న ఓ మిలటరీ తుక్క తుపాకి కాల్చాడు - గుండు రయ్యినపోయి డొక్కలో దూరింది....ఆంధ్రమహాసభ.. భకూ ...జై అంటూ క్రిందపడిపోయాడు ఇక చెప్పలేకపొయ్యాడు మహమ్మదు బావురుమన్నాడు.

"మనవాడు అందరివలె ఉంటె యీఖర్మం రాకపోయేది" అన్నాడు కండ్లనీళ్ళు తుడ్చుకొంటూ ఓ వృద్ధుడు. ...

మహమ్మదు అందుకున్నాడు-"రెడ్డీ నువ్వు అనేది తప్పు. అతడు మనవలె పిరికిపంద కాడు. మన సంఘ గౌరవం, జాతి గౌరవం దక్కించాడు. ఆ దుర్మార్గులు మనజాతి స్త్రీని పట్టుకొని . ఊరుకొమ్మంటావుగదూ" మహ్మదుకు కోపమొచ్చింది

"అన్నట్టు ఎదిరించలేక చేతులు ముడ్చుకున్న గ్రామాల్లో ఏం జరిగిందో ఎరుగవూ "

నిజమే నాయినా గర్భిణులను.. అబ్బా . ఎన్ని హింసలు. నువ్వన్నది నిజమే బిడ్డా-" అంది కృంగిపోయిన ఓ ముసలమ్మ

"మనమేం తప్పు చేశాము. కష్టపడి పండిస్తే దోచుకున్నారు బండచాకిరిగా వెట్టి చేశాం నాశనమయ్యాం. ఆ బాధలు పగవాండ్లకైనా వద్దురా బాబూ యీ దొరలు-యీ నవాబులూ- వెట్టిచేయటానికా మేం పుట్టింది-యీ దొంగపన్నులీయమన్నాం. వెట్టిచేయమన్నాం .. . యీ దొరలకు వెట్టిచేయకుంటె నైజాం సర్కారు కేంటంటా" అన్నాడు అమాయకంగా ఓ కూలి

పరధ్యానంగా ఆలోచిస్తున్న మహమ్మదు విన్నాడు, "ఆ....యీ దొరలెవరు ఆ దొరలెవరు వారేవీరు-వీరేవారు. ఇవ్వాళ్ళ వారికి వెట్టిచేయమన్నాం. రేపు వారికి .....ముందే మేల్కొని యీ కాల్పులూ, దెబ్బలూ, యీ హింసలు ఎదిరించాలి....నా ప్రజలు నా బిడ్డలు అంటాడు పెద్దదొర ఎక్కడుందీ న్యాయం. రాక్షసులు చేసిన చర్యలు-స్త్రీలను మానభంగం చేయడం... మరీ న్యాయం. బిడ్డలూ . సరే కానీండి చూతాం. దేశంకొరకు ప్రాణాలిద్దాం" అన్నాడు వేగంగా

చనిపోయిన యువకుని ముదుసలి తండ్రికి కోపమొచ్చింది - దేశం ఏం దేశం నా కొడుకు ప్రాణాలిచ్చాడు ...మరినాగతి. దిక్కుతోచని దేశంకొరకు, ప్రజలకొరకు ప్రాణ మిచ్చాడు. పేరు మాసిపోదు. వీరోచిత మరణం అనుకుందామా అంటే - యీలాంటివాళ్ళను అడిగేదెవరూ . ఆ పేరూ, ఆ ప్రతిష్టా అదంతా సుఖంగా కూర్చుని డాబులుకొట్టె నాయకులకూ .. యీ బీదకూలోడు చస్తె ఊరా పేరా- హుం. . అన్నట్టు మొన్న కాల్పులకు గురి అయిన వాండ్ల నేమన్నారు యీ నాయకులు కమ్యూనిస్టులని, వీళ్ళదే తప్పని ..... ఇంకా ఎన్నో ఏం తప్పా ఎదిరించడం. మరీ... స్త్రీలను యీవిధంగా చేస్తే ..చూస్తూఊరుకోవడమా," ....ఆ వృద్ధుని బుర్రలో రకరకాల భావాలు తిరుగుతున్నాయి. .... కూలిపోయిన ఇల్లూ-పోలీసుల లాఠీదెబ్బలకుగురై మంచంలో ఉన్న తన ముసలిభార్య తానూ . ఒకపూట గంజినీళ్ళకేనా బియ్యపుగింజలు లేవే! ...

శవంమీద నిండా పూలు చల్లారు ప్రజలు, శవంచేతిలో ఉన్న ఎర్రజండా ముసలితండ్రి తీసి ముద్దుపెట్టుకున్నాడు. చితి పేర్చడం అయింది శవాన్ని ఎక్కించారు చుట్టూ గ్రామాల ప్రజలంతా చేరుకుంటున్నారు శవాన్ని చూడడానికి విరుగబడుతున్నారు- మహమ్మదు లేచి నిలబడి కండ్లు తుడ్చుకున్నాడు ప్రజలంతా ఆతనివైపు చూస్తున్నారు.

"మనం దీనితో ఊరుకోవద్దు, మన శక్తి ఉన్నంతవరకు చూద్దాం. మనం యీ రాక్షస బలగానికి వ్యతిరేకంగా ఎన్నో విజయాలు సాధిచాం. ఆ విజయం నిల్పుకోడానికిప్రాణాలర్పిద్దాం కాని ఈ నైజాం దొరల రౌడీల ఆటలు సాగనివ్వవద్దు మూడుకోట్లు ఉన్నాం తెలుగువాళ్ళం తుదివరకూ పోరాడుదాం"

యువకుల కండ్లు పట్టుదలతో ఎర్రబారాయి, అప్రయత్నంగా మహ్మదు కంఠంనుంచి వెడలింది "నైజాం నిరంకుశత్వం ముర్దాబాద్. ఆంధ్రమహాసభ జిందాబాద్" నినాదం వేలకొద్ది గొంతుల్లోనుండి ప్రళయగర్జనగా మారుమోగింది పిడికిలి బిగించి శపథం చేశారు, "వీరుడా నిన్ను మరచిపోము - నీ కోర్కె తీరుస్తాం" చితికి నిప్పు అంటించారు భగ్గున మండుతుంది శవంనైజాం ప్రజల కోపంలాగు.

"అమరజీవివి నీవు" అని పాడుకుంటూ ప్రజలింటివైపు మళ్ళారు .. వృద్ధునిచేతిలో ఉన్న ఎర్రజండా రక్తంతో తడిసి వ్యక్తిజీవితానికీ ఎర్రరంగుకూ ఉన్న బంధుత్వం సూచిస్తుంది ఇల్లు చేరాడు, ముసలిభార్యకు అందించాడు జండాను. కండ్లకద్దుకుంది. తనకొడుకు ప్రేమించే జెండా. ప్రాణమిచ్చిన జెండా.... శక్తిలేకున్నా కుక్కిమంచంనుంచి లేచింది. గూటిలోవున్న రాతిబొమ్మను తీసివేసింది దాని స్థానంలో ఎర్రజండా ప్రతిష్టించింది. "తెలంగాణ వీరులం. తెలుగుతల్లి బిడ్డలం" అని దున్నపోతునెక్కి పాడుకుంటూ వస్తున్న, ఓరైతుబిడ్డ గీతం విని ఆమె కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగినయ్,

6వ ఫారం తెలుగుపాఠ్యపుస్తకటిప్పణి సమీక్ష

★★★

శ్రీ ఆ. నరసింహశర్మ
విజయనగరం స్కూలులో తెలుగుపండితులు

S. S. L. C. పాఠ్య ప్రణాళిక సరిగా ఉందా లేదా అన్న ప్రశ్నవేరు ఆ ప్రణాళిక ననుసరించి ఇప్పుడు అమలు జరుగుతుందా లేదా? అన్న ప్రశ్నవేరు. ఆ రెండవ ప్రశ్న వేసుకొని ఇక్కడ సత్యాన్ని ప్రదర్శిస్తాను.

పాఠాలు చెప్పే ఉపాధ్యాయునికి, చదివే విద్యార్థికీ కూడా మార్గదర్శిగా ఉంటుంది పాఠ్య పుస్తకానికిచ్చిన టిప్పణి ఇది ఇద్దరినీ తప్పు తోవలో నడిపిస్తె ఈ పరీక్షాక్రమం భాషను పాడుచేస్తుంది అని చెప్పవచ్చును అంచేత టిప్పణి జాగరూకతతో సమర్థులచేత నిర్దుష్టంగా రాయించాలి అలా లేనప్పుడు ఆ తప్పులే చదివిన విద్యార్థులు అదేరాసి మార్కులు తెచ్చుకోలేక ఫేలవుట. తప్పు భాషను నేర్చుకొనటకూడా జరిగి తీరని అపచారం కలుగుతుంది. ఏదో ఒక ఉపాధ్యాయుడు తప్పుచెపితే వాని శిష్యులు మాత్రమే చెడతారు దీనివల్ల సకలాంధ్రావనిలోని విద్యార్థులంతా చెడతారు ఆ తప్పులు రాసి పరీక్షలో తప్పుటకూడా జరుగవచ్చును.

ఈసంవత్సరం S. S. L. C పుస్తకానికు టిప్పణి వ్రాయబడింది దానిలో ఇలాంటి లోపాలు చాలా ఉన్నాయి పూర్వంకూడా ఇలాంటి లోపాలు టిప్పణిలో జరుగుతూనే ఉన్నాయి. ఐనా ఇప్పటి లోపాలు కొన్నిటిని చూపుతాను. వాటిని సవరించి ప్రకటించడం ఒకటి, ఇటుపైని లోపాలు లేకుండా సరిచూసి ప్రకటించడమొకటిన్ని పరీక్షకుల కర్తవ్యము. దీన్ని విద్యార్థులు ఉపాధ్యాయులు కలసి అమలు పడేటట్టు చేయాలని కోరుతాను

"వాంఛ" అను పదమునకు కోరిక అని అర్థము

"వాంఛితము" అను పదమునకు కోరబడినది అని యర్థము.

టిప్పణియందు ఈ రెంటికినిగల భేదమును గమనింపక "వాంఛితము = కోరిక" అని అర్థము ఇవ్వబడింది. దీనివల్ల ఆ పదములకు గల అర్థభేదము విద్యార్థికి విశదము కాలేదు. ఇట్లె "మెలపు" అను పదమునకు భావార్థమీయబడినది.

"హలి" బలరాముడు అని యర్థము. టిప్పణిలో పరశురాముడు అని అర్థమీయబడెను ఈ అర్థము పద్యమునందు సరిపడదు భాషలో లేదు.

"అంఘ్రిపల్లవ పీఠము" చిగుళ్ళవంటి మెత్తని పాదముల పీఠము అని యర్థము.

"చిగుళ్ళవంటి మెత్తని పాదపీఠము" అని అర్థమీయబడినది. ఇక్కడ మెత్తనైనది పీఠము అని భావమువచ్చునుగాని చిగుళ్ళవలె మెత్తనైన పాదములు అను నర్థము రాదు విశేషణము సమాసైక దేశముతో నన్వయించుట దోషము ఆ దోష మీ యర్థమిచ్చుట యందు కలదు ఇది శిష్టజనవ్యవహృత మైనప్పుడు అగతికముగ గ్రాహ్యమగునేగాని విద్యార్థులకు చెప్పునప్పుడు దుష్టమార్గము.

సహ్యమహీభృత్ = సహ్యమనునది కులపర్వతములలో నొకటి దక్షిణాపథమున కలదు అందును కుమారీ అను ద్వీపమునను్నది. ఈ ద్వీపముననే గల మరియొక కులపర్వతము వింధ్యము టిప్పణి యందు సహ్యమనగా వింధ్యము అని అర్థమీయబడుట చింత్యము.

అభిజనాభిమానము = జన్మస్థల మందలి యభిమానము అని యర్థము

"పరిజనులకుం బ్రభువుపైగల ప్రేమ" అని టిప్పణి. ఈ అర్థము ఎక్కడను లేదు,

అక్షిగతులు = (ఇచ్చటి సందర్భముననుసరించి) ద్వేష్యులు అని యర్థము. 'నానా' కంటబడినవారు,

టిప్పణియందు అక్షిగతులు = కంటబడిన వారు ద్వేష్యులు అని అర్థమీయ బడినది ఇది అస్ఫుటము, విపరీతార్థ ప్రదమును అగుచున్నది.

గండకము = చేపపిల్ల ఒక విధమైన చేప (నానా) ఖడ్గమృగము.

టిప్పణియందు, గండకము = ఖడ్గమృగము అని అర్థమీయ బడినది. ఇది ఈ సందర్భమున పొసగదు జూడుడు. (మూలము)

"అల్ప జలాశయంబు చేరిన విసారంబు (చేప) వట్టు అల్పు నాశ్రయించువాడు వాని తోడన తీఱును. అట్లు తీఱక మున్నను నా గండకమున కెట్లు వానికినట్లు గండములు మెండుగా నుండును"

"తక్కువ నీటి నాశ్రయించిన చేపవలె తక్కువవాని నాశ్రయించినవాడు వానితోడన నశించును నశింపక పూర్వము కూడ నా చేప వలె కష్టములను పొందును" అని భావము.

ఆ గండకము = ఆ చేప అని స్ఫుటముగ నుండ టిప్పణిలో ఖడ్గమృగము ఎట్లు వచ్చెనో తెలియదు, ఇది చాల అశ్రద్ధతో వ్రాసినవ్రాత.

టిప్పణియందు అభినయము = కరచరణాద్యవయవముల విన్యాసము చేత మనోగతమైన భావమును తెల్పు విద్య అని అర్థమీయబడినది అభినయము నాల్గువిధములు. వాచికము, ఆంగికము, సాత్త్వము ఆహార్యము అని. ఈ అర్థము ఒక్క ఆంగికాభినయమను భేదమును మాత్రము చెప్పుచున్నది. కాని ఈ అర్థము అసంపూర్ణము,

ఇట్లు పునరుక్తములు విస్మృతము. భావద్యోతక మాత్రములు ఐన యర్థములు అనేకములుగా ఉన్నాయి. వీనిని దిఙ్మాత్రంగా ప్రదర్శించెను కాబట్టి పరీక్షకులు టిప్పణియందలి లోపములను సవరించి ప్రకటింప వలయును. లేదా తప్పులను వ్రాసిన విద్యార్థులకు పరీక్షయందు హాని కలుగకుండ హామీని ప్రకటింప వలయును. లేనిచో ఉపాధ్యాయుని తప్పని తెలిసియు టిప్పణి ననుసరింప వలసి వచ్చును. దానివలన విద్యార్థికి జ్ఞానమునకు బదులు అజ్ఞానము హెచ్చును.

—సంపాదకవర్గం—

యస్. వి. నరసయ్య (గౌరవ సంపాదకుడు)
ఎ కె ఆర్ బి కోటేశ్వరరావు (సంపాదకుడు)
వి. వి. దాసు
యం రామకృష్ణరావు
యన్. వి నారాయణ (మేనేజరు)

విద్యాలయవార్తలు

అనకాపల్లి విశాఖజిల్లాలోని ముఖ్యపట్టణాలలో ఒకటి. ఇచ్చట ఒకేఒక స్కూలువుంది. దానిని మునిసిపల్ అధికారులు నడుపుతున్నారు. కాని యీ స్కూలులో విద్యావసతులు శూన్యం. విద్యార్థులు కూర్చొనుటకు బెంచీలులేవు చివరకు నేలపైన కూర్చొనుటకు చాపలైనా సప్లయిజేయరు. లేబరేటరీలో రసాయనిక పదార్థాలుండవు. అన్ని క్లాసులకు కావలసిన ఉపాధ్యాయులు లేరు. ఇందుచేత విద్యార్థుల సిలబసు పూర్తి అగుట లేదు దీనికితోడు నేడు హెడ్మాష్టరుగా పనిజేస్తున్న శ్రీ అడిదము నారాయణమూర్తిగారిని రిటైర్ అవమని మునిసిపల్ అధికారులుకోరారు. విద్యార్థులు శ్రీ నారాయణమూర్తిగారిని ప్రధానోపాధ్యాయునిగానే యుంచమని మునిసిపల్ కౌన్సిల్‌కు విజ్ఞప్తులు పంపుకొన్నారు. అధికారులు వీటిని లెక్కజేయలేదు. చివరకు విద్యార్థులు నారాయణమూర్తిగారిని రిటయిరవమని కౌన్సిలు నిర్ణయించి క్రొత్త హెడ్మాష్టరుగా కొండలరావుగారిని నియమించిన వారు పై తరగతులకు ఇంగ్లీషు చెప్పలేరు కనుక అట్టి యోగ్యతకలిగిన వేరొక ఉపాధ్యాయుని నియమించాలని కోరారు.

మునిసిపల్ అధికారులు విద్యార్థులయొక్క యీ కోర్కెలను ఎన్నిసార్లు మొరపెట్టుకొన్నా లెక్కజేయలేదు. ఆగస్టు 29 తో విద్యార్థులు వేరే గత్యంతరం లేక సమ్మెకు పూనుకొన్నారు సమ్మె సెప్టెంబరు 2 వ తేదీ వరకు జరిగింది చివరకు మునిసిపల్ అధికార్లు విద్యార్థుల కోర్కెల నంగీకరించి దిగిరాక తప్పలేదు.

రాజీ అనంతరం విద్యార్థులు విద్యాలయాలకు హాజరయ్యారు. కాని మేనేజిమెంటు రాజీని గౌరవించలేదు. స్కూలు ఫైనలు క్లాసుకు చెప్పలేని కొండలరావుగారినే తిరిగి పంపారు. ఇది విద్యార్థులలో అధికారుల రాజీ బూటకత్వాన్ని బయటపెట్టింది. తమహక్కుల రక్షణకు విద్యార్థి ఐక్యత మినహా వేరు గత్యంతరం లేదని అనకాపల్లి విద్యార్థులు గ్రహించారు. తమహక్కుల రక్షణకు నిలబడుతున్నారు.

వినుకొండ హైస్కూలు విద్యార్థుల విజయం

వినుకొండ తాలూకా అంతటికీ ఒకే ఒక హైస్కూలు. అందులో స్కూలు ఫైనలు క్లాసులు యీ సంవత్సరమే ప్రారంభింప బడినవి. ఫిజిక్సు లేబరేటరీ లేదనీ, ఫిజిక్సు, జాగ్రఫీ అసిస్టెంట్సు లేరనే సాకులతో జిల్లా విద్యాశాఖాధికారి స్కూలు ఫైనలు విద్యార్థులు పరీక్షలకు వెళ్ళేందుకు వీలులేదని హుకుం జారీ చేశాడు. జీతాలు కట్టించుకుని చదువు లేకుండా మూడు మాసాలుంచి యింకే హైస్కూలులోను చేరేందుకు వీలు లేకుండా చేసి యిప్పుడు యిండ్లకు దయచేయండనడం ఘోరం, ఈ విధంగా తమ జీవితాలను నట్టేట ముంచడం అన్యాయమని విద్యార్థులు ఐక్య కార్యాచరణ సంఘ ఆధ్వర్యాన సమ్మె చేశారు.



కాకినాడ విద్యార్థుల ఊరేగింపు

స్థానిక విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి గోపాలుని సత్యనారాయణగారు, తాలూకా కాంగ్రెస్ అధ్యక్షులు మరి కొంతమంది పెద్దలు కలసి జిల్లాబోర్డు స్పెషల్ ఆఫీసరు వద్దకు రాయబారం వెళ్ళగా, ఆయన కోర్కెలన్నీ తీర్చుతానని వ్రాత పూర్వకముగ వాగ్దానము చేయుటవల్ల సమ్మె ముగిసింది. ఐక్య ఉద్యమ విజయ ఫలితముగా అప్పుడే టెక్స్టు బుక్సు వచ్చాయి, మిగతా సౌకర్యాలన్నీ యేర్పాటు చేయ బడుతున్నవి

ఒక్క సైన్సు టీచరుకూడ లేని స్కూలు

గుంటూరుజిల్లా పెదకూరపాడు గ్రామస్థులు 20 వేల రూ.లు చందాలు వేసుకుని 1946 జులైలో హైస్కూలును శాంక్షను చేయించుకున్నారు. కాని చందాలలో 20 వేల రూ.లు మాత్రమే వసూలయింది. మిగతా చందాడబ్బు విషయమై జిల్లాబోర్డు నోటీసులిచ్చినా యింత వరకు పూర్తిగా వసూలు కాలేదు దర్శి లక్ష్మయ్యగారివంటి విద్యాభిలాషులు చందా వసూలు చేయుటకు పూనుకుంటే వెల్లలచెరువు వీరయ్యగారు కాంగ్రెసు-కమ్యూనిస్టు తగాదాలు తెచ్చి లక్ష్మయ్యగారితో సహకరించ నిరాకరించారు. తా చెడ్డకోతి వనమెల్ల చెరిచిందట. అలాగే వీరయ్యగారు తాను సహాయంచేయక పోగా వచ్చేసహాయాన్ని అరికట్టపూనుకున్నారట. ప్రజలవద్దనుండి వసూలయిన ధనముతో హైస్కూలుకని కొన్న స్థలం తనపేర వుండుట వల్ల వ్యక్తిగత కక్షలతో వీరయ్యగారక్కడ స్కూలుకట్టడానికి ఒప్పుకోవడం లేదు పైగా లక్ష్మయ్యగారు స్కూలును నిలపడానికై తనఖా పెట్టిన 20 యెకరాల పొలమును బోర్డువారిచే వేలము వేయించ కుట్రలు పన్నుతున్నట్లు తెలుస్తున్నది స్కూలు పెట్టి సంవత్సరము దాటినా ఒక్క సైన్సు టీచరుకూడ లేడు. అప్పుడే నలుగురు హిందీమాష్టర్లు మారారు. ఫలితం ఇంతవరకు పిల్లలకు అక్షరాలయినా రాలేదు

జీతాల పెంపుదలకు వ్యతిరేకంగా కాకినాడ విద్యార్థుల పోరాటం

ఇటీవల ప్రభుత్వం జారీచేసిన వుత్తరువ ప్రకారం హైస్కూళ్ళల్లో విద్యార్థులు రెండ నెలలు అదనముగ జీతాలు చెల్లించవలసివస్తున్నది కాకినాడ పి. ఆర్. సి. హైస్కూల్లో తగినంతమంది ఉపాధ్యాయులు లేరు. ఉన్న వారికికూడ జీతాలు జీవన ప్రమాణానికి త ట్లుగ హెచ్చించలేదు. అట్టిండెన్సున ప్యూన్సుతో తెప్పించడానికి బదులు మా ర్లతో తెప్పించుతారు, హెడ్మాష్టరు ఒక విద ర్థిని మూడురోజులు సస్పెండు చేశాడు. వీ న్నిటికి వ్యతిరేకముగ 10-9-47 న పి ఆర్ సి. హైస్కూలు విద్యార్థులు సమ్మె చేశారు మూడు వేలమందికి 60 మంది మాత్రమే లో లకు వెళ్ళారు కాని వారుకూడ బయటకు వచ్చే శారు హెడ్మాష్టరు సమ్మెను విచ్ఛిన్నం చేయ డంలో విఫలుడైనాడు. విద్యార్థులకు లొం సస్పెండు చేసిన విద్యార్థిని తిరిగి చేర్చు కున్నాడు. సాయంత్రం జరిగిన బహిరం సభలో జీతాలను తగ్గించేవరకు రాష్ట్రంలో తదితర విద్యార్థులతో సహా పోరాడాలని తీర్మా నించారు. ఇకముందు కూడ సమ్మెకమి నుంచుటకు నిశ్చయించుకున్నారు.


10వ కృష్ణాజిల్లా విద్యార్థి మహాసభ

సెప్టెంబరు 12, 13, 14 తేదీలలో 10వ కృష్ణాజిల్లా విద్యార్థి మహాసభ గుడివాడలో జయప్రదంగా జరిగింది, జిల్లా మారుమూలల నుండి షుమారు 30 స్కూళ్ళ నుండి ప్రతినిధులు హాజరయారు, జిల్లా ఉద్యమ చరిత్రలో యిన్ని స్కూళ్ళనుండి ప్రతినిధులు రావటం అపూర్వమైనవిషయం. 30 మంది విద్యార్థినులు 25 మంది హరిజన విద్యార్థులు, యింకా మహ్మదీయ విద్యార్థులు మహాసభకు ప్రతినిధులుగా హాజరవటం ఉద్యమ వ్యాప్తి బహుముఖాలుగా జరుగుతోందని సువ్యక్తం చేస్తుంది. పాలబుగ్గలారని బాలురు సైతం ప్రతినిధులుగా వచ్చి ఓర్పుతో, ఆసక్తితో సభా కార్యక్రమంలో పాల్గొని జయప్రద మొనర్చారు

ప్రతినిధుల సమావేశం-రాజకీయ స్థాయికి గీటురాయి

ప్రతినిధుల సమావేశం ప్రతినిధుల రాజకీయ స్థాయిని, చైతన్యాన్ని కళ్ళకు కట్టినట్లు వ్యక్త పర్చింది నేడు దేశాన్నెదుర్కొనే ప్రధాన సమస్యలపై తీర్మానాలు ప్రతిపాదించబడ్డాయి. ప్రతి తీర్మానానికి ముఖ్యమైన సవరణల వర్షం కురవటం విద్యార్థుల చైతన్యాన్ని ద్యోతక పర్చుతోంది. ఒక్క-రాజకీయ తీర్మానానికి 20 సవరణలురాగా అందులో 9 అంగీకరించ బడటం హెచ్చైన రాజకీయస్థాయికిగీటురాయి. అదేవిధంగా బానిస విద్యా విధానాన్ని సమూలంగా నిర్మూలించి, దానిస్థానే జాతీయ విద్యా విధాన సంస్థాపన జరగాలంటూ ప్రతి పాదించ బడిన తీర్మానానికి చాలా ముఖ్యమైన సవరణలు వచ్చినవి, దేశ పునర్నిర్మాణ కార్యక్రమంలో విద్యార్థు లెప్పుడూ వెనుకంజవేయరని, అవిరళ కృషిని సల్పటానికి ఎల్లప్పుడూ సిద్ధమేనని తెలియచేస్తూ ప్రతిపాదించ బడిన తీర్మానం విద్యార్థుల అకుంఠిత త్యాగదీక్షను తెలుపుతుంది. విశాలాంధ్ర నిర్మాణమే ఆంధ్రుల అభ్యున్నతికిమార్గమని, అందువల్ల తెలంగాణా ప్రజల పోరాటానికి సాహాయ, సానుభూతులు అందించాల్సిందిగా కోరుతూ మరొక తీర్మానం, బందరు విద్యార్థులపై విధించిన శిక్షను వెంటనే ప్రభుత్వం రద్దుచేయాలని, కేసుకయ్యే ఖర్చులకు రూ 1000- జిల్లాలో వసూలుచేయటానికి తీర్మానించారు. మతకలహాలు దేశారిష్టకమైనవి కాన వాటిని రూపుమాపుటకు విద్యార్థులంతా కృషిసల్పుతారని హామీయిస్తూ తీర్మానం పాసయింది. కామ్రేడ్ అన్నదా పిలుపునందుకుని అక్కడ హాజరైన ప్రతినిధులంతా వలంటీర్లుగా పనిచేస్తామని ప్రతిజ్ఞను కరతాళధ్వనుల ద్వారా తెలియచేసారు. ఇంకా అనేక తీర్మానాలు అంగీకరించ బడ్డాయి,

కైకలూరు ఎంతోవెనక బడ్డ ప్రదేశమైనా. మంచి వైజ్ఞానిక దళాన్ని పంపి. మ్యూజిక్ కళామాధురిని కురిపించి ప్రేక్షకులను ముగ్ధులనుచేసి బహుమానం సంపాదించారు. వాన పాముల దళం తమ నటనాచతురతను చూపి ప్రేక్షకులమన్ననలకు పాత్రులయ్యారు. వ్రాత పత్రికలలో తిరువూరు(విప్లవవిద్యార్థి)కి ప్రథమ బహుమతి, (చల్లపల్లివిద్యార్థి) పత్రికకు రెండవ బహుమానం వచ్చింది



జి. జగన్నాధరెడ్డి

రాత్రికి జి జగన్నాధరెడ్డిగారి అధ్యక్షతను మహాసభలో ఐదువేలమంది పాల్గొన్నారు. ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు కడియాల గోపాలరావుగారు ప్రారంభించారు. అఖిలభారత విద్యార్థి నాయకులు యస్, వి. నరసయ్యగారు ఉపన్యసించారు, ఈ క్రిందివారు నూతన సంవత్సర కార్యవర్గంగా ఎన్నుకోబడ్డారు.

కంచర్ల రామశేషగిరిరావు (అధ్యక్షులు) పరుచూరి కోటేశ్వరరావు (ఉపాధ్యక్షులు) చలసాని శ్రీనివాసరావు (ప్రధాన కార్యదర్శి) వేములపల్లి కృష్ణమూర్తి, వై. చంద్రశేఖర్ (సహాయ కార్యదర్శులు) వీరితోపాటు మరి 8 మంది జిల్లా ఆర్గనైజర్లు ఎన్నుకో బడ్డారు. ప్రతి యూనిట్ నుండి ఒక్కొక్కరు చొప్పున 41 మందితో జిల్లా కౌన్సిల్ ఏర్పరచ బడింది,

యువజన మహాసభ సప్లిమెంటు

★

చందారులకు మంచి అవకాశం

ప్రథమ యువజన ఫెడరేషన్ మహాసభ రిపోర్టు, తీర్మానాలు, ప్రణాళికతోను, భీమవరంలో జరుగు రాష్ట్ర విద్యార్థి మహాసభ సభ చిత్తుతీర్మానములతోను - 'నవయుగ' నవంబరు సంచికతోపాటు 16 పేజీల ప్రత్యేక సప్లిమెంటు ప్రకటింపబడును. ఈ సప్లిమెంటు చందాదారులకు ఉచితంగా పంపబడును. ఆఫీసుకు అందిన చందాదారు మాత్రమే గుర్తింపబడును.

ఏజంట్లకు

సప్లిమెంటు ధర రు. 0-2-0 అమ్మకంలో 12½% కమిషన్ యివ్వబడును. సప్లిమెంటుకు ప్రత్యేక ఆర్డర్లు పంపిన వారికి మాత్రమే కాపీలు పంపబడును. ఏజంట్లకు కావలసిన కాపీలసంఖ్య అక్టోబరు 10 కి తెలియజేయవలెను.

మేనేజరు

(3 వ పేజీ తరువాయి)

చేస్తూ సహోదరులులాగ మెలగుతున్నపుడు ఆ దృశ్యం చూసిన, ఎవరి మనసు సంతోషంతో పుప్పొంగదు ? ఈ మహాసభ యువజనోద్యమ చరిత్రలోనే గాకుండ మానవ చరిత్రలోను అద్వితీయ మైంది మూడవ ప్రపంచయుద్ధం తప్పదని ప్రలాపించే యుద్ధోన్మాదులకు ఇది ఒక సవాల్. మిత్రరాజ్య సమితిలో చీలికలు తీసికొనిరావడానికి ప్రయత్నించే చర్చిలు, ట్రూమన్‌లకు ఇది ఒక చెంపపెట్టు. ఈ మహాసభలో చూపిన సౌభ్రాతృత్వం. పరస్పర సహాయ సానుభూతులను ప్రపంచ యువకులు నిలబెట్టు కోవడమే గాకుండ పెంపొందింప గలిగినట్లయితే. ఏ దుష్టశక్తి కూడ ప్రపంచ శాంతికి హాని కలుగచేయలేదు శాంతి, ప్రజా స్వామ్యాల కొరకు నేడు జరుగుతున్న అంతర్జాతీయ పోరాటంలో ప్రేగ్ యువజనోత్సవాలు ఒక గొప్ప విజయం

(విమల బకాయా, మదన్ బకాయాల రిపోర్టులకు అనుసరణ)

ఆర్. వి. రాఘవేంద్రరావు

1400 మంది విద్యార్థుల ఐక్యపోరాటం

దాసరి నాగభూషణరావు
కార్యదర్శి, విద్యార్థి ఐక్యకార్యాచరణ సమితి

గుంటూరు పట్టణంలో సైప్పు నిరంకుశ చర్యల నెరగని ప్రజలు లేరు అందుచేత ప్రతి ఒక్కరూ సైప్పును నిరసిస్తారు కాని ఆగస్టు 15 న 6 వేల రూపాయలు ఖర్చుపెట్టి తానూ భారత స్వాతంత్ర్య ప్రియుడనని ముద్ర పొందదలచాడు. మరియొక ప్రక్కనుండి తన నిరంకుశ చర్యలను సాగిస్తూనే యున్నాడు.

బి. ఏ తరగతిలో అమాయకులైన ఇద్దరు విద్యార్థులను అన్యాయంగా సస్పెండుచేసి తిరిగి చేర్చుకో నిరాకరించాడు వెంటనే పట్టణ విద్యార్థి కార్యాచరణ సంఘం (శ్రీ లింగారెడ్డి నిరశన వ్రత సందర్భంలో రాజకీయ భేదాలు లేకుండా విద్యార్థులచే ఎన్నుకోబడిన కమిటీ) కలుగజేసికొని రాయబారాలు విఫలమగుట వలన సెప్టెంబరు 6 వ తేదీన సమ్మె పిలుపు నివ్వగా విద్యార్థులంతా ఐక్యతతో సమ్మెలో పాల్గొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ తల్పశాయిగారి ద్వారా సస్పెండుచేసిన విద్యార్థులను చేర్చుకుంటానని వ్రాతపూర్వకంగా ప్రిన్సిపాల్ తన అనుమతిని తెలియజేయగా కార్యాచరణసంఘం సమ్మెను ముగించింది విజయోత్సాహంతో విద్యార్థులు క్లాసులకు వెళ్ళారు.

హాస్టల్ పరిస్థితి

కాలేజీలో పరిస్థితులు మాత్రం చక్కబడ లేదు హాస్టల్సు విషయం మరీ అధ్వానంగా ఉంది హయర్‌హాల్ (కాలేజిహాస్టల్) వార్డెన్ ప్రిన్సిపాల్ జేబులోమనిషి, విద్యార్థులకు సౌకర్యాలేమీలేవు లంచగొండితనం ఎక్కువయింది. ఖర్చులా తప్పవు. సౌకర్యాలు శూన్యం దీనికితోడు రామానుజులు సోదరులిద్దరు ఆల్విన్, రిచర్డు అనేవారు హయ్యరు హాలులో మకాంపెట్టారు. వీరు ప్రవీణులైన దొంగలగుటవలన విద్యార్థుల జేబులలో డబ్బులుండే ఆశలేదు హాస్టల్ విద్యార్థులు తన ప్రియమైన తమ్ములను దొంగలని అవమానిస్తున్నారని రామానుజులు విద్యార్థుల్ని నానా దుర్భాషలాడింది. (ఉదా: ఈ స్టూడెంట్సు నాస్లిప్పర్సుకూడ సమానులుకారు) ఈవిషయమై 14 తారీఖున విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు రిపోర్టుచేయగా ఆయన రామానుజులును మందలించడానికి బదులుగ ఆమెను అనవసరంగా కించపరుస్తున్నారని విద్యార్థులను నీచులుగా అనరానిమాటలన్నీ అన్నాడు. (ఉదా. కు Rascals, Stupids) ముఖ్యులైన కొంత మందిని ఈ అల్లరికి కారకులనే సాకుతో డిస్మిస్ చేస్తానంటూ ఆ కోపంతో ఆ రాత్రి భోజనశాలను మూసివేయించి 158 మంది విద్యార్థులకు తిండిలేకుండా చేశాడు. ఎంతో కాలంనుంచి అమిత నిర్బంధానికిలోనై నానా అవస్థలు పడుచున్న విద్యార్థులు ఈ అవమానాన్ని సహించలేక తమ మండుచున్న హృదయాలతో కాలుచున్న కడుపులతో హాస్టలు నుండి బయిటకువచ్చి తమతోటి విద్యార్థుల సహాయాన్ని అర్థించారు.

రెండవసారి సమ్మె

15 వ తేదీ ఉదయం కార్యాచరణసంఘం సమ్మెపిలుపు నివ్వగా సెప్టెంబరు పరీక్షలు జరుగుచున్నా ఒక్కవిద్యార్థికూడ పరీక్షకు వెళ్ళలేదు మధ్యాహ్నం కుంభవర్షం కురుస్తున్నా పికెటర్లు అలాగే గేట్లవద్ద నిలబడి సమ్మెను జయప్రదం చేశారు సాయంకాలం విద్యార్థులంతా ప్రిన్సిపాల్ వద్దకువెళ్ళి వెంటనే హయర్ హాల్ లో భోజనసదుపాయంచేసి, విద్యార్థుల కోర్కెలను తీర్చవలసినదిగకోరారు. కాని ప్రిన్సిపాల్ పెడచెవినిబెట్టి హయర్ హాల్ విద్యార్థులను ఏదోఒకరకంగా విడదీయాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు చివరకు రాత్రి 9 గంటలకు భోజనసదుపాయం చేయక తప్పిందికాదు. ఆరాత్రి హాస్టల్‌కు తనఅనుయాయులను పంపి క్రిష్టియన్ విద్యార్థులను ఎదో ఒకరకంగా మతోద్రేకాన్ని ఎక్కువజేసి తన వైపుకు తిప్పుకోప్రయత్నించినప్పటికిని ఐక్యతావసరాన్ని గట్టిగ గుర్తించిన ఆవిద్యార్థి సోదరులు మాత్రం ఈ మత ప్రచారానికి లోబడలేదు

16 వ తేదీ ఉదయం మరల సమ్మెప్రారంభమైనది పరీక్షలకు వెళ్ళవలసిన విద్యార్థులంతా సమ్మెలో పాల్గొంటున్నారనే సాకుతో మరల హాస్టల్‌లో భోజనం లేకుండా చేశాడు. కాలపరిమితి లేకుండా కాలేజీని మూసినట్లు ప్రకటించాడు. వెంటనే విద్యార్థులంతా సమావేశమై తమ కోర్కెలు తీర్చబడేవరకు ఐక్యపోరాటాన్ని సాగించవలసినదేనని, శాయశక్తుల శాంతియుత పరిష్కారానికి కృషిచేయాలని తీర్మానించారు అన్ని ప్రజాసంస్థల, విద్యార్థి సంస్థల సహాయాన్ని అర్థించారు.

విద్యార్థులపై దౌర్జన్యం

ఆ సాయంత్రం విద్యార్థులంతా సైప్పు దురంతాలను గురించి తమ తమ గ్రామాల్లో ప్రచారం చేసేందుకు బయలుదేరి వెళ్ళుచున్న సమయం. రామానుజులు తిట్టిన తిట్లను తోటి విద్యార్థులతో చెప్పిన థియోడర్ అనే విద్యార్థి రూములో సామాను సర్దుకుంటుండగా ప్రిన్సిపాల్, రామానుజులు, వార్డెన్, సాయుధులైన మరి ముగ్గురువచ్చి అతనిని అటకాయించగా వెంటనే ఆ విద్యార్థి తప్పించుకొని బయట పడ్డాడు. తోటి సోదరుల సాయంతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ద్వారా తన సామానులను తర్వాత తెచ్చుకోగల్గాడు. కాని దుష్టబుద్ధి రామానుజులు మాత్రం కార్యాచరణసంఘ కార్యదర్శి ని, హాస్టల్ విద్యార్థినాయకుడైన కె. పాల్‌ను, థియోడర్‌ను హత్యగావించుతానని ప్రగల్భాలు కొడుతూనే వుంది. ఎన్నో అగ్నిపరీక్షలలో ఆరితేరిన గుంటూరు విద్యార్థుల సంగతి రామానుజులుకు, సైప్పుకు ఇంకా అనుభవం లేనట్లున్నది!

*

విద్యాసమస్యల పరిష్కారానికి ఐక్యతేమార్గం

యం. రామకృష్ణరావు
కార్యదర్శి, ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్

అఖిలభారత విద్యార్థి కాంగ్రెసు, ఫెడరేషన్‌లు దేశంలో ఏర్పడ్డ నూతనపరిస్థితులను అవలోకించి, ప్రత్యేకంగా విద్యార్థి లోకంలో రోజురోజుకు అధికతరమవుతున్న ఐక్యతా వాంఛను గుర్తించి, పై రెండుసంస్థల కార్యవర్గాలు ఐక్య ఉద్యమానికి సుముఖత వెల్లడి చేసినాయి ఈతీర్మానాలు బయటపడుటయే తడవుగా, ఆంధ్ర విద్యార్థిలోకం కదిలింది ఐక్యకృషిని చవిచూచిన ఆంధ్ర విద్యార్థులు కర్తవ్యోన్ముఖులయ్యారు లింగారెడ్డి నిరసన దీక్ష సమయంలో, వాల్తేరు, గుంటూరు విద్యార్థుల ఐక్యకమిటీలు నిర్మించబడి, నేటివరకు విద్యార్థి సమస్యలపై పనిచేస్తున్నాయి. జీతాల పెంపుదల, అధికారుల నిర్బంధానికి వ్యతిరేకంగా ఐక్యయాక్షన్‌కమిటీ ఏర్పడి పి. ఆర్. హైస్కూలులో కాకినాడలో కొన్ని విజయాలు సాధించింది ఇదేవిధంగా గుంటూరుజిల్లా యూపూరుపాలెంలో ఐక్యకమిటీ ఏర్పడి పని చేస్తూంది. ఈవిధంగా యీ ప్రదేశాలలో సమస్యలపై తాత్కాలికంగా ఐక్యమై విజయాలు సాధించారు విద్యాలయాలు తెరచి 3 మాసాలైంది, ఇంత బ్రహ్మాండమైన నూతన చైతన్యం విద్యార్థిలోకంలో వెల్లివిరిసిందంటే పై సంస్థల తీర్మానాలను విద్యార్థులు హృదయపూర్వకంగా ఆచరించుతున్నారని వేరే చెప్పనక్కరలేదు. ఆగస్టులో బెజవాడలో జరిగిన విద్యార్థికాంగ్రెస్ వర్కర్ల సమావేశంలోకూడా "గత విభేదాలను మరుద్దాం" అనే దృఢవిశ్వాసాన్ని వెల్లడించారు.

ఐక్య ఉద్యమంలో మురాలకు స్థానం లేదు,

విద్యార్థి సామాన్యం, విద్యార్థి కాంగ్రెసు కార్యకర్తలు, ఐక్యతానినాదాన్ని ఆచరించటం విద్యార్థి కాంగ్రెసులోని కొందరు నాయకులకు కంటకప్రాయమయింది.

ద్వేష పూరిత వాతావరణాన్ని కల్పించి విద్యార్థి కాంగ్రెసును ఏ కొద్దిమంది చేతుల్లోనో పెట్టుకొనే అవకాశానికి ఐక్యతాకార్యక్రమం గొడ్డలిపెట్టయింది అందుచేకొద్దిమందివ్యక్తులు ఐక్యతా నినాదాన్ని వ్యతిరేకించి కాలవాహినికి ఎదురీద పూనుకున్నారు ఇందుకు ఎ ఎస్ ఆర్ క్రిష్ణ (రాష్ట్ర విద్యార్థి కాంగ్రెసు కార్యదర్శి) సుంకర సత్యనారాయణగార్లు నాయకత్వం వహించారు తమ పలుకుబడిని ఉపయోగించి గుంటూరు విద్యార్థులకు ఏకైక ప్రాతినిధ్య సంస్థగా వున్న యాక్షన్‌కమిటీలోకి తమ అనుచరులను రాకుండా చేయ గలిగారు. నంద్యాల విద్యార్థికాంగ్రెసులో తన పలుకుబడిని వుపయోగించి ఆలిండియా విద్యార్థి కాంగ్రెసు ఐక్యతా తీర్మానానికి వ్యతిరేకంగా తీర్మానం ప్యాసు చేయించారు మద్రాసులో ఆంధ్రరాష్ట్ర విద్యార్థి వర్కర్లు సమావేశమయి అఖిలభారత విద్యార్థి కాంగ్రెసు ఐక్యతా తీర్మానాన్ని ఖండించారు. ఈ ఐక్యతావ్యతిరేకులు చేయించిన తీర్మానాలపై విద్యార్థి కాంగ్రెసు నాయకుల ప్రకటనలు ఉదహరించితే, వీరి బండారం బట్టబయలు చేస్తానికి వీలనుకొంటాను,

చిత్తూరుజిల్లా విద్యార్థికాంగ్రెసు కార్యదర్శి, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు అయిన శ్రీ సి కె నారాయణరెడ్డిగారు " రాష్ట్రకార్యవర్గ సభ్యులకుగాని, వర్కర్లుకుగాని తెలియచేయకుండా యిట్టి సమావేశం జరగడం ఆశ్చర్యంగావుంది. ఇటువంటి తీర్మానం చర్చకువస్తుందని మాకేమీ సర్క్యులరుగాని, వర్తమానంగాని లేదు మద్రాసులో వర్కర్ల సమావేశం అధికార పూర్వకమైనది కాదనీ ఐక్యతాతీర్మానానికి వ్యతిరేకులగు కొద్దిమంది సభ్యులుచేసినపని విద్యార్థులలో వస్తున్న ఐక్యతను విచ్ఛిన్నం చేయటానికి ఉద్దేశింపబడింది "

"విద్యార్థిసమస్యలపైన పోరాటాలంచే ఐక్యకార్యాచరణసంఘాలు ఎంతైన అవసరం" అని శ్రీ కె ఎల్, హనుమంతరావు గారు (గుంటూరు విద్యార్థి కాంగ్రెసునాయకులు) ప్రకటించారు,

ఐక్యతావ్యతిరేకుల వాదనేమిటి ?

"ఐక్యతా కార్యక్రమం వలన మనం బలహీనపడుతాం, విద్యార్థి ఫెడరేషన్ బలపడుతుంది" అని ఐక్యతా వ్యతిరేకులు వాదించుతున్నారు, విద్యార్థులకు సేవచేయటమా? లేక నాయకత్వాలకు పెనుగులాడటమా ? మన విధ్యుక్తధర్మం అని యీ మిత్రులను ప్రశ్నిస్తున్నా ఈ రోజున మనముందున్న సమస్య నాయకత్వాలకు తగువులాడడమా ? లేక నిరంకుశ విద్యాలయాధికారుల దాడినుంచి విద్యార్థి ఉద్యమాన్ని రక్షించుకోవడమా? అని విద్యార్థి సోదరులు ఆలోచించాలి, విద్యార్థుల ఐక్యం కావాలని కోరుకొనే ఐక్యతా వ్యతిరేక నాయకులు విద్యాలయాలు తెరచిన మూడు మాసాల నుంచి నాయకత్వ తగువులాటలో నిమగ్నులయి వున్నారు. విద్యార్థి సమస్యలు విద్యార్థి సేవ మరచిపోయిన యీ నాయకులకు విద్యార్థి ఉద్యమం ముందువున్న ప్రమాదం వీరికి అర్థం కావటంలేదు అందుచేతనే ముఠాలుకట్టి పై అభివృద్ధి నిరోధక తీర్మానాలు చేయించుతున్నారు. విద్యార్థి లోకానికి నేడు ముఠా రాజకీయాలతో నిమిత్తంలేదు ఏ విద్యార్థి నాయకత్వాన్ని బల పర్చాలా ? అని కాదు విద్యార్థిలోకం ఆలోచించు తున్నది సమస్యల సక్రమ పరిష్కారానికి మార్గమేది ? నిరంకుశ విద్యాలయాధి కారులపై విజయఢంకా మ్రోగించేది ఎప్పుడు ? అనే ఆలోచించు తున్నారు, అందుకై కృషి చేస్తున్నారు. ఈ సత్యాన్ని ఐక్యతా వ్యతిరేక నాయకులు గుర్తించితే మంచిది

ఐక్యతను దృఢతరం చేయాలి.

ఆంధ్ర విద్యార్థులను అతి ప్రాముఖ్యమైన డిటెన్షన్‌సమస్య, గుంటూరు విద్యార్థుల సమ్మె, సిండికేటు దాడి, బందరు విద్యార్థుల శిక్షలు, నైజాం, మైసూరు ప్రజల పోరాటాలు మొదలైన అనేక కఠోర సమస్యలు ఎదుర్కొంటు

(మిగతా 16 వ పేజీలో)

నిజాం ప్రజాపోరాటం

నిజాం రాష్ట్రములో స్టేటు కాంగ్రెసు, కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రమహాసభల నాయకత్వాన ప్రజలు బ్రహ్మాండమైన పోరాటం జరుపుతున్నారు. సంస్థానం యూనియన్‌లో చేరాలని, బాధ్యతాయుత ప్రభుత్వం స్థాపించబడాలని, నిజాం నిరంకుశత్వం పోవాలని ప్రజలంతా కోరుతున్నారు. సామ్రాజ్యవాదుల బంటు నిజాం నవాబు ఆగస్టు 15 నాడు స్వతంత్రాన్ని ప్రకటించుకొని ఒకకోటి 70 లక్షల సంస్థాన ప్రజల్ని శాశ్వత బానిసత్వంలో ఉంచడానికి నిశ్చయించుకున్నాడు. ప్రజలు తరతరాలుగా తామనుభవించిన జమీందారీ - జాగీర్దారీ దోపిడీ బానిసత్వాన్ని అంతము చేసుకొనబూనుకున్నారు. వందల ప్రజలు ప్రభుత్వాన్ని ధిక్కరించి జైళ్ళకు పోతున్నారు. రిజర్వు మిలిటరీ తుపాకిగుండ్లకు యెదురు నిలుస్తున్నారు. నైజాం పైశాచిక హింసాకాండకు గురియౌతున్నారు. చిన్న పెద్ద పట్టణాలన్నిటిలోను విద్యార్థులు, యీ ప్రజా స్వాతంత్ర్య పోరాటములో అగ్రగాములుగా వుంటున్నారు. ప్రభుత్వమీ ప్రమాదాన్ని గుర్తించే విద్యార్థి వుద్యమంపైన తన నిర్బంధ విధానాన్ని కేంద్రీకరిస్తూవుంది. అనేక నిర్బంధాలకు లోనౌతూ అఖిల హైద్రాబాద్ విద్యార్థి యూనియన్, యీ విద్యార్థి ప్రతిఘటనకు నాయకత్వం వహిస్తున్నది.

అగ్నిపర్వతం బ్రద్దలైంది

ఆగస్టు 2వ తేదీన కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు శ్రీ నరేంద్రజీ అరెస్టు జరిగింది. మరునాడే 5000 మంది పట్టణ విద్యార్థులు బ్రహ్మాండమైన వూరేగింపుచేసి తమ అసమ్మతిని చాటారు. పోలీసులు తీవ్రంగా లాఠీచార్జీ చేశారు. అయినా విద్యార్థులు చెదిరిపోవ నిరాకరించారు. చివరకు స్వామీ రామానందతీర్థ విజ్ఞప్తిపైన వారు శాంతియుతంగా వెళ్ళిపోయారు.

పట్టణ విద్యార్థుల యీ ప్రదర్శన పట్టణ ప్రజలనేగాక జిల్లాలలోని విద్యార్థుల్నిగూడా వుత్తేజపరచింది. భువనగిరిలో విద్యార్థులు అసమ్మతి సమ్మెచేసి వూరేగింపు జరిపారు. వరంగల్ తదితర ప్రాంతాల్లోనూ సమ్మెలు జరిగినవి.

"యూనియన్ దే"

ఆగస్టు 7వ తేదీన హైద్రాబాద్ భారత యూనియన్‌లో చేరటకు ఆందోళన చేయాలని స్టేటుకాంగ్రెసు నిర్ణయించింది. విద్యార్థులు మరొకసారి కార్యరంగములోకి దూకారు. 144 సెక్షనుగూడా ధిక్కరించి వూరేగింపులు, ప్రదర్శనాలు జరుప నిశ్చయించారు. కాని స్టేటు కాంగ్రెసు నాయకులు అలాంటివేమీ చేయవద్దని ఆదేశించటముతో విద్యార్థుల్లో కొంతవరకు నిరుత్సాహ మేర్పడింది.

జిల్లాలలో విద్యార్థులు మాత్రం బ్రహ్మాండంగా సమ్మెలు, వూరేగింపులు జరిపారు. సూర్యాపేట, ఖమ్మం పట్టణాల్లో అరెస్టులు, స్కూలునుండి విద్యార్థుల తొలగింపులు జరిగినవి



బ్రిటిష్ తొత్తు నైజాం

సంస్థానమంతటా మతకలహాలవస్తాయనే పుకార్లు చెలరేగుతున్నా విద్యార్థులు తమ వీరోచిత పాత్రను నిర్వహించారు. ప్రజల్లో నూతనోత్తేజం కలిగించారు.

* * *

ఆగస్టు 15వ తేదీన స్వతంత్ర దినోత్సవం. ప్రభుత్వం తీవ్రమైన చర్యలు తీసుకోనారంభించింది. హైద్రాబాద్, సికింద్రాబాద్‌లలో పోలీసులు, కాంగ్రెస్ కార్యాలయంపైనకూడ జండా నెగురవేయ నివ్వలేదు.

పోలీసులకండ్లలో దుమ్ముజల్లి 200 మంది విద్యార్థులు అఖిల హైద్రాబాద్ విద్యార్థి యూనియన్ ఆఫీసులో సమావేశమైనారు. కామ్రేడ్ రఫీ అహమ్మద్ (కార్యదర్శి) జాతీయపతాకాన్నెగుర వేశారు.

* * *

జండా దినోత్సవాలు

స్టేట్ కాంగ్రెస్, కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్ర మహాసభల పిలుపునందుకొని గ్రామగ్రామాన 2 సెప్టెంబరునాడు "జండా దినోత్సవాలు" జరిపారు.

సంస్థానమంతటా 145 సెక్షన్ నిర్బంధాన్ని ధిక్కరించి విద్యార్థులు తిరిగి సమ్మెలు వూరేగింపులు చేశారు, జాతీయపతాకాల నెగురవేశారు. ఖమ్మం, మధిర, కరీంనగరం, వరంగల్, సూర్యాపేట పట్టణాల్లో సమ్మెలు అరెస్టులు జరిగినవి.

* * *

సెప్టెంబరు 8 నాడు నిర్బంధవిధాన వ్యతిరేక దినము జరుపడానికి అ. హై. విద్యార్థి యూనియన్ నిశ్చయించింది. హైద్రాబాదులో 5 వేలమంది సమ్మెచేసి వూరేగింపు తీశారు. రెండు ప్రదేశాల్లో బాష్పవాయువు ప్రయోగించబడింది. నిజాం కాలేజీ ఆవరణలో విద్యార్థులను క్రూరంగా బెత్తాలలో కొట్టారు.

సంస్థాన విద్యార్థిపోరాటం అఖిల భారత విద్యార్థుల దృష్టి నాకర్షింప నారంభించింది. ఆగస్టు 16వ తేదీని "హైద్రాబాద్ దినం" జరపాలని అ. భా. విద్యార్థి ఫెడరేషన్, విద్యార్థి కాంగ్రెసు పిలుపు నిచ్చాయి. సంస్థానము బైట అనేక ప్రాంతాలల్లో సభలు జరిపి విద్యార్థులు నైజాం నిరంకుశత్వాన్ని ఖండించారు. హైద్రాబాద్, నల్లగొండ, వరంగల్, పట్టణాల్లో విద్యార్థులను నిరోధించడానికి బ్రహ్మాండమైన పోలీసు బందోబస్తులు జరిగాయి. 145 సెక్షన్ ప్రయోగించారు. పోలీసులు వాడవాడలను చుట్టివేశారు. అయినా విద్యార్థులు పోలీసు నిర్బంధాల నెదిరించి మీటింగులు జరిపారు. లాఠీచార్జీలు, అరెస్టులు విపరీతంగా జరిగినవి.

* * *

విచ్ఛిన్న ప్రయత్నాలు

ఉద్యమ మీవిధంగా ముందుకు సాగుతు

విద్యార్థుల వీరోచితపాత్ర

— టి. లక్ష్మీనరసింహారావు

వుంటే కొందరు వ్యక్తులు వుద్యమాన్ని చీల్చటానికి ప్రయత్నిస్తూ వుండటం చాలా విచారకరం.

హైద్రాబాద్ పట్టణంలో పట్టణ యూనియన్ కమిటీపై శ్రీరాములు, శివరామశాస్త్రి అనేవారు నిరంకుశ నాయకత్వం వహిస్తున్నారు. ఆల్ హైద్రాబాద్ విద్యార్థి యూనియన్ రద్దయి పోయిందని, తామే మొత్తం విద్యార్థి వుద్యమానికి నియంతలమని చెప్పుకుంటున్నారు. అ. హై. యూనియన్‌కు సంబంధంలేకుండానే వీరిద్దరూ బెజవాడనుండి అఖిల హైద్రాబాద్ విద్యార్థి యూనియన్ (కాంగ్రెసు) అనేపేరుతో జిల్లాలకు ఆదేశాలు, సూచనలు పంపుతున్నారు జిల్లాలలోని విద్యార్థులకు అ. హై. విద్యార్థి



సంవత్సరాలనుండి బానిస సంకెళ్ళలో మ్రగ్గుతున్న సంస్థానప్రజ మేల్కొంటున్నారు నెత్తిపైకెక్కి నిరంకుశంగా పెత్తనంజేసేవాండ్లను త్రోసివేస్తున్నారు

యూనియన్ నాయకత్వంలో సంపూర్ణ విశ్వాసముంది. పైవారి చర్యలు "ఒకపోటీ సంస్థ"ను యేర్పరచడానికి ప్రయత్నాలని వారు భావిస్తున్నారు. నిజాం నాజీ ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్ని బలహీన పరిచే యిలాంటిచర్యలను ఏ విద్యార్థీ హర్షింపజాలడు. కాంగ్రెస్‌నాయకులుగూడా విద్యార్థి వుద్యమ ఐక్యత అవసరాన్ని దృష్టిలోపెట్టుకొని పైవ్యక్తులను మందలించవలసివుంది.

బెజవాడ సమావేశం

శ్రీరాములు, శాస్త్రిగార్లే బెజవాడలో ఒక కార్యకర్తల సమావేశం జరిపారు. తోటి కమ్యూనిస్టు కార్యకర్తలకీ విషయమేమాత్రం తెలియనివ్వలేదు. అయినా పట్టణంనుండి, జిల్లాలనుండి కొందరు కమ్యూనిస్టు, నాన్‌పార్టీ విద్యార్థులు సమావేశానికి హాజరైనారు కొందరు విద్యార్థి నాయకులమనుకొనేవారు అఖిల హైద్రాబాద్ విద్యార్థి యూనియన్ రద్దు అయిందని వాదించారు. అందుకు వీరు చూపించే కుంటిసాకులు, కొందరు అరెస్టు కావటము, మరికొందరు రహస్యజీవితము గడుపుతుండడము మాత్రమే! జిల్లా విద్యార్థులు వీరి వాదాన్ని ఖండించి అ. హై. విద్యార్థియూనియన్ నాయకత్వముపట్ల తమ విశ్వాసాన్ని ప్రకటించారు సిటీ యూనియన్, అ. హై. విద్యార్థి యూనియన్ కలిసి పనిచేయాలని ఒత్తిడి తెచ్చారు.

వీరు "కాలేజీలు విడిచివెళ్ళాలి" అనే మరో వినాదం తెచ్చారు ఈ కార్యక్రమం వెంటనే ఆచరణలోకి రావాలని వీరు కోరారు కాని జిల్లాల విద్యార్థులు, కొందరు పట్టణ విద్యార్థులు యీ కార్యక్రమం తక్షణం ఆచరణ యోగ్యం కాదని చెప్పారు. విద్యార్థులు పల్లెలలోనికి పోయి చేయగల పని స్వల్పమని. పట్టణాల్లోనే ఉంటూ వారు ప్రభుత్వవ్యతిరేక పోరాటానికి నాయకత్వంవహించాలని స్పష్టపరిచారు. విద్యార్థులేనిచో పట్టణాలలో పోరాటముండదని. ప్రభుత్వం తన పోలీసు మిలిటరీ బలాన్నంతటినీ గ్రామాలమీద కేంద్రీకరించగలుగుతుందని వారు సూచించారు పోరాటం మరికొంత ముందుకు సాగిన తరువాత యీ కార్యక్రమం తీసుకోవడమవసరమే ననే యేకీభావం విద్యార్థులందరిలోనూ వుంది.

విద్యార్థి సామాన్యం కాంగ్రెసు - కమ్యూనిస్టు - సోషలిస్టులందరి మధ్య ఐక్యతను వాంఛిస్తున్నారు. నిజాం నిరంకుశత్వాన్ని అంతా కలిసి యెదిరించాలని వారు కోరుతున్నారు కొందరు తమ నాయకత్వం స్థాపించుకోవడానికి పన్నే కుయత్నాలను వారు జాగ్రత్తగా ఒకకంట కనిపెట్టుతూ వుండాలి. ఐక్యతను రక్షించుకోవాలి, అప్పుడే వుద్యమం ముందంజ వేయగలుగుతుంది.

నవయుగ
ఆగస్టునెల జమాఖర్చుల

29	3	6	విరాళాలు				
394	0	0	చందాలు				
1066	6	0	ఏజెన్సీ అమ్మకం				
68	0	0	ప్రకటనలద్వారా				
666	4	0	అప్పుతెచ్చినది				
73	11	0	అనామతుద్వారా				
38	13	6	క్రితం నెల నిల్వ				
				బ్యాంకులో	120	0	0
				ఆఫీసు	82	7	0
				ప్రయాణం	29	13	0
				తపాలా	69	14	0
				బ్లాకులు	116	8	0
				ప్రింటింగు	711	0	0
				పేపరు కొనుగోలు	930	0	0
				అలవెన్సులు	69	8	0
				లైబ్రరీ	46	7	0
				రాష్ట్ర విద్యార్థిసంఘం	17	11	0
2336	6	0			2193	4	0
2193	4	0					
143	2	0	నెలాఖరున నిల్వ				

(13 వ పేజీ తరువాయి)

న్నాయి వీటిని పరిష్కరించటానికి విరివిగా ఐక్య కమిటీలు స్థాపించాలి కాని ఆచార్య రంగా వంటి ప్రముఖ కాంగ్రెసు నాయకులు ఐక్యతా వ్యతిరేక వినాదాన్ని ప్రోత్సాహించటం విచారకరం. ఇట్టి పంథాను విడనాడి పైకరిన సమస్యల పరిష్కారానికి ఐక్య కమిటీలకు చేదోడువాదోడుగా వుండాలని విజ్ఞప్తిచేస్తున్నాం. ఐక్యతా వ్యతిరేకులు తమ వినాదాలను విడనాడి ఐక్య ఉద్యమాన్ని నిర్మించటానికి ముందుకు రావాలని కోరుతున్నాం. ఇదే నేటి విద్యార్థి వుద్యమ నిర్మాతలకు వుద్యమాభిలాషులకు కర్తవ్యం అని మనవి చేస్తున్నాం

ఆసనాలు వేసేదెలా?

శ్రీ కోన వెంకటేశ్వర్లు

క్రిందటి సంచికలో ఆసనములవలన ప్రయోజనములనుగూర్చి వివరించబడినది ఈ వ్యాసములో ఆసనములు చేయుపద్ధతులు, ఒక్కొక్క ఆసనముయొక్క ప్రత్యేక ప్రాముఖ్యతలను గురించి వివరించబడును.

ఆసనములను ప్రారంభించుటకు ముందు ముఖ్యముగా ఈక్రింది నియములను గమనించవలెను.

1. ఆసనములను ఎల్లప్పుడు వేకువజామున మాత్రమే చేయవలెను

(2) ఆసనములు చేయుటకుముందు మలవిసర్జనము చేయడం, పండ్లు తోముకొనడం చేయవలెను. పొట్ట ఖాళీగా యుండవలెను

(3) ఆసనములు చేయునప్పుడు శరీరమునందు ఏ భాగమునకైననూ అలసటగాని, శ్రమగాని కలుగరాదు తక్కువ పరిశ్రమతో ఎక్కువ బలకరమైన అంగనిర్మాణమును సాధించుటయే ఆసనములయొక్క ముఖ్య ప్రయోజనము,

(4) ఆసనములు చేయుటకుముందునూ, చేయునప్పుడునూ నిరుత్సాహముగా యుండకూడదు


(5) ఆసనములు చేయునప్పుడు మనస్సును చలింపనీయకుండా, ఆయా ఆసనములవలన కల్గు ప్రయోజనములయందు దృష్టినియుంచవలెను మనస్సును ఇతర వ్యవహారములపైకి పోనీయరాదు

ఇక ముఖ్యమైన ఆసనములలో ఒక్కొక్కదానినిగూర్చి విచారింతము

శీర్షాసనము

చేయుపద్ధతి :

నాలుగు మడతలు గల ఒక దుప్పటిని దానిపై పరచవలెను మోకాళ్ళపై ఆని కూర్చొని రెండుచేతుల వ్రేళ్ళను ఒకదానిలో నొకటి దూర్చవలెను మోచేతులను దుప్పటిపై ఆనించి చేతివ్రేళ్ళు తలకు శిఖరముగా నుండునట్లు అమర్చి తలను దుప్పటిపైకి మోపవలెను. ఆపైని మెల్లగా తొడలు, మోకాళ్ళు, పాదములను పైకి ఎత్తి పటములో చూపబడినట్లు నిల్పవలెను. ఏమాత్రం తొందరకూడదు ప్రారంభమునందు తొడలవరకు మాత్రమే పైకి ఎత్తి నిలుపగల్గుటకు ప్రయత్నించవలెను ఆపైని మోకాళ్ళు, పాదములనూ నెమ్మదినెమ్మదిగా ఎత్తవలెను. దించునపుడుగూడ ఇలానే నెమ్మది నెమ్మదిగా దించవలెను. అంతేగాని ఒక్కసారిగా దూకరాదు మొదట 5 సెకండ్లతో ప్రారంభించి రోజురోజుకు కొన్ని సెకండ్లచొప్పున వృద్ధి




చేయుచూ రావలెను, ఈఆసనమును 10 నిమిషములు చేసినట్లయిన వెంటనే ఒక అరకప్పు పాలుగాని, నారింజ, నిమ్మపండ్ల రసముగాని త్రాగవలెను, ఇది చాలా ముఖ్యము. ప్రారంభములో తలతిరుగుట కండ్లుమంటలు అగుపించినను కొద్దిరోజులలోనే అవి కనబడకుండా పోవును

ఉపయోగములు — శీర్షాసనము దాదాపు అన్ని వ్యాధులను నశింపజేయును. ముఖ్యముగా నరముల నిస్త్రాణ జ్ఞాపకశక్తి నశించుట, మలబద్ధము, అజీర్ణము, స్వప్నస్ఖలనము లేక స్పెర్మటోరియా, దగ్గు మూత్రములో శుక్లముపోవుట, ప్రేవులు స్థానము దప్పుట మొదలగు వ్యాధులనన్నిటిని అమోఘముగా నిర్మూలించివేయును, శారీరక మానసికాభివృద్ధిని గావించును. మరియు బుడ్డ, వరిబీజము, గనేరియా, సవాయి, తెలుపు పోవుట, కొరుకుడు మొదలగు సుఖవ్యాధులను పారద్రోలును, అయితే బుడ్డ, వరిబీజములతో బాధపడువారు ఈ ఆసనమును అతి జాగ్రత్తగా చేయవలసియుండును. ఇది సర్వవ్యాధి నివారణాసనము. పైన జెప్పబడిన వ్యాధులనే కాక, తలకు, మెడకు, చెవికి, కంటికి, మెదడునకు, పొట్టకు, మరి యితర అవయవములకు సంబంధించిన యే వ్యాధినైనను నశింపజేయును పిచ్చి, మతిభ్రమణము, తలతిరుగుడు, దేహము వణకటం మొదలైన వ్యాధులను సమూలముగా నశింపజేయును. దీర్ఘాయువును కల్గజేయును,

సర్వాంగాసనము


చేయుపద్ధతి :

దుప్పటిపై కాలుచాచి వెల్లకిల పడుకొనవలెను చేతులను ప్రక్కకుచాచి యుంచవలెను అంతట మెల్లగా కాళ్ళనుపైకి ఎత్తవలెను. పాదములు మోకాళ్లు ఒకదాని కొకటి ఆనుకొని నిటారుగా యుండునట్లు చూడవలెను మోచేతులను దుప్పటిపై నుంచి రెండు చేతులతో వీపును గట్టిగా ఊతయిచ్చి



పట్టుకొనవలెను. బొమ్మను గడ్డము తాకు నట్లు చూడవలెను, కాళ్ళు నిటారుగా యుండ వలెను.


ఉపయోగములు :—సర్వాంగాసనము శరీరములోని అన్ని అంగములకును పుష్టిని, ఆరోగ్యమును కల్గజేయును. ముసలితనమును పోగొట్టి నవ యౌవనము కల్గించును. రక్తమును శుభ్రపరచి పుష్కలముగా వృద్ధి యగునట్లు చేయును. గుండెకు మంచి బలము నొసగును. ఈ ఆసనమునకు ఎన్నివందల రూప్యములు విలువగల టానిక్ లైనను సరిరావు. శీర్షాసనమువలన కల్గు ప్రయోజనము లన్నియు ఈ ఆసనము చేయుటవలన గూడా పొంద వచ్చును. శీర్షాసనము, సర్వాంగాసనము, పశ్చిమోత్తానాసనమును ప్రతి దినమును నియమము తప్పక అచరించిన యెడల సర్వ రోగములు నిర్మూలింప బడుటయేగాక; జీవిత మంతయూ నవ యౌవన వంతులు గాను, ఆరోగ్యవంతులు గాను నుండగలరు. నపుంసకత్వమును నిర్మూలించుటలో ఈ ఆసనమునకు పెట్టినది పేరు.



మత్స్యాసనము

చేయువిధము :....మొదట దుప్పటి పరచి దానిపై పద్మాసనము వేసి కూర్చుండవలెను. అంతట వెల్లకిల పరుండవలెను. మోచేతులను ఊతగాగొని శరీరము మెల్లగా లేపి మెడను వెనుకకు వంచి నేలపై మోపవలెను. ఇప్పుడు శరీరము యొక్క భార మంతయు పిఱ్ఱల మీదను మెడ మీదను నుండును. కాలి బొటనవ్రేళ్ళను చేతి వ్రేళ్ళతో పట్టుకొనవలెను.

ఉపయోగములు :—సర్వాంగాసనము చేసిన వెంటనే ఆ ఆసనమునకు వినియోగించిన కాలములో మూడవవంతు కాలమును మత్స్యాసనమునకు వినియోగించ వలెను. ఇది చాలా ముఖ్యము. మత్స్యాసనము సర్వాంగాసనము కలయికవలన మలబద్ధము; దగ్గు, క్షయ కొయ్యగండలు; మూర్ఛ, కుష్ఠు, ముష్టి మైధునము వలన కల్గు అన్ని చెడుగులు, శుక్లము నీరువలె పల్చనగుట మొదలగు వ్యాధు లన్నియు నాశనమగును. మెడలోని నరములు కండరములు బలపడును. శ్రద్ధతో ఎక్కువ కాలము అనగా కనీసము 10 నిముసములు సర్వాంగాసనము చేసిన వెంటనే ఈ ఆసనమును చేయుచున్నయెడల వ్యభిచారము. ముష్టి మైధునము మొదలగు దుర భ్యాసముల వలన కల్గు సర్వ చెడుగులను నిర్మూలింపబడి శరీరమునకు క్రొత్త శక్తి; కాంతి కల్గును.



భుజంగాసనము

చేయువిధము :—చాపపై దుప్పటిని పఱచి దానిపై బోర్ల పరుండుము. మోచేతులను వంచి అరచేతులతో భూమిపై మోపుచూ మెల్లగా తలను శరీరమును బొడ్డు వరకు పైకి ఎత్తవలెను. వెన్నెముకను వెనుకకు అదమవలెను. తలను పైకి లేపునపుడు నెమ్మదిగా గాలిని పీల్చుచూ కొంచెముసేపు ఆపి దించునప్పుడు నెమ్మదిగాదించి ఆవెంటనే గాలివదల వలెను. రోజూనకు ఆరు పర్యాయములు చొప్పున చేయవలెను.

ఉపయోగములు :—వెన్నెముకకు మంచి బలమును కల్గించును, నడుమునొప్పి, వీపు నొప్పి, అజీర్ణము మొదలగువానిని నశింప జేయును ఈ ఆసనము ముఖ్యముగా స్త్రీలకు మంచి ఉపయోగకర మైనది. స్త్రీల గర్భాశయము నందలి సర్వరోగములును, ఇంకా బహిష్టు కాకుండుట బహిష్టు వెడలునప్పుడు బాధ తెలుపు మొదలగు వ్యాధులను ఈ ఆసనము చేయుటవలన నిర్మూలింప బడును. ఇది స్త్రీలపాలిటి దివ్యామృతము.

మాయదారి మతమ ! మాయమైపోవే !

మాయదారీ మతమ ! మాయమైపోవే !
మాదు గొంతులుగోయు మారెమ్మ వీవే !
తరతరాల్నీ చరిత తలచిచూచినగాని
సాటివాడిని జంపసాయమౌ తత్వమె
మానవత్వం బెచట మచ్చుకైనాలేదు.
అసూయ ద్వేషాల అవతారమే నీవు ॥మా॥
పరలోకమును జూపి యిహలోక బాధలను
మరపించి మానవుల మాయబోధలజేసి
కలుకు దోపిడిగాండ్ర ఎలలజేసేశావు ॥మా॥
హిందూత్వమే గొప్ప యిస్లామెగొప్పంటు
ఎండమావుల్లోన నీళ్ళున్నవనిపించి
అన్నదమ్ముల మధ్య తన్నులాటలు పెంచి
మనదు గడ్డనుకోసి ముక్కచెక్కలు జేసి
తుక్కచించిన యాతుచందమొనరించావు ॥మా॥
ఉమ్మడిశతృలౌ తెల్ల పెత్తనదార్లు
దోపిడిని సాగింప దొడ్డి దోవలగుండ
వాలుగాగూర్చుండి వలలు పన్నుచునుండ
కళ్ళుమూయించి మతసారాయి త్రావించి
వైషమ్యములపెంచి పెడదారి త్రొక్కించి
తెల్ల పెత్తనదార్ల త్రోవసరిజేయగా
దాపురించావ ఓదౌర్భాగ్య దేవతా ॥మా॥
కష్టజీవుల కొల్లగొట్టి కోట్లార్జించి
గనులు, భూములు, మరలు, గలయట్టి కలవారు
కొండెక్కి కూర్చున్న కోటీశ్వరుల మూక
ప్రజలనెల్ల ఘోర దారిద్ర్యమునముంచి
దేశీయార్థికవ్యవస్థ దివాలా దీయించి
తెల్లవారితో జేరి కొల్లగొట్టగ జూచు
తెలచాటుకుట్ర ప్రజ తెలుసుకోనీకుండ
నీముసుగు తగిలించి నిలబెట్టచూనావు ॥మా॥
కుక్షిపోషణకొరకు లక్షలాదీ ప్రజలు
సాగించు స్వాతంత్ర్యపోరాటముల జీల్చి
నిజముగా తమ శతృలెవరో తెలియగనీక
కళ్ళుమూయించినీ కైపులో బడద్రోసి
కష్టజీవులమధ్య కలతలను రేపావు
కలవారిలోజేరి కలవారి పెత్తనము
కష్టజీవులపైని నెలకొల్ప బూనావు
తమ సోదరులగొంతె తరిగింప సాగావు ॥మా॥
గత చరితలో నీవు రగిలించి నట్టి యా
ఘోర హింసాకాండ క్రూర పైశాచికత
ఓర్వలేదిక జగతి విసిగివేసారింది
స్వానుభవమున నీదు నిజరూపుగాంచింది
నిజమెరిగి ప్రజలంత కదలిరాసాగారు
చాలు చాలిక నిన్ను సహియింపగాబోరు
నీరోజులిక చెల్లె నిక్కచ్చిగానేడు ॥మా॥

—చావలి రామచంద్రరావు.

నవయువకా !

నవయువకా ! యిది నవయుగమని కను,
మానవులందరు వొకటేగా, మానవోన్నతి
గనరా ॥నవ॥
సౌఖ్యంబేమో ఎరుగని మనుజుడు
నీకెటు సౌఖ్యము గూర్చునురా! యువజనుడా !
నీ వలెనే అందరి సౌఖ్యముచూడుమురా! ॥నవ॥
సౌఖ్యం బెరుగక ఒక డుండినమా
సంఘంబంతయు పాడగురా: ॥నవ॥
ఎందరో మాడుచునుండగ భువిలో
కొందరి సౌఖ్యము నిలువదురా !
యువజనుడా ! నీవలెనే అందరి
సౌఖ్యము చూడుమురా ॥నవ॥
గాంధీ, నెహ్రూ, జోషీ మొదలగు నాయకు
లందరు తెల్పిన దిదియే ॥నవ॥

హిందూస్తానీ ప్రచారక్, కొడాలి ఉమా మహేశ్వరరావు అంగలూరు కృష్ణా

బాపూజీ జన్మదినోత్సవం జరపండి

అక్టోబరు 2

భారత జాతీయోద్యమ అధినేతలలో అగ్రగణ్యుడు గాంధీజీ. ఆయన భారతదేశాభ్యున్నతికి చేసిన కృషి అపారం. భారతమాత మతకలహాల మధ్య దగ్ధపటలం కావటం సహించలేక ముక్కాలు ముదుసలైనప్పటికి విధి విరామ మెరుగక రాత్రింబవళ్లు గడుపుతున్నారు! అట్టి మహాపురుషుని జన్మదినోత్సవం అక్టోబరు 2 తేదీన జయప్రదంగా జరిపి, ఆనాడు మతకలహ నిర్మూలనకు యువకులు విద్యార్థులు ప్రతినబూనండి.

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్
ఆంధ్ర యువజన ఆర్గనైజింగ్ కమిటీ

నిజాం నిరంకుశత్వం

నిజాం నిరంకుశత్వం - నిర్మూలంబయ్యేదాకా
యెక్కడిదోయ్ - శాంతెక్కడిదోయ్ !
కమ్యూనిస్టూ కాంగ్రేసంతా - చెయ్యీ చెయ్యీ గల్పాయి
చెరియొకదారీ బోకండా - విప్లవరథమే నడ్పాలి
ప్రజలను దేశం నీకిచ్చి - కార్యాక్రమమే జూపించి
నాయకులంతా వెళ్ళారు - నిజాం జైళ్ళ కెళ్ళారు ॥నిజాం॥
ఊరూవూరూ దిర్గాలి - కార్యాక్రమమే పెంచాలి
పల్లేపల్లె లే దిర్గియూ - రైతూబాబుల జమగూర్చి
ఆదేశాలే దెల్పాలి - ఆదర్శంబుకే దించాలోయ్
వీధీవీధీ దిర్గాలి - వీరోచితములే జెయ్యాలి ॥నిజాం॥
పొట్టాకూటికె వారంతా - నిజాం పోలీసులయ్యారు
చదువూసంధ్యలె లేకానూ - పశులచర్యలె జేశారు
ప్రజలనణిచెడి మిల్ట్రీలూ - పట్ణంనుండే వచ్చేరూ
తుపాకికర్రలె బట్టేరూ - తూరీతూరీ గొట్టేరూ ॥నిజాం॥
ముస్లీం గుండాలంతానూ - మూగీమూగీ వచ్చేరూ
కర్రా కత్తే తెచ్చేరూ - గడబిడయెంతో జేసేరూ
కర్రాకత్తీ లాగేసేయ్ - కడ్పాగడ్పా కొసేసెయ్
పిర్కీసందలే గాకుండా - అందారొకటైయుండాలి
పైసాగల్లాబాబూలు - కాందీశీకులె గాకుండా
చెట్టూ పుట్టా బట్టా కా - చేరీ ఒకచోటుండాలి
బీదాబిక్కుల బెంచూతూ - కల్సీమెల్సియుండాలి
కల్లాకపటంలేకండా - గుట్టూగంతా యుండాలి ॥నిజాం॥

యన్. రావు.

బాల ప్రపంచం



రారండోయ్ ★

రావూరి గోవిందాచారి

బాలుల్లారా
బాలికలారా
కుల, మత
మనియెడు
భేదాల్ మాని
హెచ్చు తగ్గులనె
పిచ్చిని వదలి
బాలసంఘములో
చేరుదమోయి—

అల్లరి, చిల్లరి
పనులను మాని
ఆకిరి, పోకిరి
బుద్ధుల్నొదిలి
ఆటలు, పాటలు
అన్నీ నేర్వగ
బాలసంఘములో
చేరుదమోయ్—

భారతమాత
బిడ్డలమూ; మా
కెందున, భేదాల్
లేవని చెప్పుచు
మతకలహాల్లో
మునిగిపోయిన
"అమ్మా, నాన్నా
తాతా, అన్నలు"
ఆశ్చర్యంలో
మునిగేలాగున
హిందూ, ముస్లిం
బాలురందరము
కలతలబాసీ
కలసీ మెలసీ
భాయిభాయిగా
ఉందామోయ్—

పాలకు ఏడ్చే
పాపలు లేనీ
బువ్వకు ఏడ్చే
బాలలు లేనీ,
కట్టు గుడ్డకు
ఉండనిల్లుకు
కొరవేలేని
రాజ్యం కోసం,
చదువు కొనంగా
చక్కని బడులు,
ఆడుకొనుటకు
ఆటస్థలాలు,
గమ్మత్తైన
బొమ్మల బొక్కులు,
కొరవేలేని
రాజ్యం కోసం,
ప్రాణాలను
త్యజియిస్తామంటూ
"కమలాసేన్" వలె
శపధము చేయగ
రా రండోయ్ !
రారండీ !!

స్టాలిన్‌గ్రాడ యువజన వీరుల స్మారకనిధి

ఆంధ్రలో అనేకతావుల్లో ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంలో ఆత్మబలి దానంచేసిన యువకుల స్మారక చిహ్నంగా స్టాలిన్ గ్రాడ్‌లో నిర్మింపబడనున్న కట్టడానికి వలయు సాధన సంపత్తిని సమకూర్చుటకయి "ప్రొఫెసరు మామ్లక్" అను చిత్రరాజాన్ని విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యాన ప్రదర్శించాము సోదరులు అనేకమంది పలువిధముల తమ చేతనయిన విధాన తోడ్పడ్డారు వారందరికీ మాకృతజ్ఞతాభివందనాలు. ఈ విషయంలో బెజవాడ, తెనాలి పట్టణాల్లో హాల్సు ఉచితంగా ఇచ్చిన శ్రీ సరస్వతీ [illegible]రు ప్యాలెస్, రత్నటాకీసు వారికి మా ధన్యవాదాలు, బాపట్ల హాలు వారును ఉదారంగా విరాళాలనిచ్చి తోడ్పడినందులకు మా కృతజ్ఞత

ఈ సందర్భంలో మాకు వచ్చిన జమా ఖర్చుల వివరాలు ఆంధ్ర ప్రజానీకానికి అందించటం మా విధిగా తలంచి మా పత్రికా ముఖాన తెలియజేస్తున్నాం. క్రింద తెలియజేసిన మొత్తాలలో స్థానికంగా ఎక్కడికక్కడ ఖర్చుపెట్టిన మొత్తాన్ని మినహాయించి పంపినవే.

225	13	0	బెజవాడనుండి
306	13	0	తెనాలినుండి
173	13	6	బాపట్లనుండి
136	8	6	గుంటూరునుండి
100	0	0	ఏలూరునుండి
30	8	6	బాపట్ల హాలువారి విరాళం

A I. S F

వారిద్వారా పంపినడబ్బు	675	0	0
ఫిలింకు యిచ్చిన అద్దె	250	0	0
రాష్ట్ర కేంద్రంనుండి పెట్టినఖర్చు (కరపత్రాలు వగైరాలకు)	35	8	0
	960	8	0

973 8 6
960 8 0
13 0 6 ఆఫీసులోయున్న నిల్వ

హిగ్గింబాథమ్సు లో

నవయుగ సెప్టెంబరు సంచిక నుండి యీ క్రింది రైల్వేస్టేషన్సులో "హిగ్గింబాథమ్సు"లో అమ్మబడును,

ఆదోని	గూటి	సామర్లకోట
బళ్ళారి	గుంతకల్లు	తెనాలి
బెజవాడ	గుంటూరు	తిరుపతి
కడప	నెల్లూరు	నిడదవోలు
ఏలూరు	ఒంగోలు	రాయచూర్
గోదావరి	గుడివాడ	రాజమండ్రి



విజ్ఞాన విజయాలు

అకాల మరణాన్ని మానవుడు జయించాడు!

నెగొవిస్కీ అద్భుత పరిశోధనలు

'రావు'

క్రిందటి రెండువ్యాసాల్లోను మనకి రెండు ముఖ్యమైన విషయాలు స్పష్టమయాయి మొదటిది: కుల్యాబ్కో తన పరిశోధనలలో, శరీరం నుంచి వేరుచేసిన గుండెకాయచేత పని చేయించ వచ్చునని రుజువుచేశాడు రెండోది మైఖెలోవిస్కీ, శరీరంనుంచి రక్తం చాల వరకు పోయినాకూడ బైటనుంచి రక్తాన్ని ఎక్కించి ప్రాణంపోయ వచ్చునని రుజువు చేశాడు. అయితే ఇంకో రెండు ప్రశ్నలుదయిస్తాయి, శరీరంలోనుంచి వేరుచేయకుండానే శవంలోని గుండెకాయను తిరిగి పనిచేయించలేమా? ప్రధానమైనది గుండెకాయే గనక, అది తిరిగి పనిచేయడం ఆరంభించి నట్లయితే ఇతర అవయవాలన్నీ పూర్వం మాదిరిగానే తిరిగి పనిచేయవా? అలా చేయించడం ఎట్లాగ?

రక్తాన్ని ఎక్కించడంలో కొత్తపద్ధతి

ఈ విషయాన్నికూడా సోవియట్ శాస్త్రవేత్తలు వదిలి పెట్టలేదు. 1913 లోనే, ఆంద్రీవ్ అనే రష్యన్‌శాస్త్రవేత్త (నేడు సోవియట్‌లో ఒకప్రముఖ సైన్సుప్రొఫెసరుగాపనిచేస్తున్నాడు)చనిపోయిన జంతువు శరీరంలోని రక్త ప్రసారాన్నిపునరుద్ధరించి, గుండెకాయచేతతిరిగి పని చేయించడంలో ఒకకొత్త పద్ధతిని సూచించాడు. గుండె కాయకుపైన కుడిపక్కన వుండే రక్తనాళం (అయోర్టా) గుండా కాకుండా, మెడలో నుంచిపోయే మంచి రక్తనాళం, (కరోటిడ్ ఆర్టరీ) గుండా రక్తాన్ని ఎక్కించడమే ఆపద్ధతి. చెడు రక్తనాళం (వీన్) గుండాకాక గుండెకాయలోనుంచి వూపిరితిత్తులకు శరీరంలోకిపోయే కరోనరీ రక్త ప్రసారాన్ని పునరుద్ధరించడంద్వారానే గుండెకాయను తిరిగి పనిచేయించడం సులభమూ ఉత్తమమూ అని ఆంద్రీవ్‌సిద్ధాంతం దీన్ని రుజువుచేయడానికి ఆయన చాల కుక్కలను తెచ్చి కొన్నిటిని శరీరంలోంచి రక్తాన్ని తోడివేయడం మూలంగాను, మరికొన్నిటిని క్లోరోఫారం, నికోటిన్ మొదలైన విషప్రయోగాలవల్లనూ చంపి మళ్ళీ బ్రతికించాడు.

కాని దురదృష్టవశాత్తూ విప్లవానికిపూర్వం రష్యాలో అందరి శాస్త్రవేత్తలకు పట్టినగతే ఆంద్రీవ్‌కుకూడా పట్టింది. అతని పరిశోధనలకు ఆదరణాలేదు, ప్రోత్సాహమూలేదు. సోవియట్ ప్రభుత్వంవచ్చినతరువాతనే శాస్త్రవేత్తలకవి లభించాయి.

మూడు ముఖ్యమైన విషయాలు

లెనిన్‌గ్రాడ్‌లో పెట్రోవ్ అనే మరొక శాస్త్రవేత్త ఒక్క ఆగిపోయిన గుండెకాయచేతనే తిరిగి పనిచేయించడం మాత్రమే గాకుండా వూపిరితిత్తులు మెదడు వీటినికూడా తిరిగి పనిచేయించే వుపాయంకోసం పరిశోధనలు సాగించాడు ఎలెక్ట్రిక్ షాక్‌వల్ల, విషప్రయోగంవల్ల చచ్చిపోయే జంతువుల మరణావస్థను బహుశ్రద్ధగా పరిశీలించేవాడు. బైటనుంచి గాలికొట్టడంద్వారా వూపిరితిత్తుల చేతను రక్తనాళాల్లోకి అడ్రినలిన్ ఇంజెక్షను ఇవ్వడంద్వారాను మర్దనచేయడంద్వారాను గుండెకాయచేత నరాలను రెచ్చగొట్టడంద్వారా మెదడు చేతను తిరిగి పనిచేయించ వచ్చునని అతని నమ్మకం. ముఖ్యంగా జంతువులు చచ్చిపోయేటప్పుడు అవి తిరిగి బ్రతికింపబడేటప్పుడు నరాలు ఎలా మార్పులు చెందుతాయి అనేది ఎక్కువ శ్రద్ధగా పరిశీలించేవాడు.

పెట్రోవ్ చేసిన పరిశోధనలలో అతనికొక విషయంమాత్రం స్పష్టమైనది. మరణం సంభవించిన (గుండె ఆగిపోవడం, వూపిరితిత్తులు పనిమానివేయడం, నరాలు చైతన్యాన్ని గోలుపోవడం) మొదటి 5 లేక 6 నిమిషాలలో గుండెకాయచేత తిరిగి పని చేయించగలిగితే ఆ జంతువు తిరిగి మామూలుగా బ్రతకడానికి ఎక్కువ అవకాశాలుంటాయి లేంకుటే కష్టం. అతని అనుభవంలో చనిపోయిన 15 లేక 20 నిమిషాల తరువాత గుండెకాయచేత వూపిరితిత్తులచేతపనిచేయించగల్గినా ఆజంతువుమెదడు నరాలు పనిచేసేవికావు. అంటే ఆజంతువు పూరికే బ్రతికివుంటుందిగాని చైతన్యం ఏమీ వుండదు. శవంలాగే పడివుంటుంది గుండెకాయ వూపిరితిత్తులుమాత్రం పనిచేస్తాయి. ఇంక ఆజంతువు బ్రతికిమాత్రం ఏంప్రయోజనం? ఆబ్రతకడమైనా 10 లేక 12 గంటలకంటె ఎక్కువ వుండదని పెట్రోవ్ తేల్చుకున్నాడు, అందుచేత చనిపోయిన జంతువులను (మనుష్యులనుసహా) తిరిగి బ్రతికించడానికి కనిపెట్టిన ఉపాయాలు, సాధనాలు, చనిపోతున్న ఆఖరుగడియల్లోగాని, మరణం సంభవించిన 5, 6, నిమిషాల్లోనేగాని అమలు జరపాలి ఆలస్యమైతే అంత ప్రయోజనం వుండదు.

ఈ పరిశోధనలనన్నిటిని తీసుకొని ఒక్కొక్కదాని వివరాలలోకిపోయి పట్టుదలతో విజయం సాధించిన సోవియట్ శాస్త్రవేత్త నెగోవిస్కీ ఒక్కడేనని చెప్పాలి నెగోవిస్కీ 1936 నుంచి దీనిపై ప్రత్యేక కృషి ప్రారంభించాడు సోవియట్ ప్రభుత్వం ఆయనకు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చి కావలసిన సహాయమంతా చేస్తోంది

తుదినిర్ణయం గుండెకాయదే

ఇంతవరకు మనం చూసిన పరిశోధనలన్నింటిలోనూ గుండెకాయే ప్రధానస్థానం పొందుతోందనితెలుస్తోంది. మరణం ఏవిధంగా సంభవించినా, అంటే, నేరుగా గుండెకాయ దెబ్బతిన్నా, లేక వూపిరితిత్తులు, తల, మూత్రపిండాలు మొదలైన ఇతర ముఖ్యఅవయవాలు దెబ్బతిన్నా, చచ్చిపోవడమనే ఘటన పూర్తి అవడంమాత్రం గుండెకాయ ఆగిపోవడంతోనే జరుగుతుంది. ఏవిధంగానైనా

కావయింది గుండెకా...
షాల్లోశరీరంలోరక్తప్రసారంకట్టుబడిపోతుంది. రక్తప్రసారంస్తంభించిపోవడమంటే శరీరంలో అవయవాలన్నీ పనిచేయడం బందు అయిపోతుంది ఉదాహరణకు నరాలకి కేంద్రమైన మెదడు రక్తంసప్లయిలేకపోతే 5, 6 నిముషాల కంటే ఎక్కువజీవించదు అందుచేత మరణంలో తుదినిర్ణయంగుండెకాయదే

వూపిరితిత్తుల ప్రాముఖ్యం

పోతే గుండెకాయ తరువాత మానవ శరీరంలో ప్రాముఖ్యత వహించేది వూపిరితిత్తులు గుండెకాయ శరీరంలోని అవయవాలన్నిటికీ రక్తాన్ని పంపుచేసి ప్రసరింప జేస్తుంటే, రక్తాన్ని పరిశుభ్ర పరచడానికీ, ఇంకా ఇతర త్రాను దానికి కావలసిన ప్రాణ వాయువును వూపిరితిత్తులు సప్లయి చేస్తూవుంటాయి అను క్షణం మెదడుకు రక్తం, అంటే ప్రాణ వాయువు ,ఆహారంసప్లయి అవుతూవుండాలని లేకుంటే అత్యల్ప కాలంలోనే అది పనిచేయడం మానివేస్తుందనీ పైనచూశాం. అందుచేత రక్తప్రసారం (గుండెకాయ పనిచేయడం) ప్రాణవాయువు సప్లయి (వూపిరితిత్తులు పనిచేయడం) ఈరెండూ అవినాభావసంబంధం గలవి. ప్రాణి జీవించడానికి ముఖ్యమైనవీ తియివున్నాయి కనుక, చనిపోయిన వారిని బ్రతికించడంలో, గుండెకాయచేత తిరిగిపనిచేయించడంతోపాటే కృత్రిమ పద్ధతుల (బైట నుంచి తిత్తులతో గాలికొట్టడం)ద్వారా వూపిరితిత్తులనుకూడా తిరిగి పనిచేసేటట్లు చేయడమనేది చాలముఖ్యం. ఈ రెండు పనులూ ఒకసారే చేయడంవల్ల చనిపోయిన వారిని తిరిగి బ్రతికించడమనే పని చాలా సులువు అవడమేగాకుండా ఎక్కువ గ్యారంటీకూడా వుంటుంది. 250 ప్రయోగాలు చేసి చూసిన తరువాత నెగోవిస్కీ వచ్చిన నిర్ణయం ఇదే. ఈసూత్రమే నెగోవిస్కీకి విజయాన్ని చేకూర్చి పెట్టింది.

నెగోవిస్కీ కనిపెట్టిన కొత్త పద్ధతి

ఆగిపోయిన గుండెకాయను తిరిగి పని చేయించడానికి దానిలోకి బైటనుంచి రక్తాన్ని ఎక్కించడంలోకూడా నెగోవిస్కీ ఉత్తమమైన ఒక కొత్తపద్ధతినికనిపెట్టాడు ఆంద్రీవ్ సూచించిన విధంగా మంచి రక్తనాళంగుండా గుండెకాయకు రక్తం ఎక్కించడంవల్ల అది పని చేయడానికి లాభించేమాట నిజమేగాని ఇది ఆరంభంలో గుండెకాయతిరిగి స్పందించడానికి మాత్రమే ఉపయోగకారియైన పద్ధతి. ఎక్కువ ...వు ... మంచి రక్తనాళంగుండా రక్తంఎక్కిస్తే అదికొంత చెడుఫలితాన్ని ఇవ్వవచ్చునని నెగోవిస్కీ వాదం ఆ పద్ధతి ఎక్కువసేపు అమలుపరిస్తే తిరిగి కొట్టుకోడం మొదలుపెట్టే గుండెకాయ తన స్వశక్తిని పెంపొందించుకోడంలో కొంతదెబ్బతింటుంది. తన పరిశోధనలలో నెగోవిస్కీ దీనిని స్పష్టంగా గమనించాడు ఈ లోపం లేకుండా చేయడానికి అతడు కనిపెట్టిన కొత్తపద్ధతిఇది. మంచి రక్తనాళం (కారొనరీ ఆర్టరీ)గుండా రక్తం ఎక్కించి గుండెకాయ బాగాపనిచేయడం మొదలుపెట్టిన తరువాత,చెడురక్తనాళాలు(వీన్సు)గుండాకూడా రక్తాన్ని ఎక్కించడం సాగించాలి. కాని ఈ ఎక్కించడం ఎక్కువ ఒత్తిడి లేకుండా మెల్లిగా జాగ్రత్తగా చేయాలి ఈ పద్ధతివల్ల గుండెకాయ కుడిభాగంలోకి ఎక్కువ రక్తం సప్లయి కావడమేగాక రక్త ప్రసారం జోరుగా సాగడానికి గుండెకాయ బాగా కొట్టుకోడానికి కూడా తోడ్పడుతుంది

ఈ విధంగా రెండు (మంచి—చెడు) రక్తనాళాలగుండా రక్తాన్ని ఎక్కించడంతో పాటుగానే కృత్రిమపద్ధతివల్ల వూపిరితిత్తులచేత కూడ పనిచేయించడం మొదలుపెట్టాలి. ఇదే నెగోవిస్కీ కనిపెట్టిన విజయవంతమైన విధానంలోని ప్రధాన సూత్రం.

అమూల్యమైన ఆరునిముషాలు

దీనితోపాటు పైనచెప్పినట్లు ఇంకో ముఖ్యమైన విషయం ఏమంటే రెండుపనులూ ప్రాణంపోయే ఆఖరుఘడియల్లోగాని, ప్రాణం పోయిన 5 6 నిమిషాల్లోగాని జరగాలి. 7 వ నిముషం ప్రవేశించిందంటే మెదడులోనికణాలు —అంటే చైతన్యానికి ప్రధానమైన నరాల కేంద్రంలోని కణాలు—క్రమక్రమంగా చచ్చిపోవడం మొదలుపెడతాయి

ఆతరువాత వాటిని బ్రతికించడం కష్టతరమైన పని అందుచేత ఈ జాగ్రత్త తీసుకోడం ఎంతో అవసరం.

మనకు కనిపించేవన్నీ మరణాలుకావు

మరణాన్ని గురించి నెగోవిస్కీ తెలుసుకున్న మరికొన్ని రహస్యాలుకూడా వున్నాయి. మనంచూచే అకాలమరణాలన్నీ నిజంగా మరణాలు కావనీ, ప్రాణం ఏమూలో ఒకమూల దాగివుంటుదనీ దాన్ని కనిపెట్టి పైకిలాగవచ్చునని నెగోవిస్కీ నమ్మకం. ఈ విషయంలో ప్రకృతి మనకు చాలవరకు సహాయపడుతుందని కూడా ఆయన విశ్వాసం. ఉదాహరణకు ...న్న ధాన్యాలు చూడండి పది, పదిహేను సంవత్సరాలు పడివున్నాకూడా, నాటినప్పుడు మొలకలెత్తే శక్తికలిగిన ధాన్యాలున్నాయి, అలాగే మానవ శరీరంలోకూడా ప్రాణాన్ని మొలకెత్తించే ధాతువులు దాగివుంటాయి.


ప్రొఫెసర్ లుకెయినోవ్ అంచనా ప్రకారం మానవ శరీరంలో ప్రతి సెకనుకి 125 లక్షల జీవకణాలు చచ్చిపోతూను మళ్ళీ అన్ని కొత్త కణాలు ఉద్భవింపచేస్తూను వుంటాయి. రక్తకణాల్లోకూడా సవత్సరానికి ఆరుసార్లు ఇది జరుగుతుంది అందుచేత చచ్చిపోయే జీవకణాలస్థానే కొత్తవాటిని మొలకలెత్తించే శక్తి మన శరీరానికుంది, కాని ఈ జీవకణాల జీవిత పరిమాణం వాటిని ఉద్భవింపజేసే టిస్యూ (ధాతువు)ల శక్తిమీద ఆధారపడి వుంటుంది. కాలక్రమేణా ఈ టిష్యూలశక్తి సన్నగిల్లిపోతూవుంటుందిఅదేవృద్ధాప్యంరావడమన్నమాట సాధారణంగా దీనికి 90 లేక 100 సంవత్సరాలు పడుతుంది. దీనిని గమనించితే, మానవునికి అకాల మరణాలు సహజంగా టిష్యూల వృద్ధాప్యంవల్ల వచ్చేవి కావనీ, జీవకణాలను పునరుద్ధరింప గలిగిన శక్తి శరీరంలోని టిష్యూలకు ఇంకా వుంటుందనీ స్పష్టమవుతుంది గుండెకాయ ఆగిపోయినా, రక్తప్రసారం ఆగిపోయినా టిష్యూలలోవుండే ఈ శక్తి నాధారం చేసుకొని శరీరంలో తిరిగి ప్రాణాన్ని మొలకెత్తించవచ్చు

దీనికితోడు ఇంకో రహస్యాన్ని కూడా నెగోవిస్కీ తన పరిశోధనలలో తెలుసుకున్నాడు. మంచుకోగాని, మామూలుకంటె చల్లని వాతావరణంలోగాని వుంటే, ఈటిష్యూలలో జీవశక్తి ఇంకా ఎక్కువకాలం నిలవ వుంటుంది.

మానవుడు మరణాన్ని జయించాడు

ఇవే నెగోవిస్కీకి ధైర్యాన్ని విజయంలో విశ్వాసాన్ని కలిగించిన సూత్రాలు. ఆ విశ్వాసంతోనే యుద్ధం వచ్చీ రాగానే నాజీ నరహంతకులచే యుద్ధరంగంలో చంపబడే సోవియట్ వీరులను ఎంతమందిని వీలైతే అంతమందినీ బ్రతికించాలనే దీక్షతో ఆయన తన సహచరులతో యుద్ధరంగాని కురికాడు, సోవియట్ దేశభక్తులు యుద్ధరంగంలో ప్రపంచ నాగరికతకే శత్రువైన నాజీలతో పోరాటం సాగిస్తూవుంటే వారి వెనుకనే వుంటూ మానవ జన్మకే పెద్ద శత్రువైన

(మిగతా 24 వ పేజీలో)



"పట్టభద్రుల పాఠ్యపుస్తకములు"

ఇంటరు పరీక్షకు భారతమునుండి సుమారు 250 పద్యములు, మధ్యకాలపుకవుల గ్రంథముల నుండి కొంతభాగమును పాఠములుగా నిర్ణయింపబడుతున్నాయి.

ఇవి 18 పర్వములుగల భారతములోని. ఒకపర్వములో ఒకటిరెండు ఆశ్వాసములలోని పద్యములు, దీనికోసం ఆ గ్రంథాన్నంతటిని విద్యార్థులు కొనుక్కోలేరు. అలాగే మధ్యకాలపు కవియొక్క గ్రంథాన్నంతటిని కొనుక్కోవడం సంభవించదు. ఈ అదునుకనిపెట్టి పుస్తకాల వర్తకులు "నోట్సు" అని పేరుపెట్టి కొంత వ్యాఖ్యానంరాసి, పాఠ్యభాగాలని చాలా ధరపెంచి అమ్ముతున్నారు. అసలు గ్రంథాలు కొనుక్కోవడం ఇంతకన్న హెచ్చుఖరీదు అవడంచేత ఈనోట్సే విద్యార్థులు విధిలేక కొనుక్కొంటున్నారు.

ఇలా విద్యార్థులను పుస్తకాల వర్తకుల పాలు గావించడం విశ్వవిద్యాలయానికి ఉచితమైన పనికాదు. పాఠ్యభాగాలను తానే ప్రత్యేకించి ముద్రించి విద్యార్థులకు ఒకరూపాయి విలువతో గ్రంథమూలములను అందింపవచ్చును. ఇప్పుడు విద్యార్థి సుమారు మూడు రూపాయలు ఖర్చుచేయుచున్నాడు. ఒక్కొక విద్యార్థి సుమారు రెండురూపాయిలు చొప్పున ఆంధ్రవిద్యార్థులందరు పుస్తకాల వర్తకులకు శాశ్వతంగా పన్ను చెల్లించడం జరుగుతూంది అన్నమాట. ఆరువేలవిద్యార్థులు కాలేజీలలోచదివితే 12000 రూపాయలు వాళ్ళకి సాలీనాపన్ను కట్టడం జరుగుతూంది. ఇట్లు విద్యార్థి ఆర్థికంగా పుస్తకాల వర్తకుల పాలబడిక్షీణించుచున్నాడు. అందుచేత విశ్వవిద్యాలయంవారు పాఠ్యభాగములను ప్రత్యేకంగా అచ్చువేయించి విద్యార్థులకు చౌక ధరలో అందించి, పుస్తకాల వర్తకుల బారినుండి విద్యార్థులను కాపాడాలని విశ్వవిద్యాలయంవారిని కోరుచున్నాను.

జె. వి. రామనారాయణ

ఆర్గనైజరు.

పట్టణ విద్యార్థిసంఘం విజయనగరం.

తిరువూరుస్కూలులో ఉపాధ్యాయుల కొరత

తిరువూరు బోర్డు హైస్కూలులో రెండునెలల నుంచి యిద్దరు ప్రధాన L. T. లు లేరు. ఇంతవరకు పాఠాలు యేమీ జరుగుటలేదు. 31—8—47 న కృష్ణాజిల్లా డి. యి. ఒ. గారు తిరువూరు వచ్చినప్పుడు విద్యార్థులు వెళ్ళి, ఉపాధ్యాయులను వెంటనే వేయాలని, వెంటనే ఉపాధ్యాయులు రాకపోతే విద్యార్థులు సర్టిఫికెట్లు పుచ్చుకొని వెళ్ళుటకు ప్రయత్నాలు జరుపుతున్నారని చెప్పినారు వారు జిల్లాబోర్డు స్పెషల్ ఆఫీసరుగారితో చెప్పుతాననియు, చాలా అవసరం గనుక వెంటనే వేయమనియు స్వయంగా వచ్చి రికమండు చేస్తానని" విద్యార్థులకు వాగ్దానమిచ్చారు. తలిదండ్రుల సంఘం తరపున టీచర్సును వెంటనే వేయాలని ఒక మెమోరాండం యిచ్చారు. శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తానని చెప్పారు. విద్యాశాఖాధికారులు, బోర్డు అధికారులు తమ వాగ్దానము ప్రకారం వెంటనే ఉపాధ్యాయులను నియమించి విద్యాభివృద్ధికి తోడ్పడతారని ఆశించుతాం.

—కొల్లా నరసింహారావు,
(కార్యదర్శి, తిరువూరు విద్యార్థిఫెడరేషన్)

భీమవరం కాలేజీలోని విద్యార్థుల స్థితిగతులు

భీమవరం కాలేజీ జూను ఆఖరు వారంలో తెరిచారు. విద్యార్థులు ఇళ్ళనుండిరాగానే గత సంవత్సరం యీ కాలేజీలో వచ్చిన పరీక్ష ఫలితాలను చెప్పి ఆ బాధ్యత విద్యార్థులదేననియు, తమ కర్తవ్యం తాము నెరవేర్చామనియు యీ సంవత్సరం వారంవారం పరీక్షలు పెట్టి వాటిలో వచ్చిన సరాసరి మార్కులతో పబ్లిక్ పరీక్షకు పంపెడిదీ లేనిదీ నిర్ణయించెదరనియు పరీక్షలకు పోవాలనుకుంటే అది విద్యార్థి మీదనే ఆధారపడి ఉంటుందని క్లాసుల్లో 'గంభీరోపన్యాసాలు యిచ్చారు.

కాని రేపు 8 వ తారీఖున క్వార్టర్లీ పరీక్షలు జరగబోతున్నా ఇంతవరకు ఇంటరు సీనియరు విద్యార్థులకు సరిగ్గా పాఠాలు జరగటంలేదు, వారంవారం పరీక్షలు అసలేలేవు. ఈకాలేజీలో ఇదివరకు ఇంగ్లీషు అసిస్టెంటు లెక్చరరుగా పని చేసే ఆయన ఇంకొక కాలేజీలో పని చూసుకొన్నాడు. అయినసూ ఇంకొక లెక్చరరును నియమించక కాలక్షేపం కానిస్తున్నారు, యింటరు జూనియరులోని మూడు డివిజనులు సీనియరు రెండు డివిజనులు ఒక్క లెక్చరరు గారే చూచుకోవలసి వస్తూంది. ప్రిన్సిపాలు గారు కూడా అదనపు క్లాసులు తీసికున్నా పని చురుకుగా సాగటంలేదు.


కాలేజి తెరచి రెండునెలలు పైగా అయినా, సీనియరు విద్యార్థులకు ఇంతవరకు యింగ్లీషులో సీనియరు పుస్తకాలు మొదలు పెట్టలేదు, గత సంవత్సరంనుంచి చెపుతున్నా ప్రిన్సిపాలుగారు 'లల్లీగ్రో' అను యింగ్లీషు పొయిట్రీలోని ఒకభాగాన్ని పూర్తి చెయ్యలేకపోయినారు. ఆయన యింకా యీ సంవత్సరం యింగ్లీషు డ్రామా చెప్పవలసి ఉంది.

ఇతర కాలేజీలతో పోల్చిచూసిన యీ కాలేజీలో చాలా తక్కువ కోర్సులు అయినాయి. గత సంవత్సరంకూడా ఇదే విధంగా జరగటంవలన మన పరీక్ష ఫలితాలు తక్కువగా వచ్చాయి. అందుకు విద్యార్థులను నిందించి ఫలితములేదు. అందుకని ఈసంవత్సరం ముందుగానే మేలుకుని క్రొత్త లెక్చరరును నియమించి కోర్సులు త్వరత్వరగా జరుగునట్లు చూస్తారని తలుస్తున్నాను.

టి. వి. యస్. శర్మ

భీమవరం 5—9—47 } కౌన్సిలు మెంబరు ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్

ప్రజాజీవితచిత్రాలు



ఫొటో కొండేపూడి శ్రీనివాసరావు



పట్టెడన్నంకు దినమెల్ల కట్టెలు కొట్టుకొని సంపాదించుకొనే
కష్ట జీవులు

ఫొటో కె. తిరుమలకొండయ్య

'ప్రజాజీవిత చిత్రాల'లో ప్రకటించగోరు చిత్రముల నెగిటివ్‌లుగూడ పంపాలి. నెగిటివులు తిరిగి కోరువారు అణాన్నర స్టాంపును పంపాలి.

—సంపాదకుడు

నవయుగ విరాళాల పట్టిక

క్రితంసంచికలో ప్రకటించిన మొత్తం	1805-14-9
జగన్నాధరెడ్డిగారిద్వారా పునాదిపాడు విద్యార్థిసంఘం	21- 0-0
పెద్ది నరశింహారావుగారు తాడికొండ	10- 0-0
వుప్పల గోపాలరావుగారివివాహ సందర్భమున	5- 0-0
పశ్చిమగోదావరిజిల్లా విద్యార్థి సంఘం	3-12-0
మొవ్వా వెంకట కృష్ణారావుగారు	3- 6-0
దొండపాడు యువజన సంఘం	2- 0-0
పొన్నెకల్లు విద్యార్థులు	3- 3-6
జి రంగప్ప అనంతపూరు	0- 4-0
మొత్తం	1854- 8-3

విజ్ఞప్తి

క్రితం నెల సర్క్యులరు పంపాం, బాకీలు ఏజెన్సీడిపాజిట్లు వెంటనేపంపవలసిందిగా కోరాం. కాని సకాలంలో పంపుటకు 40 మంది ఏజెంట్లు విఫలులయ్యారు. తరువాత 20మంది పంపించారు. మొదట 40 మందికి కాపీలుపంపుట మానివేశాం. ఈ పద్ధతి ఏజెంటు కామ్రేడ్స్‌కు బాధగల్గించింది. కాని చేయగలిగిందేమీలేదు. మిగతా 20 మంది యింతవరకు డబ్బుపంపలేదు సరిగదా, ఇచ్చిన ఆర్డరునుగురించి బాధపడ్డట్లుగూడ కనుపించటంలేదు. వారిపేర్లు దిగువ నుదహరించుచున్నాం

బాకీపడినఏజంట్లు: పెదపాలెం, తణుకు, అత్తిలి, అమలాపురం, కాకినాడ. మనుపురం, జగ్గన్నపేట, కర్నూలు, పండికొట్కూరు, వైజాగ్, దోర్నకల్, తురిమిల్ల, పెదవడ్లపూడి, పొన్నెకల్లు, ఒంగోలు; నెల్లూరు, కొల్లూరు (యిప్పుడు ఏజెన్సీమారింది) హైదరాబాదు.

—మేనేజరు

(5 వ పేజీ తరువాయి)

కూడా అందకుండా పోతాయి. రాయలసీమ, విశాఖ మున్నగు తరుగు ప్రాంతాల ప్రజలు తమకు కావలసిన ధాన్యమంతా దొంగ మార్కెటు ధరలకు కొనుక్కోవలసి వస్తుంది. ధనిక భూస్వాములు మిల్లు యజమానులు, అంతూపొంతులేని దొంగ ధరలను గుంజుతారు. ప్రభుత్వానికి కంట్రోలుధరలకు ధాన్యం దొరకడం పూర్తిగా అసంభవమైపోతుంది. అందువల్ల పట్టణాల రేషనింగు కూడా విఫలమవుతుంది, ఆవిధంగా కంట్రోలు, రేషనింగు పూర్తిగా ఎగిరిపోతాయి. ప్రజా సామాన్యం కరువురాకాసి కౌగిలిలో చిక్కుతుంది. మిగులు ప్రాంతాల రేషనింగు తీసివేసినా సరే ఇలాగే జరుగుతుంది.

ఇక జీవితావసర వస్తువుల ధరలతోబాటు ధాన్యం ధరలు పెంచితే జరిగేదేమిటి ? ధాన్యం ధరలు పెరిగేకొద్దీ ఇతర వస్తువులధరలు ఇంకా పెరుగుతాయి. ఆవిధంగా ఒకదానిపైన ఇంకొకటి స్పైరల్‌గా పెరుగుతూ పోతే మన ప్రజలకు సర్వనాశనం తప్పదు. భూస్వాములు మిరాశీదార్లు పెట్టుబడిదారీ గుత్త వ్యాపార ముఠాలు మేటలు వేయడం-అంతులేని ధరలు చెల్లించలేక ప్రజలు కూటికి గుడ్డకు మొఖంవాచి నశించడం తప్పదు,

అందుచేత ధాన్యానికి న్యాయమైన ధరలు నిర్ణయించాలని. ఆ ధరల కనుగుణ్యంగా జీవితావసర వస్తువుల వ్యవసాయ పనిముట్ల ధరలు తగ్గించి కంట్రోలు చేయాలని ప్రజలు ప్రజా సేవకులు తీవ్రంగా ఆందోళన చేయాలి. జీవితావసర వస్తువుల వ్యవసాయ వస్తువుల పంపకపు బాధ్యతను ప్రభుత్వమే వహించాలని కోరాలి. ధాన్యసేకరణ బాధ్యతను మిల్లు యజమానుల నుండి తప్పించి సహకార సంఘాలకు ఆహార కమిటీలకు యివ్వాలని కోరాలి. లంచగొండి ఉద్యోగులను దొంగ వ్యాపారులను కఠినంగా శిక్షించాలని భూస్వాముల వద్ద మిల్లర్లవద్ద నున్న ధాన్యాన్నంత ప్రభుత్వం ప్రజల సహకారంతో స్వాధీనం చేసుకోవాలని ఆందోళన చేయాలి. రాష్ట్రమందన్ని ప్రాంతాలలోను కంట్రోలును రేషనింగును ఖచ్చితంగా అమలు జరుపాలని డిమాండు చేయాలి. ఇదొక్కటే మన ఆహార సమస్యను పరిష్కరించే మార్గం. మన జాతీయ ఆర్థికవిధానంలో పెట్టుబడి దారీ ముఠాల ప్రాబల్యమేర్పడకుండా చేయగలిగే మార్గం. మన ప్రజలను కరువు కాటకాల బారినుండి రక్షించుకొనుటకు సోపానం.

(21 వ పేజీ తరువాయి)

అకాలమరణంతో నెగోవిస్కీ పోరాటం సాగించాడు. ఆ యుద్ధరంగంలో సోవియట్ వీరులు జయంపొందారు. ఈ యుద్ధరంగంలో నెగోవిస్కీ కూడా విజయం సాధించాడు. ఈవిజయ చిహ్నమే ఆగస్టు ప్రత్యేక సంచికలో మీరు చూచిన చెరిపనోవ్ పునర్జన్మ. ఒక్క చెరిపనోవ్ నే గాకుండా యుద్ధరంగంలో గాయాలవల్ల మరణించిన మరొక 12 మందిని నెగోవిస్కీ తన సూత్రాన్ని అమలు జరపడంద్వారా బ్రతికించాడు. ఇంకో 37 మందికికూడా తిరిగి ప్రాణం పోయగలిగాడుగాని వారు యెక్కువ కాలం బ్రతకలేకపోయారు. నూటికి నూరు అకాలమరణాలవాతబడిన వారిని తిరిగి బ్రతికించాలనే పట్టుదలతో నెగోవిస్కీ ఇంకా పరిశోధనలు సాగిస్తూనే వున్నాడు. సోవియట్‌లో ఈ ఆశయం నెరవేరడానికి ఎంతకాలం పట్టినా ఒకటిమాత్రం రుజువైంది. విజ్ఞానం విజయం పొందింది. మానవుడు మరణాన్ని జయించాడు.

'నవయుగ'
చందా వివరాలు

సంవత్సర చందా	3—0—0
½ సంవత్సర చందా	1—8—0
విడి ప్రతి	0—4—0

విద్యార్థి ఉద్యమంపై

సి. ఆర్. రెడ్డిదాడి

ఆంధ్రదేశంలో అంతటా ఉజ్వలంగా పెరుగుతూన్న ఐక్య విద్యార్థి ఉద్యమం - ముఖ్యంగా విశ్వవిద్యాలయంలో ఈ సంవత్సర ప్రారంభం నుంచీ - అంటే శ్రీ లింగారెడ్డి నిరసనవ్రతం ప్రారంభించడం-విద్యార్థులు ఐక్యాందోళనతో సిండికేటును లొంగదీయడం విశ్వవిద్యాలయాధికారులకీ-ముఖ్యంగా సి. ఆర్. రెడ్డికీ కన్నెర్రగా వుంది. గతనెల సిండికేట్ హాల్‌లో బందరు ప్రిన్సిపాల్‌ను ఎవరో విద్యార్థులు ఉద్రేకంతో కొట్టారనే సాకుతో విద్యార్థులమీద పగ సాధించుకోవడానికి అదను దొరికిందనుకున్నాడు. మద్రాసు ప్రభుత్వంకూడా విద్యార్థులమీద శిక్షణచర్య తీసుకోవలని అధికారులకి తాఖీదు పంపిందట. దానిమీద స్టూడెంట్స్ ఫెడరేషన్, కాంగ్రెసు విద్యార్థులను కొంత మందిని పిలిపించి విచారణచేశారు,

విద్యార్థులను కాలేజినుంచి బహిష్కరిద్దామని రెడ్డి ఎంతో ప్రయత్నం చేశాడు. కాని ఐక్య విద్యార్థి ఉద్యమానికి భయపడి ప్రముఖ విద్యార్థి వర్కర్లను పదిమందిని హాస్టల్‌నుంచి బహిష్కరించాడు. అలా చేసినట్లయితే హాస్టల్‌లో విద్యార్థి ఉద్యమాన్ని అణిచివెయ్యగలనని ఊహించాడు.

పైగా, ఈ సంవత్సరం విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్పులూ, స్టూడెంట్ షిప్పులూ రద్దుపరుస్తూ విద్యార్థులలో పూర్తినిరుత్సాహం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు.

అయితే విద్యార్థులు అధికార్ల కుట్రలను గ్రహించగలిగారు. కార్యాచరణసమితి నాయకత్వాన సక్రమపద్ధతులలో ఆందోళనచేసి తమ మిత్రులను తిరిగి హాస్టల్‌లో చేర్చుకోవాలనీ, తిరిగి స్కాలర్‌షిప్పులు వెంటనే ఇవ్వాలనీ ఆందోళన సాగిస్తున్నారు.

విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఈ న్యాయమైన హక్కులకొరకు పోరాటాన్ని ఆంధ్ర విద్యార్థులంతా బలపరుస్తారని ఆశిస్తున్నాం.

ఇట్లు,

—టి. లక్ష్మీనరసింహారావు,

Printed and Edited by A. K. R. B. Koteswara Rao at Prajasakti Press, Mogalrajapuram, Bezwada.
Published by K. Advita Parabrahma Sastri, B. A. from Navayuga office, Main Road, Kottapeta, Guntur.

నడుము) కదులుటవలన అన్ని అవయవాలకు సమానముగా తగిన పరిశ్రమ ఇచ్చుట జరుగుచున్నది. ఈవిధంగా యువకులు శారీరకంగా అభివృద్ధి అగుటయే గాక, ఎలా పట్టుకోవాలో, ఎలా తప్పుకోవాలో అనేవి త్వరత్వరగా ఆలోచించి నిర్ణయాలు తీసుకొని క్రియా రూపంలో పెట్టవలసి వస్తుంది. కాబట్టి మానసికంగా అభివృద్ధి, మంద కొండితనముపోయి చురుకుదనము అలవడుతుంది. ఆటఆడే ప్రతివాడూ ఉత్సాహముగా ఉంటాడు

అమెరికాలో బేస్‌బాల్, ఇంగ్లండులో క్రికెట్టు ఎలా జాతీయ క్రీడలో, ఆంధ్రలో చెడుగుడు జాతీయ క్రీడగా అభివృద్ధి చెందుచున్నది. అభివృద్ధి చెందుటకు ఇంకా చాల అవకాశా లున్నవి.

ఆటలు : జాతీయోద్యమం

స్వాతంత్ర్య పోరాటంలో 60 సం॥ల జాతీయోద్యమం మనవెనుక ఉన్నప్పటికీ యువకులను శారీరకంగా అభివృద్ధి పరచుటకు ఏవోకొన్ని ఆసనాలు, సూర్య నమస్కారాలు తప్ప ఆటల విషయంలో పూర్తిగా అశ్రద్ధచేసింది, ఇలా చేయటం మనజాతీయోద్యమానికేదెబ్బ ఆటల కార్యక్రమం మన జాతీయోద్యమంలో ఒకభాగంగా ఉండాలి, జకోస్లవేకియా యుగోస్లావియా మొదలగు దేశాలలోని ప్రజా ప్రభుత్వాలు ఆయా దేశాలలో ఆటలను అభివృద్ధి చేయుటకు ప్రత్యేక శ్రద్ధ వహించు చున్నవి. కాబట్టి కాంగ్రెసు ప్రభుత్వం ఆటల అభివృద్ధికి అవకాశాలు కల్గించాలి ప్రతి జిల్లాలోను ఆటలను అభివృద్ధి చేయుటకు గాను ఏర్పడినరూరల్ రిక్రియేషన్ ఆఫీసర్లమీద సరియైన అజమాయిషీ ఉంచుతూ వారి సిబ్బందిని ఎక్కువ చేసి, వారు ఆటల అభివృద్ధికి ఎక్కువ తోడ్పడునట్లు చేయాలి ప్రతి గ్రామంలోను ప్రభుత్వం ఆటవస్తువులను సప్లయి చేసి, ఆటలకు శాశ్వతంగా ఉండేటట్టు ఆటస్థలములను గ్రామ ఉమ్మడి ఆస్థిగా ఉండేటట్టుచేయాలి,

ఆటలు : పత్రికలు

సాధారణంగా పత్రికలు క్రికెట్టు, ఫుట్‌బాల్, గుర్రపు పందెములను సమీక్షచేస్తూ ఉంటవి ఆంధ్రుల జాతీయ క్రీడయైన చెడుగుడును కనీసం తెలుగు పత్రికలైనా సమీక్ష చేయటం జరుగుట లేదు

కాబట్టి తెలుగు పత్రికలైనా చెడుగుడును ఆంధ్రుల జాతీయ క్రీడగా గుర్తించి, ప్రముఖ ఆటగాండ్రతో ఇంటర్వ్యూలు జరిపి ఆటను సమీక్షచేస్తూ తగిన ప్రచారాని కవకాశాలు కల్గించి ప్రోత్సహించాలని కోరుచున్నాను

నవయుగోదయం

నవయుగోదయం
నవనవోజ్వలం
తరుణమిదే చూపుమ నీ
త్యాగ బలమ్ము ॥ నవ ॥

యుగయుగాల దాస్యం-మన
పగతుర ప్రాబల్యం
ధ్వంసము చేయా లిది నీ
వంతు లెమ్ము రా ॥ నవ ॥

జాతి మత ద్వేషం-అదె
జరుగు రక్తపాతం
ఆ దవాగ్ని శిఖల నార్పి
ఆర్తి తీర్చరా ॥ నవ ॥

ధనికుల దుర్దాహం-పె
ద్దన్నల దౌర్బల్యం
రూపుమాపి నీశక్తిని
చూపవేమిరా ॥ నవ ॥

లేదు రంగుభేదం-ఇది
లేనిపోనిమౌఢ్యం
ప్రపంచరక్త పిపాసులను
పట్టిచీల్చరా ॥ నవ ॥

శాంతి అభ్యుదయం-స్వా
తంత్ర్యం నీధ్యేయం
నెల-కొల్పి దేశమందు పేరు
నిల్పు యువకుడా ॥ నవ ॥

— సుంకర సత్యనారాయణ

కృష్ణాజిల్లా యువజన మహాసభ

యువజనోద్యమంలో

మార్చి 17 నుండి 20వ తేదీవరకు చిన వోగిరాల గ్రామం, యువకుల ఆటలపోటీలతో, వైజ్ఞానిక ప్రదర్శనాలతో తండోప తండాలుగా తరలివచ్చే ప్రజా సమూహంతో ఒక యాత్రా స్థలమయింది ఒక ప్రక్కన ప్రజా పౌరసత్వహక్కులను భక్షించే ఉక్కుచట్టం; మరొక ప్రక్క 50 వేలమంది ప్రజల సమీకరణ. ఏ సందర్భంలో ఇది సాధ్యపడింది? దాని సత్వంలో క్రుంగిపోతూ వక్ర మార్గాల్లో సంచరిస్తూ తమ యువశక్తిని దుర్వినియోగ పరిచే యువకులను సక్రమ మార్గాల్లో ప్రవేశపెట్టి, నవయుగ నిర్మాతలుగా, స్వాతంత్ర్య వీరులుగా తయారు చేస్తున్న కృష్ణాజిల్లా యువజన మహాసభ అది! కుల—గ్రామ కక్షలకు స్వస్తిజెప్పి అభ్యుదయం వైపు పురోగమించే యువకుల మహాసభ అది! నిరక్షరాస్యతను నిర్మూలింప కంకణం కట్టుకున్న యువకుల మహాసభ అది 12 సంవత్సరాలుగా కృషిజేస్తూ యువకులను నిర్మాణాత్మకంగా అభివృద్ధిచేస్తున్న కృష్ణాజిల్లా యువజన సంఘం పిలుపు నిచ్చింది ప్రజలందుకున్నారు. ప్రపంచ యువక ప్రతినిధుల ముందు తమశక్తిని చాటిచూపారు,

ఉడుకు లెత్తే నెత్తురూ, ఉరకలు తీసే శక్తీ

మూడురోజులుగా జరిగిన ఆటల పోటీలలో జిల్లాలోని మారు మూలలనుండీ వచ్చిన ఆటకాండ్రంతా పాల్గొన్నారు. ఇంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగని ఉత్సాహం వెల్లివిరిసింది యువకులలో ఆటల పోటీలలో ఒక నూతనశకం ప్రారంభమయ్యింది. చెడుగుడు ఆంధ్రజాతీయ ఆట అయినప్పటికీ ఇంతకుపూర్వం కొన్ని సంకుచిత సరిహద్దులలో ఆడబడేది. వ్యాపారదృష్టితో చెడుగుడు పోటీలు పెట్టబడేవి. కొద్దిమంది మధ్యతరగతి యువకులు మాత్రం ఆడుతుండేవారు నేటికి జిల్లా యువజనసంఘ కృషి ఫలితంగా చెడుగ్గుడు నిజమైన ఆంధ్రజాతీయ ఆటగా అభివృద్ధి చెందింది. ఈ ఆటను చూసిన ప్రపంచ యువజన ప్రతినిధు లెంతో మెచ్చుకున్నారు ఈ ఆటపైన జీన్‌లూటిషియన్ (ఫ్రెంచి ప్రతినిధి) ఇలా అభిప్రాయం చెప్పారు. "ఈఆటలోని సమష్టి తత్వం, నిపుణత్వం, చురుకుదనం ఎంతో మెచ్చదగినవి. యువకులు ముఖ్యంగా ఇటువంటిఆటలనే అభివృద్ధిచేయాలి" నేడీఆట జిల్లాలోని వ్యవసాయ కూలీ పల్లెలలోసైతం ఆడుతున్నారంటే అదే, అన్నివర్గాలయువకులూ శారీరకాభివృద్ధికి ఎంత ముందడుగు వేస్తున్నారో తెలియజేస్తుంది.

ఆటల పోటీలలో జనరల్ స్పోర్ట్సును ప్రత్యేకంగా పేర్కొనాలి. ఇంతకుముందు వీటిల్లో విద్యార్థులు పాల్గొన్నట్లుగా యువకులు పాల్గొనేవారుకాదు. మరి నేడో? చిట్టి బసవయ్యగారిలాంటి కాయకష్టం చేసే పల్లెటూరి యువకులు, కాలేజీలలో నిత్యం ఆటలలో పాల్గొనే విద్యార్థులనుసైతం మించిపోయారంటే, మాటున పడియుండే యువకులకు ఉత్సాహమిస్తే ఎంత అభివృద్ధి కాగలరో అర్ధమౌతుంది. మైలుపరుగులో మామూలు ప్రకారం అంతా మొదట కొన్ని వరసలు చుట్టివచ్చేవరకూ నెమ్మదిగా వెళ్ళి అక్కడనుంచీ క్రమేణా పరుగు హెచ్చించటం మొదలుపెట్టారు కాని రజకసోదరుడు పోలుమెట్ల రాఘవులుగారు ఒకే బిగువున 8 చుట్టులూ తిరిగిరావడం ప్రేక్షకులను విస్మయుల్నిజేసింది. మోకు లాగటంలో మధ్యతరగతి ప్రజలు ఎంతో ఆసక్తి చూపెట్టారు మొత్తంమీద జనరల్ స్పోర్ట్సుకి ఈ సంవత్సరం ఇంతకుముందెప్పుడూ రానంత స్థానం వచ్చింది మైలుపరుగు సమయంలో 5 వేలమంది ప్రజలు హాజరయ్యారు. మొత్తం ఆటల పోటీలు చూసినవారూ, పాల్గొన్న యువకులూ రెట్టించిన ఉత్సాహంతో తమ తమ గ్రామాలలో మరింత శారీరకాభివృద్ధికి తోడ్పడవలెననే దృఢ సంకల్పంతో ఇళ్ళకు వెళ్ళారు మన ఆంధ్రయువకుల శారీరక కార్యక్రమం చూసి ప్రపంచ యువజన ప్రతినిధులెంతో ముగ్ధులయ్యారు.

వైజ్ఞానిక పోటీలు

17 వ తేదీ రాత్రి వైజ్ఞానిక పోటీలు జరిగినవి. 200 మంది యువకులు 4తాలూకాలనుండీ, ఒక పట్టణంనుంచీపాల్గొని 17 ప్రదర్శనాలిచ్చారు. రాత్రి 11 గంటలనుండీ తెల్లవారుఝాము 4 గంటలవరకూ పోటీలు జరిగినవి ఒక్క 'విముక్తి' నాటకంలోని 13 వ సీనును 3 దళాలు ప్రదర్శించినాయి.

నూతన శకారంభం


(మా విలేఖరి)

అట్లాగే 'అల్లరి సూర్యం' కూడా 2 దళాలు ప్రదర్శించినవి. అయినా ప్రజలకు విసుగెత్తలేదంటే కళాస్వరూపాలలో యువజన సంఘం ఎంతనిపుణతను పెంచిందీ అర్థమౌతుంది. నందిగామ తాలూకాదళం ప్రదర్శించిన 'ఛాయానాటకం' ఎంతో వింతగాచూచారు. గుడివాడ తాలూకాదళం ప్రదర్శించిన 'ఇదీలోకం'లో కొండపల్లి కోటేశ్వరమ్మగారి అభినయం ప్రజలనుర్రూతలూగించింది. ఆమె అభినయంపైన ప్రసిద్ధనటకులు కోడూరి అచ్చయ్యగారిలా తమఅభిప్రాయాన్ని చెప్పారు. "ప్రదర్శనం అరగంటక్రితమే అయినా ఇప్పటికీ నేను మాట్లాడలేకుండా ఉన్నాను. 'జీవచ్ఛవంగా' ఆమె అభినయం హృదయాన్ని జలదరింప జేసింది. సంసార స్త్రీలు నాటకాలలో పాల్గొ నటమే కష్టం. అందులో ఇంతనిపుణత చూపటం అభినందించదగిన విషయం, నూతన శకానికి నాంది"అని చెప్పారు. బెజవాడ పట్టణదళంలోని వారంతా కార్మికులే। అయినా ఎంతో నిపుణతతో ప్రదర్శనాలిచ్చారు. వారిచ్చినదాంట్లో 'అల్లరి సూర్యం' ఎంతో అభినందించవలసింది. పోటీలో ప్రథమంగా గుడివాడ తాలూకాదళం, ద్వితీయంగా బెజవాడ పట్టణదళం వచ్చినవి. మొత్తం జిల్లాలో యువజన సంఘాల ప్రోత్సాహంతో 60 దళాలు ఏర్పడినాయి. ప్రజాసమస్యలను గూర్చిన కళా స్వరూపాలను ప్రచారం చేస్తున్నారు. సమాజంలో అట్టడుగునపడియున్న నిమ్నజాతీయులవద్దనుండి అన్నివర్గాలవారు వీటిల్లోనికి ఆకర్షించబడినారు. 'కళ'అనేది ఏ కొద్దిమందికో సంబంధించిన సమస్యగాకుండా ప్రజా సమస్యగా యువజనసంఘాలు కళాభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఇదేవిషయాన్ని డాక్టరు జి. రాజారావుగారు తమ వైజ్ఞానిక అధ్యక్షోపన్యాసంలో చెప్పారు.

మహాసభ ఒక ప్రజాసముద్రం !

20 వ తేదీ వచ్చింది. ఆ రాత్రే మహాసభ జరుగుతుంది.

(మిగతా 32 వ పేజీలో)



ఫోటో: లైలా సుందరయ్య

సోవియట్ విద్యావిధానం:

[పిల్లల్ని కొట్టడంలో రోజుకొక బెత్తం విరగకొట్టే ఉపాధ్యాయులకు ఈవ్యాసాన్ని అంకితం జేస్తున్నాం వారిలో ఈ వ్యాసం మార్పు తేగలదని ఆసించుచున్నాం —సంపాదకుడు]

మాస్కోలో నెం 167 స్కూల్లో ఓ క్లాసులో ఇద్దరు పిల్లలు బలే గోలచేసే వాళ్ళు ఒకళ్ళనిమించి ఒకళ్ళు పంతు లేసుకున్నారా అన్నట్టు చేసేవాళ్ళు అల్లరి మేస్టరువాళ్ళను వేరేపిల్చి, నీతులు బోధించిచూశాడు ఏంలాభం లేకపోయింది. చివరికి ఓ ఉపాయంపన్నాడు. ఇద్దరికీ చెరోపుస్తకంకట్టాడు. వాటిల్లో వాళ్ల చేసేగోలంతా ఒకటీ బీరుపోకుండా రాసేవాడు.

తమాషాగా యిద్దరూ బాగుపడటం మొదలెట్టారు ఆ పుస్తకంలో ఎవరివిషయం తక్కువెక్కువుందో అనేపట్టుదల ప్రారంభమైనది దుర్నడతల రిజిస్టరులో తమ చేష్టల్ని యెక్కించడం మానసికంగా వాళ్ళనిమార్చేసింది

ఆ బళ్ళోనే మరో కుర్రాడుండేవాడు అతనికి చదువు సంధ్యలు పట్టేవికావు. ఎప్పుడు అల్లరిచెయ్యడమే వాడిపంతు మాష్టరు అన్ని విధాలా ప్రయత్నంచేసి చూశాడు ఉహుం, తల్లి దండ్రులతో చెప్పి వారిని దారిలో పెట్టమని చెప్పాడు. వాళ్ళకీ వశంకాలా అతన్నిగురించి ఒ క్లాసు మీటింగు పెట్టి అత నెదురుగుండా చర్చించారు తీవ్రంగా విమర్శించారు ఉహుం లాభంలేకపోయింది మరో డివిజనుకు మార్చారు.

మార్పు అకస్మాత్తుగా వచ్చింది అతను చేసే కోతిపను లన్నిటికీ అతని డివిజనులో విద్యార్థులు అలవాటైపోయి నారు అది అతనికి అలుసైపోయింది డివిజను మార్చేప్పటికి అంతా కొత్తగా అనిపించింది వాతావరణం వాళ్ళేమీ యితని కోతిపనులు సహించేట్టు కనబడలేదు దానితో తన్ను తానే సంస్కరించుకోవడం మొదలెట్టాడు

సో. యూ. లో మాష్టర్లు అల్లరిచేసే పిల్లల్ని మంచిదార్లో పెట్టడానికి ప్రోత్సాహకరంగా వుండేమార్గాలే అన్వేషిస్తారు. ఇది సహజంగా అనేక రీతులుగా వుంటుంది ఏమార్గం అందరికీ అన్వయిస్తుందనేది చెప్పటం దుర్లభం


పై చెప్పిన స్కూలు ప్రిన్సిపాలు లిడియా మెల్నికోవ, "మాష్టర్లు క్లాసుల్లోను, బయటా చూపేశ్రద్ధ, విద్యార్థి సంఘాల ప్రాభవం, తల్లిదండ్రులు విద్యాలయాధికారులకిచ్చే చేయూత, తోడ్పాటు - పిల్లలు మంచినడతలో నడవటానికి ప్రబలంగా పనిచేస్తాయి" అని అంది.

కొట్టకపోతే పిల్ల



సమస్త విద్యా సౌకర్యములతో తులతూగు విద్యాలయము

ఫొటో. (టాస్)



ఆధునిక యంత్రా లతో కూడిన సోవియట్ లేబరటరీలు

ఫొటో 'టాస్'

లు చెడిపోతారా?

పిల్లలు చెడ్డవాళ్ళు కారు

సోయూ లో మాష్టర్లకి మూలసూత్రం యేమిటంటే: విద్యార్థి నమ్మకాన్ని సంపాదించాలి అతని భావాలను అర్థం చేసుకొని, అతనికి సన్నిహితం కావాలి ఏపని కూడా బల వంతంగా, భయపెట్టి, బెదురుపెట్టి చేయించ కూడదు యెవరూకూడ దీనిని అన్నివేళలా అందరికీ అన్వయించేట్టు ఓ ఫార్ములాలా తయారుచెయ్యలేరు. ఓ మాష్టరు, "విద్యార్థులతో అత్యంత స్నేహంగా మెలగాలన్నాడు" యదార్థానికి యిది పైదాని సారాంశమే అంటే ప్రతి విద్యార్థినీ, అతని మానసిక ప్రవృత్తినీ, అతని అభిరుచులనూ సూక్ష్మంగా పరిశీలించాలి,

ఇదంతా అల్లరిచేసే పిల్లల విషయం అనుకోండి. అసలు పిల్లలు స్వతస్సిద్ధంగా దుర్మార్గులు కారంటాడు మేష్టరు. కాని అల్లరి చెయ్యటానికి అవకాశమిచ్చేసందూ, అందుకు దోహదంగా వుండే వాతావరణం యేర్పడే అవకాశం ఏమిటో కనిపెట్టాలి. అది కనిపెడితే, అన్నిచోట్లా మేష్టర్లను బాధించే యీ చిక్కు సమస్యను పరిష్కరించ కల్గినట్టే. అలా పరిష్కరించటంలో ఆ క్లాసే మేష్టరుకు చక్కని

ఏ సోవియట్ వుపాధ్యాయుణ్ణడిగినా. యేం చెప్తాతా డంటే - ప్రతి విద్యార్థికీ తన తోటివిద్యార్థులతో బాధ్యతా యుతంగా ప్రవర్తించాలనే విషయం, చిన్నతనంనుంచీ గ్రహించేలా చేయాలంటాడు. ఇది, మేష్టర్లంటేను, తల్లి తండ్రులంటేను అతను గుర్తించి అలవర్చుకోవలసిన బాధ్యతా గౌరవాలంత ముఖ్యంగా పరిగణించబడాలి.

విద్యార్థి తల్లితండ్రుల, మాష్టర్ల పరస్పర సహకారానికి యెంతో ప్రాముఖ్యతనిస్తాయి సోవియట్ విద్యాలయాలు అంతమాత్రంచేత మాష్టర్లు, విద్యార్థులమీద కొండాలు పితూరీలు తల్లిదండ్రులకు చేరేస్తుంటారని అనుకోకండి!

దెబ్బలు మరింత ద్వేషంకల్గిస్తాయి

సోవియట్ విద్యాలయాలు తల్లిదండ్రులుకాని, మేష్టర్లు కాని, విద్యార్థిని చావబాదుట (Corporal punishment) సహించవు.

నెం 167 స్కూల్లో ఓ మాష్టరిట్టా అన్నాడు. "శారీరకంగా బాధపెట్టినంత మాత్రంచేత తప్పుడు దారులనుండి విద్యార్థిని తప్పించలేం. అలా హింసించుట అతన్లో మరికాస్త ద్వేషాన్ని రెచ్చగొడుతుంది అతన్ని మోసగాణ్ణిగాను, పిరికి పందగాను చేస్తుంది.

ప్రపంచంలో పిల్లల విద్యావిధానంగురించి రాసే యే పెద్దమనిషైనా పిల్లల్ని బెత్తాల్తో దండించాలని రాయగలడా,

అనువాదం

కొలచల క్రిష్ణమూర్తి

రాష్ట్రాడా అని ఆశ్చర్యంగా అడుగుతారు సోవియట్ వుపాధ్యాయులు స్కూలు డిసిప్లిన్ అంటే సోవియట్ యూనియన్లో బెత్తాలు, కోదండాలు, గోడకుర్చీలు కాదు ఇట్లాంటి అమానుషమైన, అనాగరికమైన విధానాలనుమార్చి ఎలా నూతన నాగరిక పద్ధతుల్లో సాంఘిక చైతన్యంద్వారా సరైన మార్గంలో విద్యార్థుల్ని పెంచుతారో నెం. 167 రు స్కూలులో కనబడుతుంది

అన్ని సోవియట్ విద్యాలయాల్లోలాగానే ఆస్కూల్లోనూ విద్యార్థి కమిటీ ఒకటివుంది ఆకమిటీని విద్యార్థులంతా కలిసి యెన్నుకుంటారు అందులో విద్యార్థుల్లోకల్లా, అన్నిరంగాల్లోను ప్రధమంగా వుండేవాళ్లే యెన్నుకోబడతారు, అక్కడుండే సంఘచైతన్య వాతావరణమే అల్లరి చిల్లరివాళ్లు యెన్నుకోబడకుండా చేస్తుంది.

సాంఘిక ప్రాభవం

ప్రతిక్లాసుకు ఒక మానీటరువుంటాడు, అతడు విద్యార్థులంతా వంతులప్రకారం క్లాసురూమును పరిశుభ్రంగాను, ఆకర్షణీయంగాను వుండేట్టు చేసేలాచూస్తుంటాడు అదీకాక వాళ్లక్లాసు గోడ వార్తాపత్రిక ప్రచురించుటం, యెక్స్‌కర్షన్లు సినిమాలు, నాటకాలు ఏర్పాటుచేయించటం చేయిస్తుంటాడు.

సోవియట్ విద్యాలయాల్లో యెక్కువ ప్రాధాన్యం వహించేవి (Young Poiner Organisation) యంగ్ పయనీర్ ఆర్గనైజేషన్లు దాన్లో సభ్యత్వం దొరకటం ఒక గొప్ప గౌరవంగాభావిస్తారు విద్యార్థులు. మంచినడతకలిగి, శ్రద్ధగా చదివేవాళ్లకే అందులో సభ్యత్వం వుంటుంది

విద్యార్థుల మానసిక వికాసానికి తోడ్పడేందుకు Extra Curricular Activites) వుంటాయి, నేచూసిన నెం 167 స్కూల్లో విద్యార్థులు గడిచిన వేసంగిలో మాస్కోచుట్టూ, చెట్లూ, చేమలూ, పశుపక్ష్యాదులను పరిశీలించేందుకు అనేక సార్లు తిరిగివచ్చారు.

రచనలో అభిరుచి కనపర్చే భావి రచయితలకు వేరే సాహిత్య సంఘాలుంటాయి ఇక్కడికి మూడేళ్లనుంచి యీ విద్యాలయంలోని సాహిత్యసంఘం సొంత పత్రిక నడుపుతుంటోంది. అట్లాగే కళాభిరుచులు గలిగినవాళ్లకు "Artists Circles' వుంటాయి, ఆటపాటల్లో ప్రవేశం వున్నవాళ్లకు యింతే కొద్దికాలంక్రితమే ఈ విద్యాలయం ఒక చదరంగం టోర్నమెంటు పెట్టింది

ఇవన్నీ విద్యార్థులనూ, విద్యార్థినులనూ నిర్మాణాత్మకంగా వికాసంగా వాళ్లశక్తులుపయోగించేందుకు తోడ్పడతాయి ఇవి పీటికితోడు మాష్టర్ల తోడ్పాటుతో, ఆదరణతో, విద్యార్థుల బాగుకుచేసే కృషి, బెత్తం మొదలైన అనాగరికమైన అమానుషమైన పద్ధతులజోలితో నిమిత్తంలేకుండా చెయ్యటమే కాకుండా విద్యార్థులను బాధ్యతగల భావిపౌరులుగా తయారు చేస్తూ, వారి భావి భాగ్యోదయానికి దోహదంచేస్తాయి

(సోవియట్ వీక్లీనుండి'

అగ్నిమాపక దళాలను నెలకొల్పండి!

వేములపల్లి వెంకటదాసు

గత సంవత్సరం ఏప్రియల్ - మే నెలల్లో ఆంధ్రలో చాల గ్రామాలు అగ్నిప్రమాదాలకు విపరీతంగా గురయ్యాయి. పెద్ద పెద్ద భవంతులే ధ్వంసమవడం, ఆహారధాన్యాలు నష్టమవడం జరిగింది. ఆర్థికంగా నష్టపడ్డ కుటుంబాలు ఈనాటికీ కోలుకోలేదు. గత సంవత్సర దృశ్యాలు ఈనాటికీ కనపడుతున్నాయి.

అగ్ని ప్రమాదాలనుండి ఆస్థిపాస్థులను రక్షించుకోడానికి, గత సంవత్సరం జరిగిన వాటినుండి అనుభవాలను తీసుకొని ఇప్పటినుండే ప్రతి గ్రామ యువజనసంఘమూ తగిన జాగ్రత్తలు తీసుకొని పనిచేయాలి

తీసుకోవలసిన జాగ్రత్తలు

— పొయ్యిలోని బూడిదను, బొగ్గులను ఆర్పివేసి చెత్త పోగుమీద పొయ్యాలి.

— పొయ్యిలు దడులకు దూరంగా పెట్టాలి

— ఉదయం 8-30 — 9 గం॥ లోగానే వంట పూర్తి చేసి నిప్పు ఆర్పివేయాలి.

— మధ్యాహ్నం పూటా, సాయంత్రం గం॥ 6 వరకు నిప్పు రాజెయ్యకుండా ఉండాలి

— గోడలకు ప్రక్కగా గోతులుతీసి కావులు వేయాలి. చెత్తపై బూడిద ఎక్కువగా కప్పాలి బహిరంగంగా వేయవద్దు

— కావులను ఉదయం 9 గంటల లోగా పూర్తిచేసి, ఆర్పివేయాలి.

— చుట్ట, బీడి, సిగరెట్లుత్రాగేవారు, వాటిని జాగ్రత్తగా ఆర్పి పారెయ్యాలి

— వడ్లపురులను, గాదెలను మట్టితో అలికించాలి

— అపరాలనుకూడ బస్తాలలో ఉంచకుండా ప్రత్యేకంగా పురిచుట్టడమో లేక గాదిలో పోసో మట్టితో అలకాలి.

— దేష్వాలవల్ల కులకక్షలవల్ల ఎవరైనా నిప్పంటిస్తూ ఉంటే రాత్రింబవళ్లు కాపలాకాయాలి.

పై జాగ్రత్తల నన్నిటినీ గ్రామమంతా ప్రచారంచేయాలి. గ్రామపెద్దల సహకారంతో కమిటీలను ఏర్పర్చి, ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలి. ప్రమాదం రాకుండా ప్రతి యువకుడూ తన ఇంటిలోనే ఆచరించి, చుట్టుప్రక్కల ఇండ్లవారికి అర్థమయ్యేట్లుచేయాలి. ఇండ్లలో వంటసంబంధం స్త్రీలదవడంచేత, అగ్నిప్రమాదాలు రాకుండా చేయవలసిన బాధ్యత ఎక్కువగా వారిపైఉంది. మహిళా సంఘాలు శ్రద్ధ తీసుకొని ప్రత్యేకంగా మహిళలలో ప్రచారంచేసి ప్రమాదాలు రాకుండా ముందే జాగ్రత్తలు తీసుకునేటట్లు చేయాలి.

అగ్నిమాపక దళాల కర్తవ్యం

నిప్పంటుకొన్నప్పుడు విరివిగా వ్యాపించకుండా ప్రాణ, ధననష్టాలు ఎక్కువ జరగకుండా కాపాడటానికై గ్రామంలోని యువకులందరూ అగ్నిమాపక దళాలుగా ఎర్పడాలి. గ్రామం మధ్యలో అగ్నిమాపకదళ ఆఫీసును ఏర్పర్చాలి.

దళానికి కావలసిన పరికరాలు

— 60 మట్టికుండలు లేక కడవలు

— 4 లేక 5 స్టిరప్ పంపులు

— 2 బకెట్లు, 4 తట్టలు, 6 చేటలు

— 2 పారలు, 1 పలుగు.

— టించర్ అయిడన్, దూది, అముగం పాతగుడ్డలు, వాసాలు మొ॥

స్టిరప్ పంపులను గ్రామ పంచాయతీ బోర్డులు కొనేటట్లు చేయాలి. పెద్ద గ్రామాలలో ప్రతివైపునా ఒక వార్తాహరుని నియమించాలి: ఆఫీసులో రాత్రింబవళ్ళు వంతులు వారీగా డ్యూటీమీద యువకులు ఎప్పుడూ ఉండాలి ప్రమాదం సంభవించి నప్పుడు వార్తాహరులు ప్రమాదాన్ని సూచిస్తూ విజిల్స్ యివ్వాలి విజిల్ మోత గుర్తులను ప్రజలందరికీ ముందే తెలియజేయాలి కబురుతెలియగానే డ్యూటీమీద ఉన్న యువకులు సామాన్లతో ఆ ప్రదేశానికి వెళ్ళాలి. ముందుగానే గ్రామంలో ఉన్న చెరువులు, బావులు ఎన్ని ఉన్నవో, ఎక్కడెక్కడ ఉన్నాయో ఒకప్లాన్ వేయాలి. ఏ భాగంలో నిప్పంటుకుంటే ఏయే చెరువులు, ఏయే బావులు ఉపయోగించు కోవాలో ముందుగా నిర్ణయించు కోవాలి ఇసుకగాని ఒండ్రుమట్టి గాని గ్రామంలో నలువైపులా తోలిఉంచాలి.

ప్రమాద ప్రదేశానికి వచ్చిన దళాలు యీ క్రింది డిపార్టుమెంట్లుగా వేరుపడి పనిచేయాలి.

(1) స్టిరప్ పంపుపార్టీ (2) కుండలపార్టీ (3) వాసాలపార్టీ (4) ఇసుకపార్టీ (5) ప్రథమచికిత్సపార్టీ (6) రక్షకులు.

1 స్టిరప్ పంపుపార్టీ : ఒక్కొక్క స్టిరప్ పంపుకు ముగ్గురు లేక నలుగురు ఉండాలి. రెండు బక్కెట్లు ఉండాలి. ఇద్దరు పంపు కొట్టేవారు ఒకరు ట్యూబును అగ్నివైపుకు పట్టుకునేవారు ఉండాలి. బక్కెట్లలోని నీరు ఖాళీగాకుండా ఎప్పుడుకప్పుడు పూర్తిచేస్తూ ఉండాలి బాగా పనిచేస్తూ ఉండే స్టిరప్‌పంపు 10 గ॥ ఎత్తువరకూ ధార వెళుతుంది' నిట్టాళ్ళు, తాడిచెట్లు మొదలైన వాటికి అంటుకున్న నిప్పును స్టిరప్ పంపులతో తేలికగా ఆర్పివేయవచ్చు

2 కుండలపార్టీ నిప్పంటుకున్నప్పుడు గాబరాతో గంతులువేయడమేగాని నీళ్లక్రమంలో తేవడం సాధారణంగా జరుగదు ఆఫీసులో ఉన్న కుండలన్నీ ప్రమాద ప్రదేశానికి చేర్చాలి చెరువులుగాని, బావులుగాని ప్రమాద ప్రదేశానికి దూరంగాఉంటే వచ్చినవారు వరుసలలో నిలబడి నీళ్లను ఒక క్రమంలో ముంచి పంపాలి. ఖాళీకుండలను మరి యొక వరుసలోనివారు ఎప్పటికప్పుడు వెనుకకు పంపుతూఉండాలి. పైవిధంగాచేస్తే నీరువిరామం లేకుండా చేరుతుంది. నీటిని చేటలతో నిప్పుమీద చల్లాలి గాలి ఎక్కువగాఉండి, అన్నీ తీవ్రంగా చెలరేగుతుంటే, అంటుకొన్నదానిమీద నీళ్లు చల్లలేమనుకున్నప్పుడు గాలికి వాలునఉన్న ప్రదేశాలను నీటితో పూర్తిగా తడిపివేయాలి

3. వాసాలపార్టీ : వీరు వాసాలతో, మందేగడ్డిని, తాటకులను గోడలలోపలికి పడగొట్టాలి, దగ్గరలో ఉన్న పాకలపై ఉన్నగడ్డిని తాటాకులను తీసివేయాలి.

4 ఇసుకపార్టీ · వీరు పలుగులు, పారలు, తట్టలతో దగ్గరగాఉన్న ఇసుకను మంటలపైచల్లాలి. ఇసుక దొరకకపోతే మెత్తనిమన్నును త్రవ్విచల్లాలి,

5. ప్రథమ చికిత్స తగులబడే ఇంటిలో ఎవరయినా మనుష్యులుగాని, పశువులుగాని చిక్కుపడివుంటే లోపలకు పోయి ప్రమాదంనుండి తప్పించాలి. కాలిన వారికి, గాభరాతో స్పృహతప్పినవారికి ప్రథమ చికిత్సచేయాలి. ప్రమాదమైతే డాక్టరును వెంటనే తీసుకురావాలి.

6. రక్షకులు . అగ్నిప్రమాదం సంభవించిన ఇండ్లలో ఉన్న వస్తువులన్నింటినీ బయటకు తీసుకురావాలి. బయట వేసిన వస్తువులకు కాపలా ఉండాలి లేకపోతే యీ హడావుడిలో దొంగలు ఎత్తుకుపోతారు ప్రజలందరూ గాభరాతో ఆ ప్రదేశానికి రావడంవల్ల ఇతర ఇళ్ళలోకూడ దొంగతనాలు జరగవచ్చు. అందువల్ల వలంటీర్లుగా గ్రామంలో అక్కడక్కడా కాపలా ఉండి రక్షణ చేయాలి.

వలంటీర్లకు శిక్షణ యివ్వాలి

పై కార్యక్రమమంతా జయప్రదం కావాలంటే వలంటీర్లకు ప్రాథమిక శిక్షణ ఎంతో అవసరం ఆఫీసునుండి ప్రమాద ప్రదేశానికి వెళ్ళడానికి, ఒకేసారి అందరూ సమిష్టిగా కదిలి పనిచేయడానికి ప్రతి యువకుడూ తప్పక శిక్షణ పొందాలి కుడికి-తిరుగు, ఎడమకు-తిరుగు, వెనుకకు-తిరుగు, ముందుకు-నడువు పరుగెత్తు మొదలగుపొజిషన్లవరకూ నేర్చుకోవాలి, ఈ శిక్షణమీద స్థానిక కార్యకర్తలు తగిన శ్రద్ధ తీసుకొని పనిచేయాలి. అప్పుడే పై 'పార్టీ'ల పని నిర్మాణయుతంగా జరుపగలుగుతాం.

పెద్దలకు విజ్ఞప్తి

పై కార్యక్రమం అంతా ఒక్క యువకులకే వదలిపెట్టక మీరంతా బాధ్యత తీసుకొని, అందరూ కలిసి సమిష్టిగా పని చేసి జయప్రదం చేయండి. లోటులువుంటే మీ బిడ్డలకు సూచనలిచ్చి, ముందుకు నడపండి. అందరూ కలిసి గ్రామాలను అగ్నిప్రమాదాలనుండి రక్షించండి. మహిళలు కూడా ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

గ మ ని క

అగ్నిప్రమాదం పెద్దదైనప్పుడు బె జ వా డ, ఏలూరు, గుంటూరు, రాజమండ్రి, విశాఖపట్నం మొదలైన పట్టణాలలోని "ఫైర్ సర్వీస్" వారికి ఫోనుచేసి ఫైర్ ఇంజన్లను తెప్పించుకోవాలి. ఫైర్ డిపార్టుమెంటువారు గ్రామాలకు వచ్చినప్పుడు, వారికి అన్నివిధాల తోడ్పడాలి "ఫోను" చేయవలసినప్పుడు దగ్గరలో ఉన్న పి డబ్ల్యు, డి. ఫోనులను, పోష్టాఫీసులలోని ఫోనులను ఉపయోగించుకోవచ్చు.

రచయితలకు విజ్ఞాపన

'నవయుగ' యువకుల పత్రిక యువసమస్యలను గురించి చర్చించుతుంది. వ్యాసములు కథలు, పాటలు పంపు సోదరులు యీ విషయాన్ని గమనించకోరుతాం. రెండవ సమస్య పంపు వ్యాసములు, చాలా పెద్దవిగా యుంటున్నవి. సమస్యను క్లుప్తంగా, స్పష్టంగా వివరించినప్పుడే 'నవయుగ'లో ప్రకటన నీలవుతుంది.

వ్యాయామ, ఆటలు, శరీరశాస్త్రం, సంస్కృతి విషయాలపై వ్యాసాలను ఆహ్వానించుతున్నా.

రచయితలు తోడ్పడి 'నవయుగ' అభివృద్ధికి పాటుపడుతారని ఆశించుతాం,

—సంపాదకుడు

నెల్లూరు జిల్లా 7 వ విద్యార్థి మహాసభ

పది వేల మంది ప్రజల సమీకరణ

7 వ నెల్లూరు జిల్లా విద్యార్థిమహాసభ ఫిబ్రవరి 22, 23 తేదీలలో ఆల్లూరులో జరిగింది. పబ్లిక్ పరీక్షలు దగ్గరకువచ్చినా హైస్కూళ్ళనుండి కాలేజినుండి ప్రతినిధులు వుత్సాహంగా మహాసభకు వచ్చారు 7 సంఘాలనుండి 100 మంది ప్రతినిధులు ప్రేక్షకులు వచ్చారు. రెండు రోజులపాటు జరిగిన ప్రతినిధుల సమావేశంలోని చర్చలను గమనిస్తే ప్రతి విద్యార్థి విద్యార్థిహక్కుల సాధనకోసం ఎంతపట్టుదలతో వున్నాడో బోధపడుతుంది. మహాసభలో తీర్మానాలమీద నూటికి 90 మంది విద్యార్థులు మాట్లాడడం చెప్పుకోదగ్గ విషయం.

డిటెషన్ విధానం నిర్మూలించాలని, విద్యా కేంద్రాల్లోని లోటు పాట్లని ప్రభుత్వం వెంటనే సవరించాలని, ఆర్డినెన్సు వుపసంహరించుకొని అరెస్టుచేసిన వారినందర్నీ విడుదల చేయాలని తాత్కాలిక ప్రభుత్వంపట్ల, రాజ్యాంగసభ విషయంలోను బ్రిటిషు ప్రభుత్వ కుట్రను బహిర్గతపరుస్తూ విద్యార్థుల కర్తవ్యాన్ని గురించీ, యింకాఅనేక విద్యార్థులకు సంబంధించిన విషయాలమీద తీర్మానాలు చేశారు.

అన్నిటికంటె ప్రసంశనీయమైనది విద్యార్థి వర్కర్ల ఆదర్శమై కృషి. వారమురోజుల్లో రూ. 700 లు వసూలు జేశారు కాలినడకను మహాసభా ప్రదేశానికి 10, 15 మైళ్ళ వరకూ ప్రచారంజేసి 10 వేల మందిని సమీకరించారు. పెద్ద పెద్ద నాయకులకోసం ఎదురుచూడకుండా బహిరంగసభతో సహా అంతా విద్యార్థి నాయకులే దిగ్విజయంగా నిర్వహించారు ఎన్ని ఆర్డినెన్సులు, నిర్బంధాలైనా విద్యార్థి వుద్యమాన్ని, స్వాతంత్ర పోరాటాన్ని అరికట్టలేవని ప్రత్యక్షంగా ఋజువు చేశారు.

నూతన సంవత్సరానికి శివరామరెడ్డి అధ్యక్షుడుగాను నరిసింహం కార్యదర్శిగాను మరికొంతమందితో కార్యనిర్వాహక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హెచ్చరిక

1 ప్రతినెల పత్రిక 10 వ తేదీన అచ్చునకీయబడును.

2 ప్రతినెల 20 వ తేదీన చదువరుల కందజేయబడును

3 ఏజెన్సీ బాకీలు - ఏజెంట్లకు కావలసిన పత్రికల నంబరు, అడ్రసుల మార్పులు ఆఫీసునకు కనీసం 9 తేదీకి రావలయును

4 వ్యాసకర్తలందరూ పత్రికకు వార్తలు 5 వ తేదీలోగా పంపాలి లేనిచో మరుసటి సంచికలో ప్రచురింపబడును. వార్తలు కాగితంపై ఒకేవైపునే చక్కగా వ్రాయవలయును.

5. ఏజెంట్లు - చందాదారులు తమ ఏజెన్సీ లేక పత్రిక నంబర్లుదహరించిన ఆఫీసునకు సాయపడిన వారగుదురు.

6 ఉత్తర ప్రత్యుత్తరములు - మనియార్డర్లు మేనేజరు నవయుగ అరండల్ పేట గుంటూరు అని మాత్రమే వ్రాయవలయును

7 డబ్బు పంపేవారు దానివివరములను పెద్దక్షరములతోక్రింద వ్రాయనిఎడల కొన్ని సందర్భములలో ఆ డబ్బు నెలల తరబడి అనామతు ఖాతాలో నుండవలసి వచ్చును

క్రిందటి సంచికలో ప్రకటించిన విరాళాలు	1308— 0—9
కృష్ణాజిల్లా యువజనసంఘం	100—13—0
విశాఖపట్టణ విద్యార్థిసంఘం	40— 0—0
నెల్లూరు జిల్లా	31— 0—0
ఒంగోలు విద్యార్థిసంఘం	17— 0—0
ఉరవకొండ	15— 0—0
కొలూరు	8— 0—0
నందిగామ	5—11—0
గుంటూరు జిల్లా యువజనసంఘం	5— 0—0
ఇప్పటికిచేరిన విరాళాల మొత్తం	1530—8—9

గుంటూరు, 30—4—47. } మేనేజరు.

స్టాలిన్ గ్రాడ్

యువజన వీరుల స్మారక కేంద్రం

ఫాసిజంపై యుద్ధ నిర్వహణలో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన యువక యోధులకు స్మృతి చిహ్నంగా, ప్రపంచ యువకు లందరూ, స్టాలిన్ గ్రాడ్‌లో ఒక యువజన వీరుల స్మారక కేంద్రం నిర్మిస్తున్నారు ఈ కేంద్రంలో గ్రంధాలయాలు, పఠన కేంద్రాలు, సినిమా, నాటకశాల, ప్రేక్షకులకు హాస్టలు, హోటళ్ళు, ఆటస్థలాలు ఈతకుపయోగించేతటాకములు మొదలగునవినిర్మిస్తున్నారు. ఈకేంద్రాన్ని వాల్గానది ఒడ్డున పట్టణ మధ్య భాగంనుండి 2½ కిలో మీటర్ల దూరంలో షుమారు మైళ్లు1½ నిర్మింపబడుతూవుంది.

చైనా, ఆస్ట్రేలియా, డెన్మార్కు, జెకొస్లోవేకియా, న్యూజిలాండ్, యునైటెడ్ స్టేట్సు, కెనడా మొదలగు దేశాల యుర్తిగాయువజనసంఘాలు దీనికి సహాయపడుతూ ఉన్నవి

ఈకేంద్ర నిర్మాణానికి సహాయ పడటానికి అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ కృషి సల్పుతూ వుంది ఇందు కొరకు మన దేశంలో ఒకకేంద్రకమిటీని ఏర్పాటుచేయటానికి ప్రయత్నిస్తూ వుంది ఈ కమిటీలో వుండి సహాయ పడటానికి ఇప్పటికి యన్ యమ్, జోషి, హరీంద్రనాధ ఛటోపాధ్యాయ, ముల్కురాజ్ ఆనంద్, మహాకవివల్లథోల్, అహ్మద్ అబ్బాస్, కృష్ణచందర్, హరిన్ ముఖర్జీ, యస్, ఏ. డాంగే మొదలగు ప్రముఖులు అంగీకరించారు

ఫాసిజమును నిర్మూలించుటలో ప్రాణదానం చేసిన వీరులకు ఆంధ్రయువకులం మనకానుకలను పంపనవసరంలా? యువజనసోదరా! లే! వెంటనే వివిధ వస్తు సామగ్రినీ సమకూర్చుటకు పూనుకో చిత్రకారుల చక్కని చిత్రాలు, మన పురాతన ఔన్నత్యాన్ని సూచించేచిత్రాలు, గ్రామజీవితాన్ని ప్రతిబింబించే బొమ్మలు; మనకళాస్వరూపాలు, మన యువజన, విద్యార్థి సంఘాలకార్యకలాపాలను, ప్రజాజీవితాలను వ్యక్తపర్చే చిత్రాలూ సమకూర్చి పంపండి. ఇప్పటి కప్పుడే యితర రాష్ట్రాలు ముందుకు పోతున్నాయి బెంగాలు, అస్సాంలలో సోవియట్ ఫిలుములు ప్రదర్శించి డబ్బు వసూలుజేశారు. ఆంధ్రయువకులు వెనుకబడుటయా!

మీరువసూలుజేసిన వస్తువులను 'నవయుగ' ఆఫీసుకు పంపండి

స్టాలిన్‌గ్రాడ్ యువకేంద్రనిధికి వస్తువులు కొనుటకు, డబ్బువసూలుజేయుటకు తమఫిల్మయిన 'గోర్కీ జీవితము'ను

ప్రపంచ

యువజనోత్సవాలు

ప్రపంచ యువజన సమాఖ్య ఆధ్వర్యాన జెకోస్లొవేకియ ముఖ్యపట్టణమైన ప్రేగ్‌నగరంలో జూలై 20 వ తేదీనుండి ఆగస్టు 17 వరకూ ప్రపంచ యువజనోత్సవాలు జరుపబడతాయి. ఈనెలరోజులూ ప్రపంచంలోని అన్నిదేశాల యువకులూ వేలసంఖ్యలో యీవుత్సవాల్లో పాల్గొంటారు. ఆటల పోటీలు, ఈతపోటీలు వైజ్ఞానిక ప్రదర్శనాలు, నృత్యాలు. వ్యాసరచనా పోటీలు, సంగీత పోటీలు, చిత్రకళా పోటీలు ఏర్పాటు చేయబడుతూ వున్నవి.

మనోహరమైన సరస్సులు, కొండలు, భవనాలు, నాటక సినిమా శాలలు, పార్కులతో గూడిన యీ పట్టణంలో వుత్సవాల్లో పాల్గొని ఆనందించటానికి ప్రపంచ యువకులు ఈపర్వదినంకోసం ఎదురు జూస్తున్నారు తమ తమ ప్రజాజీవితాలను చిత్రించే నృత్యాలు, నాటకాలు, తమ తమ జాతీయ ఆటలను ప్రదర్శించటానికి యువకులంతా సిద్ధమవుతున్నారు

జకొస్లోవేకియా యువజన సమాఖ్యవారు పై యీ వుత్సవాలకు కావలసినఏర్పాట్లన్నీ చురుకుగా సాగిస్తున్నారు. ఇంతేగాక వచ్చేప్రతినిధులందరినీ దేశమంతా త్రిప్పి గనులు, ఫ్యాక్టరీలు, కొండలు తదితర ముఖ్యప్రదేశాలు చూపించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వుత్సవాలు దిగ్విజయంగా జరగటానికి అవసరమైన అన్ని సదుపాయా లూ జకొస్లోవేకియా ప్రభుత్వం కలుగజేస్తూవుంది ప్రేగ్ పట్టణములోని నాటకశాలలు, సినిమాహాల్సు, ప్రదర్శనశాలలు, ఈతకుపకరించే తటాకములు, విశాలమైన మూడు ఆటప్రదేశాలు యీ కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం యిచ్చివేసింది

ప్రపంచములోని అన్నిదేశాల యువకులు, యితరదేశ యువకుల జీవితాన్ని, వారి వారి జాతీయ జీవితాలనుగూర్చి తెలుసుకుంటానికి, ఇతరదేశ యువకులతోసన్నిహిత సంబంధాలను పెంపొందించుకుంటానికి, ప్రపంచ యువజనోద్యమ అభివృద్ధికి యిలాంటి వుత్సవాలు ఎంతో తోడ్పడతాయి.

సోవియట్ మిత్రమండలివారు ప్రదర్శనలకు యిచ్చుట అంగీకరించారు, ఏ ఏ కేంద్రాలలో యీఫిల్మ్ప్రదర్శనలు ఏర్పరచగలరో యువజన, విద్యార్థి సంఘ కార్యకర్తలు 'నవయుగ' ఆఫీసుకు వ్రాయాలి. ఉన్నకాలంకొద్ది. పదండి! ముందుకుపోదాం!


(25 వ పేజీ తరువాయి)

ప్రపంచ యువప్రతినిధులొస్తున్నారు అందుకే కోలాహలం! జిల్లాలోని పలుప్రాంతాలనుండీ ప్రజలు చీమల దండుల్లాగా బారులుతీరి వచ్చారు.

అసలే అర్ధినెన్నుల రోజులు! అందులో ఇంత మహా సభ తలపెట్టారు, ఇది జరుగుతుందా? అని అనుమానం కొందరి పెద్దల్లో కలిగింది చీకట్లు చీల్చుకొంటూ 'వీరేశలింగనగర్'లో ప్రవేశించిన 50 వేలమంది ప్రజలనుచూసి వారు విస్తుబోయారు 'వీళ్ళనల్ల కానిదిలేదు' అంటూ ఆశ్చర్యము వెలిబుచ్చారు. ప్రజామంత్రుల ఆసరాతో దారుణ నిర్బంధాన్ని అమలుజరుపుతున్న సామ్రాజ్యవాదులకు ఇది ప్రజలిచ్చిన జవాబు

కామ్రేడ్ తాతినేని సూర్యప్రకాశరావు మహాసభకు అధ్యక్షత వహించారు 'దేశ దేశాలలోని ప్రజలందరూ ఒకటే' అనే దివ్య సందేశాన్ని వినిపించటానికి వచ్చిన ప్రపంచ యువక ప్రతినిధులు వేదిక నెక్కగానే కరతాళధ్వనులతో ప్రజలు స్వాగతమిచ్చారు. ఆంధ్ర యువజన నాయకుడు కామ్రేడ్ వేములపల్లి వెంకటదాసు యువక పతాక నెగురవేశారు తర్వాత వివిధదేశాల ప్రతినిధులు తమ తమ సందేశాలిచ్చారు వారిచ్చిన సందేశం ఒకటే! "బానిస భారతదేశమందలి ప్రజలంతా పోరాడి, తమ స్వాతంత్ర్యాన్ని సాధించుకోమనీ, ఇతర దేశ ప్రజల సానుభూతి ఉందనీ వారు నొక్కివక్కాణించారు తర్వాత అఖిల భారత విద్యార్ధి ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ ఆనందశంకర భట్టాచార్యగారు ఉపన్యసించారు, 'అంతిమ పోరాటానికి భారతీయులందరూ ఆయత్తం కావాలని' వారు హెచ్చరించారు వెంటనే ఆంధ్ర ప్రజానాట్యమండలివారి కళాప్రదర్శనాలు జరిగాయి. వారు ప్రదర్శించిన 'సిమ్లా భాగవతం' సామ్రాజ్యవాదుల కుట్రలను ప్రజలకు అర్ధమయ్యేలా బట్టబయలు చేసింది ప్రపంచ ప్రతినిధులు ఎంతో మెచ్చుకున్నారు. వారిచ్చిన ఆఖరు ప్రదర్శనం 'కష్టజీవి' నృత్యం! మహాసభ మొత్తంపైన ప్రేక్షకుల హృదయాలపై యిది ముద్రవేసింది. తమ కష్టాలనెంతో ప్రత్యక్షంగా వారు చూచారీ నృత్యంలో, మాటిమాటికీ కరతాళధ్వనులతో తమ సంతోషాన్ని వెలిబుచ్చారు.

యువజనోద్యమ చరిత్రలో ఈ మహాసభ ఒక మైలురాయి అభిప్రాయభేదాలెలా ఉన్నా ప్రజలసేవలో కలిసి పనిచేయమని, స్వాతంత్ర్యపోరాటంలో అగ్రగాములుగా నిలవమనీ మనకు ప్రపంచ ప్రతినిధులు సందేశమిచ్చారు దీనిని ఆంధ్రయువకులం అనుసరించుదాం.



బాల బాలికలకు

వీట్-నాం బాలుర సాహసచర్యాలు

చిట్టి తమ్ములూ, చెల్లాయిలూ !

మా అన్నలం 10 సంవత్సరాలనుండి సంఘాలు ఏర్పరచుకుని కృషిచేస్తున్నాం. కాని ఒకమాసపత్రిక పెట్టుకోవాలని కలలుగంటున్నాం, ఇప్పటికి జయప్రద మవ్వగలిగాం మీరంతా మీఅన్నలపత్రిక 'నవయుగ' మొదటి సంచికచూచే యుంటారనుకొంటా.మాకొరకు ఏమిరాశారో అని ఆదుర్దాగా పేజీలు తిరుగవేసియుంటారు. కాని పాపం! నిరుత్సాహపడియుంటారు మీవార్తలులేక ఇక అట్లాచేయదలచలా. ప్రతిసంచికలోనూ తప్పక మీవార్తలు. ప్రకటిస్తాం. అన్నలు, చిట్టితమ్ముళ్ళను- చెల్లాయిలను నిరుత్సాహ పర్చుతారా? మీసంఘాలు ఎంతబలపడితే మాకు అంతఉత్సాహం, ఇక అసలుకధకువస్తా

మీరు రోజు పత్రికవార్తలు మీ అన్నలు చెప్పకపోతే వేధించన్నా చెప్పించుకుంటున్నారనుకుంటా. ఢిల్లీఅనేపేరు విన్నారుగా! అది మనదేశముఖ్యపట్టణం అచ్చట మొన్న ఆసియాదేశాల సభజరిగింది. ఆసియాఖండంమాట మీరెరుగుదురుగదూ? మీభూగోళపు క్లాసులలో వినలా! ప్రపంచంలోని 5 ఖండాలలో ఆసియా ఒకటి అన్నిఖండాలలోకంటే పెద్దదది ఈఖండంలోని దేశాల ప్రతినిధులందరూ మొన్న ఢిల్లీసభకు వచ్చారు.

ఈ సభకు అన్ని దేశాల ప్రతినిధులతో పాటు వీట్-నాం దేశ ప్రతినిధులుకూడా వచ్చారు. అసలు కధకు దిగేముందు వీట్-నాంను గూర్చి రెండు ముక్కలు చెబుతా చైనా దేశానికి దక్షిణకొనను వీట్-నాం దేశముంది. ఇది సామ్రాజ్యవాదులు పీడించే ఇండోచైనాదేశంలో ఒక భాగం. మనదేశాన్ని యింగ్లీషువాళ్ళు ఆక్రమించి పరిపాలిస్తున్నట్లే వీట్-నాంను ఫ్రెంచి సామ్రాజ్యవాదులు వందల సంవత్సరాలకు పూర్వం ఆక్రమించుకన్నారు. అప్పటినుండీ మనలాగే ఈ వీట్-నాం ప్రజలుకూడా స్వతంత్రం కొరకు చాలసార్లు పోరాడారు .బలమైన సైన్యం యుంటుందిగదూ, సామ్రాజ్యవాదులకు ! దాని సహాయంతో ప్రజలను కాల్చి చంపారు తుపుగుబాట్లను అణచారు. కాని మొన్న యుద్ధం రోజులలో జపాన్ యీ దేశంపై దండయాత్రకు రాగానే యీ ఫ్రెంచివాళ్ళచ్చటనుండి కాలికి బుద్ధిచెప్పారు. అంతేకాదు, ప్రజలు జపాను రాక్షసులను ఎదిరించుటకు సిద్ధపడితే యీ ఫ్రెంచిద్రోహులు జపానువాళ్ళతో సంధి చేసుకున్నారు. యుద్ధకాలంలో జపానుతో పోట్లాడుకోటానికి "గెరిల్లా" దళాలను యేర్పరచుకున్నారు. గెరిల్లాలనీ, గెరిల్లా యుద్ధమనీ మీరు వినేయుంటా రనుకొంటా. ప్రజలకు సరియైన ఆయుధబలం లేనప్పుడు చాటుమాటున దాగి శత్రువును చావుదెబ్బకొట్టే పద్ధతది. ఈపద్ధతియుద్ధాలలో మీపాత్ర కూడ చాలాయున్నది మీ అన్నాల నడగండి చెబుతారు. ఈ రకంగా గెరిల్లాయుద్ధాలుచేసి వీట్-నాం ప్రజలు స్వాతంత్ర్యం సంపాదించు కున్నారు ఇది ఫ్రెంచి వాళ్ళకు గిట్టలా. ఈ స్వతంత్ర ప్రభుత్వంతో సంధి చేసుకొని దాన్ని భగ్నంజేసి మరల యుద్ధానికి దిగారు పెత్తనం చేయమరిగిన సామ్రాజ్యవాదులకు సంధుల విలువేమిటి?

మొన్న యీ ఆసియాదేశాల సమావేశానికి యీ స్వాతంత్ర్య పోరాటమును నడుపుచున్న నాయకులు వచ్చారు. ఆదేశ యుద్ధంలో మీ బోటి బాల, బాలికలు గూడ పాల్గొంటున్నారని విని వారిని కలుసుకొన్నా. మీ సంఘాలను గూర్చి చెప్పగనే వారెంతో ముచ్చటతో విని సంతోషించారు సుమా. వారి దేశంలో ఉన్న బాల సంఘాలనుగూర్చి, వారి కార్యక్రమాన్ని గూర్చి చెప్పమన్నాను వీట్-నాం ప్రజానాయకులు మీకు చెప్పమని చెప్పిన విషయాలను చెబుతాను వినండి. మీరు గూడ అట్లా తయారు గావాలి. అందుకు మీరంతా మన బాలసంఘాలను బలపర్చి కృషి చేస్తారు కదూ !

వీట్-నాం దేశస్వాతంత్ర్య రక్షణలో బాలబాలికలందరూ పాల్గొంటారు. ఎంతోనేర్పుతో శత్రువులనుండి తప్పించు

కొని రహస్యవార్తలు జేరవేస్తారట పట్టుబడితే ప్రాణమైనా వదలుతారుగాని ఫ్రెంచివాండ్లకు జవాబుచెప్పరట విల్లంబులు పుచ్చుకొని మన బాల బాలికలు యుద్ధానికికూడా తయార్. అబ్బ! ఎంతసాహసం, మీరంతా అంతటి సాహసవంతు



లవ్వాలి! కాదూ? దేశంనుండి జపానువాళ్ళను వెళ్ళగొట్టారు. బ్రిటిషు సైన్యాలువచ్చాయి. ప్రజాప్రభుత్వం మన సభలు లాంటి పెద్దసభ జరిపింది దానిపై చాటునుండి ఫ్రెంచి వాండ్లు కాల్చారు ఇంకేముంది. మిబోటి బాలవీరుడు విల్లంబు వేసుకొని తనబాలసైన్యంతో ఫ్రెంచివారికి బుద్ధి చెప్పుటకు బయలుదేరాడు, ఫ్రెంచివాండ్లు తుపాకులతో యీబాలసైన్యంపై కాల్చి పారిపోయారు మన బాలవీరుడు వీరమరణం పొందాడు నాటినుండే ఈబాలవీరుడు జాతీయ వీరుడయ్యాడు ఈబాలవీరుని పేరు స్మరించి ప్రతిఒక్కరూ శత్రువుల నెదుర్కొంటారు.

మన వీట్-నాం బాలవీరులు ఒక్క యుద్ధంలో పాల్గొన టమేగాదు. నిరుటిసంవత్సరం వారిదేశంలో కరువువచ్చింది. మనదేశంలో వచ్చిన బెంగాలు కరువు గుర్తుంది కదూమీకు? అంతబ్రహ్మాండమైన కరువది షిరపై లక్షల ప్రజలు చని పోయారట ఒకరా! ఇద్దరా!! ఈ కరువెందుకొచ్చిందో తెలుసా! ఫ్రెంచివారి పరిపాలనలో వీట్-నాంను అభివృద్ధి గానీయలేదు చివరకు తిండి గింజలకు ఫ్రెంచి–ఇండో చైనాలోని ఇతరరాష్ట్రాలకు ఎదురుచూడాలి యుద్ధంలో వ్యవసాయం దెబ్బతిన్నది. ఇక్కడున్న తిండి దొంగలు అక్కడా వున్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే "తిండి లేక ఒక్కరూ చావగూడదు" అనే నినాదమిచ్చారు. బాల బాలికలు దీనినెట్లా అమలు పర్చారో తెలుసా?

పిల్లలంతా గునపాలు, పారలు పుచ్చుకుని బయ దేరారు (బొమ్మచూడండి) స్కూళ్ళలో ఒక్క గజం నేల కూడ వృధాగా వుండనీయలేదు. పండ్లమొక్కలు వేశారు. పొలాలకుపోయి తలిదండ్రులకు సాయంజేసేవారు ఈరక మైన కృషితో దేశంలో కరువనేది లేకుండాజేశారు.

ఇంతటితో ఆగారనుకుంటున్నారేమో! బాలసంఘాలు చక్కని చిత్రప్రదర్శనాలు ఏర్పాటు చేసినవి అవి తీసుకుని గ్రామాలవెంటవెళ్ళి శత్రువును ప్రతిఘటించమని ప్రబో ధించేవారు. రాత్రిళ్ళు చదువురాని తలిదండ్రులకు చదువనూ, వ్రాయనూ నేర్పేవాళ్ళు. తాము నేర్పలేకపోతే యువజన సంఘ సహాయం తీసుకుంటారు. తీరిక సమయాల్లో బాల సంఘము దళాలు గ్రామాలకు బయలు దేరతాయి (బొమ్మ చూడండి)


ఆరోగ్యసూత్రాలను ప్రచారం చేస్తారు దేశభక్తి ప్రబో ధిస్తారు. ఇదంతా చేయబట్టే వీట్-నాం దేశంలో బాలసంఘా లంటే పెద్దలెంతగనో గౌరవిస్తారు ఇదీ వీట్-నాం బాల సంఘాల చరిత్ర క్లుప్తంగా.

మీరుకూడ వీట్-నాం బాల వీరులవలె తయారవుతారు గదూ! చెప్పటం మరచా! మన ఉప్పుగుండూరు, బొద్ద



పాడు, ప్రొద్దుటూరు బాలసంఘాలుకూడ చక్కగా చే వ్రాత పత్రికలను నడుపుతున్నాయి. ఎంతో ముచ్చటగా నున్నవి. మరిమీసంఘంకూడా నడుపుతుందా? మీపత్రిక 'నవయుగ'కు పంపుట మరువరుకదూ! వస్తా! మళ్ళీ కలుసుకుందాం.

మీ చిట్టన్న



గాలివానలను ఆపవచ్చు తుఫానులనిరోధించవచ్చు

పరమాణు శక్తితో ప్రకృతిని మనఇష్టంవచ్చినట్లు మార్చుకోవచ్చు

—ఇలిన్ రచన

మానవుడు పరమాణు శక్తిని తెలుసుకున్నాడు. ఉపయోగించడంకూడా నేర్చుకున్నాడు. దాని ఫలితాలనుకూడా ప్రపంచం కొద్దిగా చవిచూచింది. నిజంచెప్పాలంటే ఈపరమాణుశక్తిని ఉపయోగించడం నేర్చుకోవడంతో ప్రపంచ చరిత్రలో ఒకనూతనఅధ్యాయం ప్రారంభమైనదని చెప్పాలి అందుచేత పరమాణుశక్తి అంటేఏమిటి అనికాకుండా పరమాణుశక్తి ఎందుకు? అని ప్రశ్నించుకోవడం మంచిది ఎందుకోసం మానవుడీశక్తిని కనిపెట్టాడు దీనిని తనచేతిలో పెట్టుకుని ఏంచెయ్యాలని?

యాటంబాంబు

ఒకటి మనం చూశాం, అది యాటంబాంబు. ఈ బాంబు ఏంచెయ్యగలదో కూడాచూదాం యాటంబాంబు యుద్ధంలో పుట్టింది. ఒకమారణ సాధనంగా పుట్టింది. యుద్ధంచేసే ఇరుపక్షాల సైన్యాలకే కాకుండా, నిరాయుధులైన ప్రజలపాలిటే ఒక మహామారణ సాధనంగా తయారైంది. అందుకే ఉద్దేశించబడింది కూడా అందుచేత ఈ యుద్ధంలో ప్రయోగింపబడిన మొదటి యాటంబాంబు ఒక్క మిలిటరీ కోటలనే కాకుండా? ఒకపెద్ద పట్టణాన్ని యావత్తూ భస్మీపటలం గావించి వేలకొలది నిరపరాధులు, నిరాయుధులు అయిన ప్రజల ప్రాణాలను హరించిందంటే మనం ఆశ్చర్యపడ నవసరంలేదు.

అయితే ఏదోఒక రాజ్యం ఈ "రహస్యాన్ని" తన చేతిలోనే పెట్టుకొని తన సామ్రాజ్య విస్తరణకోసం ఇతర దేశ ప్రజలమీద ఇలా ప్రయోగిస్తూ కూర్చుంటే మానవజాతి గతి ఏంకావాలి? ప్రపంచ శాంతి మాటేమిటి?

ఈ 'రహస్యం' దాగదు

ఈ యాటంబాంబు రహస్యం ఎంతోకాలందాగదు ఎందుకంటే విజ్ఞాన పరిశోధనలను చేసేది ఒక్క అమెరికాయే కాదు చాలా దేశాలు చేస్తున్నాయి

వెనక తుపాకిమందును కనిపెట్టిన రోజర్ బేకన్ కూడా ఇలాగే భ్రమపడ్డాడు మానవుడు దానిని మారణ సాధనంగా ఉపయోగిస్తాడేమోననే భయంతో ఆ రహస్యం ఎవరికీ తెలియకుండా దాచిపెట్టాలనుకున్నాడు కాని అది రహస్యం కానేకాదు. అతనికంటే ముందేచైనాలో అది కనిపెట్టబడింది. అలాగే ఈ యాటంబాంబుకూడా ఒక "రహస్యం" కానేరదు. అందులోనూ, విజ్ఞానపరిశోధనలు ఎంతో అభివృద్ధిచెందుతూ వున్న ఈ ఆధునిక యుగంలో అది "రహస్యం" అసలే కాదు ఒకడు ఒకరకం యాటంబాంబును కనిపెడితే వాడి వెనకాలే మరొకడు దానిని మించిన ఇంకోయాటంబాంబును కనిపెడతాడు. ఒకటి రెండు పట్టణాలనేగాకుండా ఒక చిన్న దేశాన్ని దేశాన్నే భస్మంచేయగల యాటంబాంబును నిర్మించవచ్చు. ఇందులో ఆశ్చర్య పడవలసిన దేమీలేదు

అసలు ప్రశ్న

అందుచేత అసలు ప్రశ్న అదికాదు. ఈ పరమాణుశక్తి మానవజాతిని నాశనంగావించే ఒక మారణ సాధనంగానే ఉపయోగపడాలా, లేక మానవ జీవితాన్ని ఇంకాసౌఖ్యవంతం

చేసుకోడానికి, కొత్త జీవితాన్ని నిర్మించుకోడానికి ఉపయోగపడాలా అనేదే మానవజాతివినేడు ఎదుర్కొంటున్న అసలు ప్రశ్న. ఈ రెండుమార్గాల్లో మానవుడు దేనిని అవలంబిస్తాడు?

నిజం చెప్పాలంటే మానవాభ్యుదయం కోసం ఈ పరమాణుశక్తి ప్రయోజనాలు ఎలా వుంటాయి అనేది కూడా మనం ఈనాడు నిర్ణయించలేం. కొన్ని అవకాశాలు మట్టుకు వూహించవచ్చు దీనితో రెండడుగుల పొడుగులో విమానానికి ఇంజను నిర్మించవచ్చు. ఎన్నో కిలోవాట్ల విద్యుచ్ఛక్తిని సప్లయి చేయగల యంత్రాన్ని ఒకజేబులో పట్టేటంత చిన్న సైజులో తయారుచేయవచ్చు. ఇలాగే అనేక అద్భుత విజయాలను సాధించవచ్చు. అవన్నీఎలావుంటాయి అంటే, ఇప్పుడుమనం చూచే ప్రపంచంలోని వాటితో పోల్చిచూడటానికేవీలుండదు. అదిమాత్రం చెప్పవచ్చు. యాటంశక్తితో నడిచే రైలుఇంజను ముందు ఇప్పుడు మనం ఉపయోగించే రైలుఇంజను దయ్యంలాగా వట్టి అనవసర గజిబిజియంత్రముగా వుంటుంది. యంత్ర నిర్మాణంలో వాటిపరిమాణంలో మార్పుతోపాటు వాటి గుణంలోకూడా పెద్దమార్పువస్తుంది. మానవుడు నేటికంటే ఎంతో శక్తివంతుడవుతాడు. మానవుడు ఇంతవరకూ కలలుగన్న ఎన్నో విషయాలను చేయగలుగుతాడు, అంతేగాకుండా అతను ఇదివరకు ఊహించలేని ఎన్నోవిషయాలను ఇకముందు చేయగలుగుతాడు.



“ ది రేస్ ట్రాక్ ”

పరమాణు విధ్వంసక యంత్రము

రసాయన శాస్త్రజ్ఞులు ఇదివరకు 'సీసం'ను బంగారంగా మార్చే పద్ధతులకొరకు కలలుకన్నారు. కాని కొత్తలోహాలనే సృష్టించవచ్చునని ఎవరూ ఊహించలేదు.

తుపానును నిరోధించవచ్చు

గాలిని ఆపే విషయం ఆలోచిద్దాం కొద్ది రోజుల క్రిందటి వరకూ అసలుగాలిని మనఇష్టంవచ్చినట్లు కంట్రోలు చేయవచ్చునని అనుకోలేదు. తుపానును నిరోధించే శక్తిని సంపాదించ వచ్చునని అసలు అనుకోలేదు.

కాని పరమాణువు శక్తిని కనిపెట్టడంతో పరిస్థితి అంతా మారింది. గాలిని కంట్రోలు చేయడం ఈ రోజున ఒక కల కాదు. శాస్త్రజ్ఞులు పరిశోధనాలయాలలో గాలిని కంట్రోలు చేసే పరిశోధనలకు పూనుకోడానికి అవకాశాలు ఏర్పడ్డాయి గాలి ప్రవాహముల (Air currents) ను, అవిపోయే దిక్కునుండి మరొక దిక్కుకు మరల్చ వచ్చునని ఈమధ్య సోవియటు శాస్త్రజ్ఞుల సమావేశంలో విజెనిఫ్యొడొరావ్ అనే సోవియటు శాస్త్రజ్ఞుడు ప్రకటించాడు ఇంకొక శాస్త్రజ్ఞుడు ఒక కృత్రిమ తుపానును కల్పించ డానికి ఎంత యురేనియమ్ 235 (దీని అణువులనుండే పరమాణు శక్తిని కనిపెట్టారు) కావాలో లెక్కలు తీయడానికి ప్రయత్నించాడు.

ఇంకొక విషయం పరిశీలిద్దాం సోవియటులో గా లి మార్పులను తెలుసుకునే స్టేషన్‌కు ఈమధ్య ఒక రిపోర్టు వచ్చింది. ఆర్కిటిక్ సముద్రంనుండి ఒకచలి తుపాను దక్షిణ దిక్కుగా రాబోతూ ఉందని ఆ రిపోర్టు సారాంశం. ఇదేకనుక వస్తే దక్షిణాన పంటలన్నీ నాశన మవుతాయి ఇటువంటి తుపానే 1924లో ఒక సారి వచ్చింది కూడా.

దీనిని ఆపడానికి ఇంజినీర్లు తయారవుతున్నారు వీళ్లు చేయబోయేది ఏమంటే కారాసముద్రానికి ఉత్తరంగా ఒక కృత్రిమతుపానును సృష్టించ దలచుకున్నారు. ఈ తుపాను ఆర్కిటిక్ సముద్రంనుండి రాబోయే చలిగాలిని ఆకర్షించి దక్షిణంగా గాకుండా ఉత్తరానికే ప్రవహించేటట్లు చేస్తుంది. ప్రజలుగాని, పంటలుగాని లేని ఈశాన్యదిక్కుగా దీనిని పోయేటట్లుచేసి దక్షిణాన ప్రజలను, పంటలను రక్షించ బూనుకున్నారు.

వేడిని గ్రుమ్మరించడం!

మరొకవిషయం చూద్దాం. రేడియో కంట్రోలుతో నడచే విమానాలు కొన్నిబయలుదేరి మంచుగడ్డయైన ఆర్కిటిక్ మహాసముద్రానికిపోయి పరమాణుశక్తి సహాయంతో అచ్చట వేడిని 'గ్రుమ్మరించవచ్చు'. ఈవేడి ఎంతోకాలమునుండి మంచుగడ్డలుగావున్న ఆర్కిటిక్ సముద్రాన్ని పునాదులతో కదుపుతుంది. మంచుగడ్డలు కరుగుతాయి. అంతులేనివేడి ఉత్పన్నమై పైకుబుకుతుంది. ప్రక్కలనున్న చలిగాలి ఈవేడి ఉత్పన్నమయ్యే ప్రదేశానికి పరుగెత్తుతుంది.

ఆర్కిటిక్ మహాసముద్రంమీద ఒకకృత్రిమ తుపాను బయలుదేరుతుంది.

మానవునిచే సృష్టించబడ్డ ఈతుపానును మన ఇంజినీర్లు రాడార్ తెరలముందు నిల్చుని చూస్తుంటారు.

మీరు ఇదంతా వట్టి పిచ్చిఅంటారేమో ? కాదు. ఇదంతా మనమీదనే ఆధారపడి యుంటుంది

కొద్దికాలం క్రిందట మానవుడు ప్రకృతి శక్తులకన్నా చాలాబలహీనంగా ఉన్నాడు. నేడు ఆ పరిస్థితులు మారినాయి. ముందుఇంకా మారనున్నాయి.

పరమాణుశక్తిని కనిపెట్టడంతో మానవుడు ఒక కాశ్మిక్‌శక్తి అయ్యాడు. అతడు ఇకగాలిని కంట్రోలు చేయగలుగుతాడు అతడు శీతోష్ణస్థితిని మార్చగలుగుతాడు అతడు పరమాణువును చీల్చడమే గాకుండా కొత్త పరమాణువులను సృష్టించ గలుగుతాడు. ఈ క్రొత్తగా సృష్టించు పరమాణువులు ఎన్నో నూతన శక్తులు కలిగిఉంటాయి.

ఏ మార్గాన పోదాం ?

మానవుడు ఏ మార్గం అవలంబింప దలచుకున్నాడు ? యుద్ధాలు అనేవి లేకుండాచేసి నూతన జీవితం సృష్టించుకోడానికి సైన్సును ఉపయోగించుకుంటాడా ? లేక సైన్సును యుద్ధాలకోసం, ప్రపంచాన్ని నాశనం చేయడంకోసం ఉపయోగిస్తాడా ? సౌఖ్యవంతమైన, ఆనందమయ జీవితాన్ని ఏర్పరుచుకుంటాడా లేక ప్రపంచాన్నే బూడిదపాలుచేసి మృగాలకు, నరహంతకులకు స్థావరంగా చేస్తాడా ?

మానవుడు సౌఖ్యవంతమైన ఆనందమయ జీవితాన్నే కోరుతాడని మేము ఆశించుతాం. వివిధదేశాలను ప్రపంచాన్ని యుద్ధంలోకి ఈడ్చి ప్రపంచ నాశనానికి పూనుకునే వారికి అవకాశాలు లేకుండా ఒక నూతన జీవితంకోసం ప్రపంచకల్యాణంకోసం అందరూకృషిచేస్తారని ఆశించుతాం.

(" సోవియట్ వీక్లీ " నుండి)

తూర్పు గోదావరిజిల్లా యువజన మహాసభ

స్వతంత్రమంటే - తిండీ, బట్టా
చదువూ, వోటూ - స్వేఛ్ఛేనోయ్

అనేగేయంతో ప్రారంభమైంది తూర్పుగోదావరిజిల్లా యువజన మహాసభ మార్చి 14, 15, 16 తేదీలలో పసలపూడిలో. మహాసభకు శ్రీయుత బుచ్చిరాజుగారి అధ్యక్షత వహించారు. శ్రీయుత ఎ. సోమసుందర్‌గారు జండానెగురవేశారు, డాక్టర్ చెవినేని రామారావుగారు మహాసభను ప్రారంభిస్తూ యువకులందరూ కలిసి ప్రజారక్షణ చట్టాన్ని రద్దుచేసేవరకు ఆందోళన చేయాలన్నారు. తరువాత అధ్యక్షులు మాట్లాడుతూ బ్రిటిష్ కుట్రను ఎప్పటికప్పుడు బట్టబయలుచేస్తూ అంతిమ పోరాటానికి యువకులందరు సిద్ధంగా ఉండాలన్నారు. మొదటి రెండురోజులు ఆటల పోటీలు దిగ్విజయంగా జరిగాయి. ఈజిల్లా యువకులకు ఇంతవరకు ఆటల పోటీలలో పాల్గొనే అలవాటు ఎక్కువలేదు. అయినప్పటికి ఎంతోఉత్సాహంగా పాల్గొన్నారు. చెడుగుడు, బాడ్‌మింటన్ కేరమ్సు, టగ్ ఆఫ్ పవర్, సైకిల్‌వేగము, నెమ్మది ఈత, పొడుగు దూకుట వందగజాల పరుగు, మొదలగు ఆటలలో పోటీలు జరిగాయి చెడుగుడు, బాడ్‌మింటన్ ఆటల పోటీలలో 25 టీములు పాల్గొన్నాయి. మిగితా పోటీలలో 200 యువకులు పాల్గొన్నారు. చెడుగుడులో రామచంద్రపురం టీం మొదటిదిగాను, బాడ్‌మింటన్‌లో దుళ్ళ టీం మొదటిదిగాను వచ్చాయి. ఈపోటీలు జిల్లా యువజన సంఘంఆధ్వర్యాన మొదదిసారిగా పెట్టినప్పటి 24 టీములు 200 యువకులు పాల్గొనడం జిల్లా యువజనసంఘ చరిత్రలోనే నూతన అధ్యాయం ప్రారంభమైనదని చెప్పాలి. 14వ తేదీ రాత్రి రాయవరం దళంచే "అపనిం" నాటకం ప్రదర్శింపబడింది. వైజ్ఞానిక రూపాలనుకూడా అర్ధంచేసుకొని ముందుకు తీసుకురావడానికి జిల్లా యువజనసంఘం ఎంతో కృషిచేస్తోందనడానికి ఇదొక నిదర్శనం. శారీరక, వైజ్ఞానిక కార్యక్రమాలను ఎంతో జయప్రదంగా నడిపి యువజన సంఘం ఒకప్రత్యేకతను సంపాదించింది. మొత్తం61మంది ప్రతినిధులు వివిధ తాలూకాలనుండి విచ్చేసి అనేక ముఖ్య సమస్యలను చర్చించారు. ఉపాధ్యాయుల పోరాటాన్ని బలపరుస్తూ, వీట్‌నామ్ ప్రజల వీరోచిత పోరాటాన్ని అభినందిస్తూ తీర్మానాలు చేయబడ్డాయి.

రాబోవు సంవత్సరానికి నూతన కార్యనిర్వాహకవర్గ ఎన్నికలు జరిగాయి. శ్రీయుత బి. బుచ్చిరాజుగారు అధ్యక్షులుగాను శ్రీ ఎ. సోమసుందర్‌గారు ఉపాధ్యక్షులుగాను, శ్రీ ఎ. మాణిక్యాలరావుగారు ప్రధాన కార్యదర్శి శ్రీ యస్. వి. రత్నంగారు సహాయకార్యదర్శిగాను ఎన్నుకోబడ్డారు. మొత్తం పోటీలకు మహాసభకు 7000 మంది ప్రజలు వచ్చి ఆనందించారు.

ప్రస్తుతం తూర్పు గోదావరిజిల్లా యువజన సంఘం, 2500 సభ్యత్వంతో 8 తాలూకాలలో, 4 పట్టణాలలో పనిచేస్తోంది. వచ్చేమహాసభనాటికి 10000 సభ్యత్వాన్ని చేర్పించాలనే ప్రతిజ్ఞతో యువజనసంఘ కార్యకర్తలు తమ తమ ప్రాంతాలకు వెళ్ళారు.

రాజమండ్రి తాలూకా యువజనమహాసభ

రాజమండ్రి తాలూకా ప్రథమ యువజనమహాసభ జనవరి 14, 15, 16, 17 తేదీలలో రాజమండ్రి పట్టణంలో చాల జయప్రదంగా జరిగింది. ఫుట్‌బాల్, వాలీబాల్, రింగ్ టెన్నిస్, కేరమ్సు మొ॥ ఆటలలో పోటీలు జరిగాయి, వెనుకబడిన తాలూకా అయినప్పటికి దాదాపు 100 మంది యువజనులు, విద్యార్థులు ఆటలపోటీలలో అమితోత్సాహంతో పాల్గొన్నారు. పొడుగుదూకుట, ఎత్తుదూకుట, సైకిల్ వేగముగా త్రొక్కుట, 100 గజాల పరుగు, తాడు లాగుట మొ॥ పోటీలుకూడ జరిగాయి. మొత్తం అన్ని పోటీలలో 300 మంది యువకులు గల 60 టీములు

వైజ్ఞానికపోటీలు, ఉపన్యాసపోటీలుకూడ జరుపబడ్డాయి. రాజమండ్రి తాలూకా మెట్టప్రాంతమైనప్పటికీ ప్రథమంగా ఆటలపోటీలలో 300 మంది యువకులు పాల్గొని తూర్పు గోదావరిజిల్లా యువజనసంఘ చరిత్రకు నూతనశకాన్ని ప్రారంభించారు. మెట్టప్రాంతాలయువకులకు ఆదర్శప్రాయులయ్యారు.

అమలాపురం తాలూకా
ద్వితీయ యువజన మహాసభ

అమలాపురం తాలూకా యువజన మహాసభ మార్చి 23వ తేదీన, చెయ్యేరుగన్నేపల్లి గ్రామంలో జయప్రదంగా జరిగింది. ఆటల పోటీలు, వైజ్ఞానిక పోటీలు జరిగాయి, తదుపరి ప్రతినిధుల సమావేశం జరిగింది. ప్రజారక్షణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలనీ, చట్టంపేరు అరెస్టు చేసిన వారినందర్నీ వెంటనే విడుదల చేయాలనీ, ఉపాధ్యాయుల హక్కుల గుర్తించాలని, తెలంగాణా ప్రజల వీరోచిత పోరాటాలను బలపరుస్తు తీర్మానాలు చేయబడ్డాయి. నూతన సంవత్సరానికి కార్యనిర్వహక వర్గం ఎన్నుకోబడింది. మొత్తం ఆటల పోటీలలో 200 మంది యువకుసు పాల్గొని జయప్రదం చేసారు.

For All Progressive Books
&
For All Books from Moscow

ORDER TO:

The Leela Book Depot

Governorpet : BEZWADA

The following Books are available:

1) Lenin selected works Vol. 1	Rs. 4- 0-0
2) The Materialist conception of History	0- 3-0
3) Role of Individual in History	0- 3-0
4) The Great Patriotic War by Stalin	0-12-0

10% commission
on the above to all dealers

1) Gorky Authology	5- 0-0
2) Science & Everyday Life by Haldane	4- 8-0
3) America to Japan	3- 0-0
4) Two Leaves & A Bud by Mlukraj Anand	4 0-0
5) Edges Ways & the Soviet by Harindranath	1- 8-0
6) Stalin & Lenin Photos	0- 4-0

25% commission
on the sale to all dealers

బంకిం ప్రొడక్ట్సువారి
స్పెసిఫిక్సు అమ్మకమునకు

కమీషను బేసిస్సుమీద

ఏజంట్లు కావలెను

B. P. 1 ఇది అన్ని రకాలైన విషములను తీసవేసి బాధనునివృత్తిచేయును. (తేలు, పాము, పిచ్చికుక్క, మనిషి కొరుకుడు మొదలైనవి) ఇంకా ఇది రొమెటిక్ పెయిన్సు. అపెన్ డెక్సుకుకూడ పనిచేయును. రొమెటిక్ పెయిన్సు వల్ల కాళ్ళు చేతులు పట్టుకు పోయినట్లయిన ఈ మందు వాడండి. నాల్గవరోజుకు గుణం కల్గించును.

1 డ్రామ్‌పిల్సు 0-10-0

B. P. 2 ఇది బుద్ధను మాన్పుటలో అగ్రగణ్యమైనది. ఎన్ని సంవత్సరములనుంచి వున్నప్పటికి దీనిని వాడిన ఆశాభంగము గలుగనేరదు.

1 డ్రామ్‌పిల్సు 3-0-0

B. P. 3 ఇది స్త్రీలపాలిటి కల్పవృక్షము. ఎన్ని సంవత్సరములనుంచి వున్న ముట్టు కుట్టునొప్పి అయినప్పటికీ తప్పక నొప్పిని నిర్మూలించి గర్భకోశమును శుభ్రపరచును. నెలరోజులకు సరిపోవుమందు 4-8-0

B. P. 4 ఇది స్త్రీలకు వచ్చునట్టి గుండెదడ, ఇస్టీరియాను నిర్మూలించి బలమును కలుగజేయును.

నెలరోజులకు సరిపోవుమందు 5-0-0

B. P. 5 ఇది వేడిగాని, ఏరకమైన జ్వరంగాని ప్రధమావస్తలో 4 మాత్రలు సేవించిన ఎడల 20 నిమిషములలో గుణం గల్గించును. సీసా 0-12-0

బంకిం ప్రొడక్ట్సు, బెజవాడ.

అగ్ని ప్రమాదాలు లేకుండా చేయడం

అగ్నిప్రమాదాల మూలకంగా కలుగుతున్న ధననష్టం, జననష్టం విస్తారం. ఇవి కలుగకుండా చేయగలిగితే సంఘానికి మిక్కిలి ప్రయోజనం. చాలాచోట్ల ఇందుకు ప్రయత్నాలు చాలాజరుగుతున్నాయి అయితే అది వ్యక్తులను జాగ్రత్తగా వ్యవహరించ వలసిందని హెచ్చరించడంవల్ల కాదు. అంటుకొన్న తరువాత ఆర్పేసే కొత్త ఉపాయాలు కనిపెట్టడంమూలంగానూకాదు అసలు వస్తువులు మండకుండా ఉండేటట్టు చేయాలనే ప్రయత్నం. ఈ మధ్య అమెరికాలోని "దపాంటు" కంపెనీవారు గుడ్డలూ, కాగితాలూ మండకుండా చేసే పదార్థం ఒకటి తయారుచేసినట్లు ప్రచురించారు. ఆ పదార్థంతో పూతపూస్తే ఇంక ఆవస్తువులు మండవట అంటే అసలు అంటుకోవనికాదు. నిప్పంటుకొని రగిలినా మంటమాత్రంరాదు ఆ పదార్థం పట్టించిన గుడ్డకు స్వాభావికంగా ఉండే మెత్తదనం పోవడంకాని బిరుసెక్కడంకానిఉండదు మంటరాకుండాచేసే ఆ పదార్థం విరివిగా తయారు చేయనున్నట్లు తెలుస్తుంది. ఇటీవల మన దేశంలో డెహ్రాడూన్‌లోని ఫారెస్టు రిసర్చి ఇన్‌స్టిట్యూటులో కలపా, గడ్డీ వగయిరాలు మండకుండా ఉండే ఉపాయం గురించి కొంతకృషి జరిగింది. ఈ విషయం గురించి ఆ ఇన్‌స్టిట్యూటువారు ఒక చిన్న పుస్తకం ప్రచురించారు కలపా, గడ్డీ వగయిరాలు మండకుండా ఉండే ఉపాయం కనిపెట్టారు డెహ్రాడూన్ ఇన్‌స్టిట్యూటులో వెదురు మండకుండా ఉండేపద్ధతి కనుగొన్నారు కాని తాటాకు మండకుండా ఉండడానికింకా పరిశోధన జరుగలేదు ఇది జరిగితే తెలుగుదేశంలో ప్రతి వేసవిలోనూ కలిగే అగ్నిప్రమాదాలను ఆపి సంఘానికి గొప్ప సేవ చేసినవారవుతారు.

— "విజ్ఞానం" నుండి

ది స్టూడెంటు నిధికి తోడ్పడండి

ఆర్థికపరిస్థితులచే అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ పక్ష పత్రిక 'ది స్టూడెంటు' నిల్పివేయబడింది. పత్రికయొక్క ఆదాయవ్యయపట్టిక వివరాలు ఇవి;

బ్యాంకులోని డబ్బు	రూ.	770
చేతిలోని డబ్బు		400
	మొత్తం	1170
చెల్లించవలసిన అప్పులు		1649
నిల్వపోను తేలే బాకీ		479

ఏజన్సీలు బాకీలు చెల్లించలేకపోవుటచే పత్రిక అప్పులు పాలవవలసి వచ్చింది. భారతదేశంలో 'స్టూడెంటు' ఒక్కటే నేడున్న విద్యార్థుల పత్రిక ఆ 'స్టూడెంటు' ఆర్థిక కారణములద్వారా మూసివేయబడడం విద్యార్థి ఉద్యమానికే తలవంపు ఏజన్సీలు బాకీలు చెల్లించువరకు పత్రిక తిరిగి ప్రారంభింపబడదు. ఏజంట్లు శెలవలలో యిండ్లవద్దనున్నా వెంటనే పత్రిక శ్రేయస్సునుగుర్తించి బాకీలు చెల్లించుదురని ఆసించుతున్నాం.

సునీల్ ముష్షి
సంపాదకుడు, ది స్టూడెంట్

నూతనంగా ఏర్పడిన ప్రపంచ యువజనసమాఖ్య, ప్రపంచ విద్యార్థిసంఘములతో విద్యార్థి ఫెడరేషన్ బర్చులు విపరీతంగా పెరిగినవి ఇతరదేశ ఉద్యమాలతో మనం సంబంధములను నెలకొల్పుటకు ప్రేగ్‌లో జరుగనున్న 'ప్రపంచ యువజన' ఆటలపోటీలకు, కౌన్సిల్ సమావేశముకు విద్యార్థి ఫెడరేషన్ ప్రతినిధులుగా కార్యదర్శివిగాని లేక మాజీకార్యదర్శి సత్యపాలునుగాని పంప వర్కింగ్ కమిటీ నిర్ణయించింది. ప్రేగులో ప్రపంచ విద్యార్థిసంఘ కార్యాలయంలో అ॥ భా॥ వి॥ ఫెడరేషన్ ప్రతినిధిగా పని జేయుటకు శ్రీమతి విమలబకాయను గూడా పంప నిర్ణయించింది ప్రపంచయువకులతో భారతయువకులకు సన్నిహిత సంబంధము నేర్పరచుకొనుటకు యిట్టిపని అత్యవసరం కాని యిది అధికవ్యయంతో కూడుకొన్నది మన ప్రతినిధులను ప్రేగు పంపుటకు 5,000 రూ॥లు అవసరం విద్యార్థి ఫెడరేషన్ సభ్యులెల్లరు ఉదారంగా విరాళములు యీ క్రింది అడ్రసుకు పంప విజ్ఞప్తి జేయుచున్నాం. పత్రికను వెంటనే ముద్రించుటకు అప్పులను ప్రతి ఏజంటూ చెల్లించగోర్తాము.

ఆనందశంకర భట్టాచార్య.
కార్యదర్శి, అ॥ భా॥ విద్యార్థి ఫెడరేషన్

A I. S. F. 350 Lamington road BOMBAY

Printed by S. V. Narasaiah at the Prajasakti Press, Mogalrajapuram, Bezwada.
& Published by K [illegible] from Navayuga office 8th line Arandelpet. Guntur
Editor S V Narasaiah